



వరాహావతారంలో జగన్నాథుడు

మహారాణిపేట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): రథోత్సవాల్లో భాగంగా వన్‌టౌన్‌లోని టర్నర్ చౌల్ట్రీలో జగన్నాథస్వామి సోమవారం భక్తులకు వరాహ అవతారంలో దర్శనమిచ్చారు. అర్చకులు ఉదయం నుంచి స్వామివారికి విశేష అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైభవ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఆలయ అధికారులు జగన్నాథస్వామికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి టి.రాజగోపాలరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులకు తాగునీరు, ప్రసాదం, అన్న సమారాధన ఏర్పాటుచేశారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మంగళవారం జగన్నాథస్వామి నారసింహావతారంలో దర్శనమిస్తారు.

సారథులు మనోళ్లే...

రెండు ప్రధాన పార్టీలకు రాష్ట్ర అధ్యక్షులుగా విశాఖ వాసులు

రాజకీయ చిత్రపటంలో కీలకంగా నగరం

- ఇరువురూ ఉన్నత విద్యావంతులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర రాజకీయ చిత్రపటంలో విశాఖపట్నం ఇప్పుడు కీలకంగా మారింది. కూటమి ప్రభుత్వంలో మూడు పార్టీలు ఉండగా వాటిలో ప్రధానమైన తెలుగు దేశం పార్టీకి రాష్ట్ర అధ్యక్షులుగా గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు వ్యవహరిస్తున్నారు. మరో పార్టీ బీజేపీకి రాష్ట్ర అధ్యక్షులుగా మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ ఎన్నికకాబోతున్నారు. ఆయన కూడా విశాఖపట్నం వాసే కావడం గమనార్హం.



పల్లా శ్రీనివాసరావు
టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు



పీవీఎన్ మాధవ్
బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు

గత ఏడాది జరిగిన ఎన్నికల్లో రాష్ట్రంలో అత్యధిక మెజారిటీతో గెలుపొందిన గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవిని ఇచ్చి గౌరవించింది. యాదవ సామాజిక వర్గానికి చెందిన ఆయన 2019-24 మధ్య పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వైసీపీ పెద్దలు ఎన్ని తాయిలాలు చూపినా పార్టీని వీడకుండా ఉండి, వారి వేధింపులను ఎదుర్కొన్నారు. గాజువాకలో ఆయన నిర్మిస్తున్న వాణిజ్య భవన సముదాయాన్ని కూలగొట్టినా లొంగకుండా పార్టీ కోసం నిలబడ్డారు. స్టీల్ ప్లాంటు ఉద్యోగుల కోసం నిరాహార దీక్ష చేపట్టారు. ఆయన్ను బీసీల నాయకుడిగా గుర్తించి అధిష్ఠానం పార్టీ అధ్యక్షుడిని చేసింది. పల్లా శ్రీనివాసరావు తండ్రి సింహాచలం కార్మిక సంఘ నాయకుడిగా గుర్తింపు తెచ్చుకొని ఆ తరువాత ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆయన వారసత్వాన్ని పల్లా నిలబెట్టారు.

ఇప్పుడు అదే కోవలో మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్‌కు బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి లభించింది. మాధవ్ తండ్రి పీవీ చలపతిరావు కూడా స్థానిక సంస్థల నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికయ్యారు. ఆయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆరేళ్లు పార్టీ రాష్ట్ర అధ్యక్షునిగా పనిచేశారు. తండ్రి బాటలోనే మాధవ్ విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లోకి వచ్చి దేశమంతా పర్యటించారు. పార్టీ సిద్ధాంతాలను ఔపాసన పట్టి ఆ మార్గంలోనే ముందుకు నడిచారు. పార్టీలో కీలక పదవులు నిర్వర్తించారు. బీజేపీలో తండ్రితో పనిచేసిన అగ్ర నాయకులందరితో సత్సంబంధాలు ఉండడం, మృదుస్వభావం కలిగి, పార్టీ ఉన్నతి కోసం నిత్యం క్షేత్రస్థాయిలో పనిచేస్తుండడంతో అధిష్ఠానం ఆయన సేవలను గుర్తించింది. గతంలో నాటి

... మిగతా 6వ పేజీలో

549 మంది డిజిటల్ అసిస్టెంట్లకు బదిలీ



కౌన్సెలింగ్‌కు హాజరైన డిజిటల్ అసిస్టెంట్లు

విశాఖపట్నం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): గ్రామ/వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న 549 మంది డిజిటల్ అసిస్టెంట్ల బదిలీలు సోమవారం నిర్వహించారు. జిల్లా పంచాయతీ కార్యాలయంలో కౌన్సెలింగ్‌కు ఉమ్మడి జిల్లా డిజిటల్ అసిస్టెంట్లు హాజరయ్యారు. విశాఖపట్నం జిల్లా పంచాయతీ అధికారి ఎంఎస్‌వీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మెరిట్/సీనియారిటీ జాబితా ప్రకారం ఆప్షన్లు తీసుకుని బదిలీలు చేశారు. కొందరు డిజిటల్ అసిస్టెంట్లు పోస్టింగ్ కోసం కూటమి పార్టీలకు చెందిన ప్రజా ప్రతినిధుల నుంచి సిఫారసు లేఖలు తీసుకువచ్చారు. కాగా మత్స్యశాఖ ఆధ్వర్యంలో 61 మంది ఫిషరీస్ అసిస్టెంట్లకు బదిలీ చేశారు. వ్యవసాయ శాఖలో రెండు రోజుల క్రితం చేపట్టిన బదిలీలకు సంబంధించి సోమవారం ఉత్తర్వులు ఇచ్చారు.

207 మంది ఏఎన్ఎంలకు...

విశాఖపట్నం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విశాఖ జిల్లాలోని

... మిగతా 6వ పేజీలో

గంజాయి కేసులో ముద్దాయికి 14 ఏళ్ల జైలు

- రూ.1.4 లక్షల జరిమానా

విశాఖ లీగల్/ఎలమంచిలి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా చేస్తున్న వ్యాన్ డ్రైవర్‌కు 14 సంవత్సరాల జైలు శిక్ష, రూ.1.4 లక్షల జరిమానా విధిస్తూ ప్రధాన మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఎం.వెంకటరమణ సోమవారం తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో ఆరు నెలలు జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని తీర్పులో పేర్కొన్నారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ జీఎస్ఎన్‌వీ ప్రసాద్ అందించిన వివరాలిలా ఉన్నాయి. అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం పెద్దఉప్పలం గ్రామంలో నివాసం ఉంటున్న నల్ల తేజోమూర్తి (45) వ్యాన్ డ్రైవర్. 2019 ఫిబ్రవరి 3న ఎలమంచిలి పోలీసులు జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో తేజోమూర్తికి చెందిన వ్యాన్‌లో 200 కిలోల గంజాయి ఉన్నట్టు గుర్తించారు. తేజోమూర్తిని అరెస్టు చేసి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎలమంచిలి సీఐ జి.నారాయణరావు కేసు నమోదు చేసి, విచారణ అనంతరం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. వాదోపవాదాల అనంతరం ముద్దాయి తేజోమూర్తిపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

నేడు సామాజిక పింఛన్లు పంపిణీ

విశాఖపట్నం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 1,58,662 మందికి సామాజిక పింఛన్ల కింద మంగళవారం రూ.69.59 కోట్లు పంపిణీ చేయనున్నారు. నాలుగు గ్రామీణ మండలాల్లో 26,265 మందికి రూ.11.04 కోట్లు, జీవీఎంసీ పరిధిలో 1,32,397 మందికి రూ.58.55 కోట్లు గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ద్వారా పింఛన్‌దారులకు అందజేస్తారు. మంగళవారం ఉదయం 6.30 గంటల నుంచి పింఛన్‌దారుల ఇళ్లకు వెళ్లి డబ్బు పంపిణీ చేస్తామని డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి తెలిపారు.

పెద్దాస్పత్రికి సుస్తీ

కేజీహెచ్‌లో ఆరు నెలలుగా నిలిచిపోయిన గుండె శస్త్రచికిత్సలు

- కీలకమైన పరికరాలు పనిచేయక పోవడమే కారణం
- రోగుల అవస్థలు...
- కొత్తవి కొనుగోలుకు సుమారు రూ.2.5 కోట్లు అవసరం
- అద్దె ప్రాతిపదికన తెచ్చిన పరికరం కూడా మొరాయింపు
- మల్లగుల్లాలు పడుతున్న ఆస్పత్రి అధికారులు
- ఉన్నతాధికారుల దృష్టికి సమస్య



పనిచేయని కీలక పరికరాలు

విశాఖపట్నం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి):

ఉత్తరాంధ్ర పెద్దాస్పత్రిగా పేరుగాంచిన కేజీహెచ్‌లో గడిచిన కొద్దిరోజులుగా గుండె శస్త్రచికిత్సలు జరగడం లేదు. ఆపరేషన్లు నిర్వహించేందుకు అవసరమైన కీలకమైన పరికరాలు పనిచేయకపోవడంతో సమస్య ఉత్పన్నమైనట్టు అధికారులు చెబుతున్నారు.

కేజీహెచ్‌లోని కార్డియాలజీ విభాగానికి ఉత్తరాంధ్రతో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాల నుంచి ప్రతిరోజూ పదుల సంఖ్యలో రోగులు వస్తుంటారు. అయితే, గడిచిన కొద్ది నెలలుగా ఇక్కడ ఓపెన్ హార్ట్ సర్జరీలు చేయడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ శస్త్రచికిత్సలు నిర్వహించాలంటే కొన్ని రకాల పరికరాలు అవసరముంటుంది. ఇందులో అత్యంత కీలకమైనది హార్ట్ లంగ్ మెషీన్. గుండెకు సరఫరా అయ్యే రక్తాన్ని డైవర్ట్ చేసి వైద్యులు శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేసేందుకు ఈ పరికరం ఉపయోగపడుతుంది. ఈ పరికరం కేజీహెచ్‌లో మూలకు చేరింది. ఒక సంస్థ నుంచి ఈ పరికరాన్ని అద్దె ప్రాతిపదికన తెచ్చి కొద్దికాలం శస్త్ర చికిత్సలు నిర్వహించారు. అయితే, కొన్నాళ్లుగా అది కూడా మొరాయించడంతో శస్త్రచికిత్సలు నిర్వహించలేని పరిస్థితి ఏర్పడింది. అలాగే, గుండె శస్త్ర చికిత్స సమయంలో టెంపరేచర్‌ను నిర్వహించడం అన్నది చాలా కీలకం. ఇందు కోసం టెంపరేచర్ కంట్రోల్ మెషీన్‌ను వినియోగిస్తుంటారు. ఈ మెషీన్ కూడా కొద్దిరోజులుగా పనిచేయడం లేదు. ఈ రెండు కీలక పరికరాలు పనిచేయకపోవడంతో కార్డియాలజీ విభాగంలో శస్త్ర చికిత్సలు నిలిచిపోయాయి. దీంతో నిరుపేద రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కేజీహెచ్‌లో ఉచితంగా చేసే ఈ శస్త్ర చికిత్సలను ఇప్పుడు ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి చేయించుకోవలసి వస్తోంది. అందుకు లక్షలాది రూపాయలు వెచ్చించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.

రెండున్నర కోట్లు కావాలి

ఈ శస్త్ర చికిత్సలు కేజీహెచ్‌లో నిర్వహించాలంటే హార్ట్ లంగ్ మెషీన్, టెంపరేచర్ కంట్రోల్ మెషీన్ అవసరముంది. ఒక్క హార్ట్ లంగ్ మెషీన్ సుమారు రూ.రెండు కోట్లు ఉంటుంది. అలాగే టెంపరేచర్ కంట్రోల్ మెషీన్‌కు మరో రూ.60 లక్షల వరకు ఖర్చవుతుందని అధికార వర్గాలు అంచనా వేస్తున్నాయి. అంత మొత్తం వెచ్చించడం ఆస్పత్రి అధికారులకు సాధ్యం

... మిగతా 6వ పేజీలో



కేజీహెచ్ కార్డియాలజీ విభాగం

ఏయూ దూర విద్యలో ఆన్‌లైన్ కోర్సులకు స్వస్తి?

- మూడేళ్ల కిందట 11 కోర్సులు ప్రారంభం
- తరగతుల నుంచి పరీక్షల నిర్వహణ వరకూ అన్నీ ఆన్‌లైన్‌లోనే...
- తుది పరీక్షలు మల్టీపుల్ చాయిస్ విధానంలో...!
- మొదటి నుంచీ విమర్శలు
- ప్రత్యేకంగా దృష్టిసారించిన వీసీ ప్రొఫెసర్ జీపీ రాజశేఖర్
- రద్దుకు యోచన



విశాఖపట్నం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): దూరవిద్యా కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించే ఆన్‌లైన్ కోర్సులకు స్వస్తి చెప్పే యోచనలో ఆంధ్ర విశ్వవిద్యాలయం అధికారులు ఉన్నట్టు తెలిసింది. ఈ కోర్సుల నిర్వహణపై విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో అధికారులు రద్దు చేయాలని ఆలోచన చేస్తున్నారు. ఏయూ దూర విద్యా కేంద్రం ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో కొన్ని కోర్సులు నిర్వహించాలని మూడేళ్ల కిందట (2022) అప్పటి పాలకులు నిర్ణయం తీసుకున్నారు. తొలుత రెండు కోర్సులను, ఆ తరువాత మరో తొమ్మిదింటిని ప్రారంభించారు. ప్రస్తుతం ఆన్‌లైన్ విధానంలో 11 కోర్సులను నిర్వహిస్తున్నారు. ఇందులో బ్యాచిలర్ ఆఫ్ ఆర్ట్స్ (హిస్టరీ, ఎకనామిక్స్, పాలిటిక్స్), బ్యాచిలర్ ఆఫ్ కామర్స్ (బీకాం), ఎంకాం, ఎంఏ పొలిటికల్ సైన్స్, ఎంఏ ఎకనామిక్స్, ఎంఏ హ్యూమన్ రీసోర్స్ మేనేజ్‌మెంట్, ఎంఏ జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, ఎంఏ ఇంగ్లీష్, మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (ఎంబీఏ), మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్ (ఎంసీఏ), ఎంఏ సోషియాలజీ వంటి కోర్సులు ఉన్నాయి. ఫీజు చెల్లింపు, తరగతులకు హాజరు, ఆఖరుకు పరీక్షలు నిర్వహణ కూడా ఆన్‌లైన్ విధానంలోనే చేపడుతున్నారు. ఈ విధానం వల్ల అవకతవకలు జరిగే అవకాశం ఉందన్న అనుమానాలు తొలి నుంచీ ఉన్నాయి. ముఖ్యంగా పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రంపై తీవ్రస్థాయిలో విమర్శలు వచ్చాయి. మల్టీపుల్ చాయిస్ విధానంలో పరీక్షలు నిర్వహించడంపై సీనియర్

... మిగతా 6వ పేజీలో

ఐదుగురి గుప్పిట్లో నైట్ ఫుడ్‌కోర్టు

నాడు వైసీపీ నేతల అండదండలతో అనధికారికంగా ఏర్పాటు



- ఒక్కొక్కరి చేతిలో పదేసి దుకాణాలు
- నెలకు రూ.15 వేలకు చొప్పున అద్దెకు ఇచ్చుకుంటున్న వైనం
- మిగిలిన స్థలం 36 చదరపు గజాల స్థలం చొప్పున మార్కింగ్ చేసి రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలకు అమ్మకం
- ఎవరైనా ప్రశ్నిస్తే రాజకీయ నేతల పేర్లు చెప్పి బెదిరింపు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

పాత జైలురోడ్డులో అనధికారికంగా నడుస్తున్న నైట్ ఫుడ్‌కోర్టులో రాజకీయ నేతల అండదండలు కలిగిన కొందరు చక్రం తిప్పుతున్నారు. అక్కడ దుకాణం పెట్టుకోదలచిన వారి నుంచి నెలకు రూ.15 వేలు అద్దె వసూలుచేస్తున్నారు. అంతకంటే ఎవరైనా ఎక్కువ అద్దె ఇస్తామని వస్తే అప్పటికే ఉన్నవారిని ఖాళీ చేయాలని ఒత్తిడి చేస్తున్నారు. ఎవరైనా అభ్యంతరం చెబితే తమ పొలిటికల్ బ్యాక్ గ్రౌండ్‌ను తట్టుకుని బతకలేవంటూ బెదిరిస్తున్నారు. నగరంలో రాత్రివేళ ఆహారం అందుబాటులో ఉంచాలనే ఉద్దేశంతో 2019లో జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ సంయుక్తంగా పాతజైలురోడ్డులో

... మిగతా 6వ పేజీలో

రెండు నెలల్లో 5వేల రూఫ్ టాప్ సోలార్ ప్లాంట్లు



పృథ్వీతేజ్

- అపార్టుమెంట్లలో ఉంటున్న వారికి వర్చువల్ నెట్ మీటరింగ్
- ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్

విశాఖపట్నం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) మే, జూన్ నెలల్లో పీఎం సూర్యఘర్ పథకం కింద ఐదు వేల సోలార్ పవర్ ప్లాంట్లు ఏర్పాటుచేసినట్టు సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి

... మిగతా 6వ పేజీలో



శ్మశానవాటికలో గుట్టగా ఉన్న డెబ్రిస్

శ్మశానవాటిక రహదారిలో డెబ్రిస్

మధురవాడ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 6వ వార్డు పరిధిలోని పోతినమల్లయ్యపాలెం శ్మశానవాటికకు వెళ్లే రహదారిలో కొందరు వ్యక్తులు డెబ్రిస్‌ను గుట్టలుగా వేస్తున్నారు. దీంతో మృతదేహాలను అంత్యక్రియలకు తీసుకువెళ్లేవారు ఇబ్బందులు పడుతున్నారు. పీఎంపాలెం ఆఖరి బస్టాపు సమీపంలో శ్మశానవాటిక ఉంది. ఇక్కడ హిందూ, ముస్లిం, క్రైస్తవులకు చెందిన మూడు వేర్వేరు శ్మశానవాటికలు ఉన్నాయి. చుట్టూ ప్రహరీ గోడ, గేటు లేకపోవడంతో కొందరు రాత్రి వేళల్లో డెబ్రిస్ వేస్తున్నారు. అధికారులు తక్షణమే స్పందించి డెబ్రిస్‌ను తొలగించడంతో పాటు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని జనసేన ఆరో వార్డు అధ్యక్షుడు సంతోష్‌నాయుడు, తదితరులు కోరుతున్నారు.

వెలిగిన వీధి లైట్లు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఎండాడ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 8వ వార్డులో వీధిలైట్లు ఎట్టకేలకు వెలిగాయి. వార్డులో వీధిలైట్ల నిర్వహణ అధ్వానంగా ఉందని 'ఆంధ్రజ్యోతి'లో సోమవారం వచ్చిన కథనానికి ఏఈ గాయత్రి స్పందించారు. సిబ్బందిని ఆయా ప్రాంతాలకు పంపించి, లైట్లకు మరమ్మతులు చేయించారు. ఇంకా కొన్నిచోట్ల లైట్లు వెలగడం లేదని, రెండు రోజుల్లో పరిష్కరిస్తామని ఆమె చెప్పారు.

తాగునీటి ఎద్దడి నివారణకు కృషి

కొమ్మాది, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ ఐదో వార్డు పరిధిలో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత తెలిపారు. సోమవారం ఆమె పరదేశిపాలెం, మారికివలసలో బోరు బావుల పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కొండవాలు ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు రూ. 2 కోట్లతో పైప్‌లైన్లు వేయించామన్నారు.సాయిరాం కాలనీలో రూ.3 కోట్ల అంచనా వ్యయంతో తాగునీటి స్టోరేజ్ ట్యాంకును నిర్మిస్తామని చెప్పారు. అలాగే వార్డులో ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ ఇవ్వడానికి ప్రయత్నిస్తామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి మొల్లి లక్ష్మణరావు, నాయకులు రాజు, అప్పల సూరిబాబు, ప్రసాద్, శ్రీకాంత్, ఎర్రయ్యరెడ్డి ,గోవిందరావు పాల్గొన్నారు.

ఆకతాయిలతో అవస్థలు

సాగర్‌నగర్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : సాగర్‌నగర్‌లోని పలు కూడళ్లు, హెచ్‌ఐజీ టు పార్కులో ఆకతాయిల అల్లరితో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలో ఉన్న ఓ బాయ్స్ హాస్టల్ వద్ద చీకటి పడితే చాలు చాలామంది కుర్రాళ్లు గుంపులుగా చేరుతున్నారు. అటుగా వెళ్లే మహిళలు, యువతలను కామెంట్లు చేస్తున్నారు. దీనికితోడు ఈ ప్రాంతంలో వీధి లైట్లు వెలగక అంధకారం నెలకొంటోంది. ఇదే అదునుగా కొంతమంది బైక్‌లపై విన్యాసాలు చేస్తూ.. భయాందోళనకు గురిచేస్తున్నారు.అలాగే హెచ్‌ఐజీ టు పార్కులో ఆకతాయిలు చేరి పెద్దగా అరుస్తూ, బూతు పురాణాలతో నివాసితులను ఇబ్బందులు పెడుతున్నారు. ఈ విషయమై పోలీసులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

వరాహావతారంలో జగన్నాథుడు



భీమునిపట్నం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఇంద్రజ్యుమ్న మందిరంలో జరుగుతున్న జగన్నాథస్వామి రథోత్సవాల్లో భాగంగా స్వామివారు వరాహావతారంలో భక్తులకు సోమవారం దర్శనమిచ్చారు. తెల్లవారుజామున ఆలయ అర్చకుడు రొంపిచెర్ల లక్ష్మీనరసింహ ప్రసాదాచార్యులు స్వామివారిని మేల్కొలిపి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. భీమిలి పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం శివ, కేశవ ఆలయ సముదాయం ఎగ్జిక్యూటివ్ అథారిటీ రొంపిచెర్ల సింగరాచార్యులు పలు ఆధ్యాత్మిక ప్రవచనాలు చేస్తూ, వరాహావతారం విశిష్టతను భక్తులకు వివరించారు. కాగా ఉత్సవాల్లో భాగంగా సోమవారం వీరా పంచమి కావడంతో శ్రీలక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు జరిపారు. శ్రీలక్ష్మీదేవి వైకుంఠం నుంచి భూలోకంలోకి అడుగుపెట్టిన రోజు కావడంతో సాయంత్రం గజ వాహనంపై పురవీధుల్లో తోటకూర అమ్మవారిగా పర్యటించారు. అనంతరం ఇంద్రజ్యుమ్న మందిరంలో మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు.

అధ్వానంగా గ్రామీణ రహదారులు

- వర్షం పడితే బురదమయం
- ప్రజలకు తప్పని ఇబ్బందులు
- ఏళ్ల తరబడి మరమ్మతులు కరువు
- పట్టించుకోని అధికారులు



బురదమయంగా సామయ్యవలస రహదారి

పద్మనాభం, పద్మనాభం రూరల్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గ్రామీణ రహదారులు అధ్వానంగా మారాయి. ఏనాడో వేసిన రోడ్లు కనీసం మరమ్మతుకు నోచుకోవడం లేదు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రోడ్ల మరమ్మతుల గురించి పట్టించుకోలేదు. దీంతో రహదారులు ఇంకా మట్టితోనే ఉండిపోయి, గోతులమయంగా మారిపోయాయి. చిన్న వర్షం వచ్చినా ఆ గోతుల్లో నీరు చేరి రోడ్డంతా బురదమయంగా తయారవుతున్నది. రాకపోకలకు ఇబ్బందిగా మారడంతో ఆయా గ్రామాల ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మద్ది పెద్ద చెరువు నుంచి. తునిపాలం వెళ్లే రహదారి, సామయ్యవలస నుంచి సంగివలసకు వేళ్లే రహదారి, రేవిడి నుంచి కోరాడ, బి.తాళ్లవలస మీదుగా అయినాడకు వెళ్లే రహదారి. రెడ్డిపల్లి నుంచి సుంకరపెట మీదుగా రేరాడ వెళ్లే రహదారి, చిన్నాపురం జంక్షన్ నుంచి యాతపేట మీదుగా అయినాడ వెళ్లే రహదారులు గుంతలమయంగా మారాయి. ఈ రహదారుల్లో వాహనాల రాకపోకలు అధికంగా ఉంటాయి. కంకర రాళ్లు తేలడంతో రాకపోకలకు నరక యాతన అనుభవిస్తున్నారు. కోరాడ నుంచి గెద్దపెట మీదుగా దాకమారి గ్రామానికి వెళ్లే రహదారి మరింత అధ్వానంగా మారాయి.దీంతో ఆయా గ్రామాల ప్రజలు గుంతల రహదారితో ఇక్కట్లు పడుతున్నారు. ఈ రహదారులకు మరమ్మతులు చేయాలని ప్రజాప్రతినిధులు, అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.కూటమి ప్రభుత్వంలోనైనా భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు స్పందించి ఆ గ్రామాలకు వెళ్లే రహదారుల మరమ్మతుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



రెడ్డిపల్లి ఎస్‌బీఐ సమీపంలో రోడ్డు దుస్థితి

అసంపూర్తిగా పద్మనాభం - రెడ్డిపల్లి రోడ్డు విస్తరణ పనులు

పద్మనాభం-రెడ్డిపల్లి రోడ్డు విస్తరణ పనులు అసంపూర్తిగా ఉండడంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మొత్తం రోడ్డులో 80 శాతం పనులు పూర్తి చేసి మిగిలిన కొద్దిపాటి రోడ్డును, కల్వర్టు పనులను వదిలేశారు. దీంతో అక్కడ రోడ్డు పరిస్థితి అధ్వానంగా మారింది. ఈ పనులను సత్వరమే పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయించాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆర్అండ్‌బీ అధికారులకు, కాంట్రాక్టరుకు గతంలో సూచించినా ఇప్పటికీ ఆ పనులు ముందుకు సాగలేదు. రోడ్డు విస్తరణలో స్థానిక జెడ్పీ పాఠశాల నుంచి స్టేట్ బ్యాంకు వరకు కొంతభాగం, శేరిఖండం గ్రామం కల్వర్టు వద్ద కొంతభాగం, రెడ్డిపల్లి సినిమా హాలు వద్ద కొంతభాగం పనులతో పాటు కల్వర్టు నిర్మాణం మిగిలి ఉన్నాయి. పనులన్నీ పూర్తి చేసి విస్తరణ చేసిన మూడు కిలోమీటర్ల రోడ్డుపై తుది బీటీ లేయర్ వేయాల్సి ఉంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పనులు చేపట్టక నిలిచిపోయిన ఈ రోడ్డును కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కొన్ని సమస్యలు తీరాయి. మిగిలిన పనులను కూడా సత్వరమే పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఇష్టారాజ్యంగా వాహనాల పార్కింగ్

తగరపువలస, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారి నుంచి సర్వీసు రోడ్డులోకి వెళ్లడానికి ఏర్పాటు చేసిన అండర్ పాత్ వే కింద పలువురు వాహనాలను పార్కింగ్ చేస్తుండడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అసలే ఇరుగ్గా ఉన్న ఈ వంతెన కింద కొంతమంది దుకాణాలు నిర్వహిస్తుండగా, మరికొందరు వాహనాలను నిలిపివేస్తున్నారు. దీంతో నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తడంతో పాటు కొన్నిసార్లు ప్రమాదాలు కూడా చోటు చేసుకుంటున్నాయి. వంతెన కింద ప్రాంతమంతా ఇరుగ్గా ఉండడంతో వంతెన కింద నుంచి వెళ్లాల్సిన సిటీ బస్సులకు కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అధికారులు తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.



అండర్ పాత్ వే కింద పార్కింగ్ చేసిన వాహనాలు

సీఐటీయూ భీమిలి జోన్ అధ్యక్షుడిగా మూర్తి

తగరపువలస, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : తగరపువలసలో సీఐటీయూ భీమిలి జోన్ నూతన కార్యవర్గం ఎన్నిక జిల్లా నాయకురాలు మణి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. జోన్ నూతన అధ్యక్షుడిగా ఆర్ఎస్ఎన్ మూర్తి, ప్రధాన కార్యదర్శిగా ఎస్. అప్పలనాయుడు, ఉపాధ్యక్షులుగా వూళ్ల నాగరాజు, సీతాదేవి. కంచమ్మ, శ్రీనివాసరావు, కార్యదర్శులుగా ఆర్. నర్సింగరావు, ఎన్. రాము, ఎస్. పైడమ్మ, పార్వతి, కోశాధికారిగా పి. సూర్యనారాయణ, సహాయ కోశాధికారిగా కె. వెంకటలక్ష్మి, కార్యవర్గ సభ్యులుగా గురప్ప, ఎన్నిబాబు, రాజేశ్ ఎన్నికయ్యారు.

స్థల ఆక్రమణపై ఆందోళన



స్థలం వద్ద ఆందోళన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

ఆనందపురం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంభీరం పంచాయతీ కల్లివానిపాలెంలో సామాజిక అవసరాల కోసం కేటాయించిన స్థల ఆక్రమణపై గ్రామస్తులు సోమవారం ఆందోళన చేపట్టారు. 1999లో అప్పటి ప్రభుత్వం సర్వే నెంబరు 205లో 97 మందికి ఇళ్ల స్థలాలు కేటాయించింది. వారికి సామాజిక అవసరాల నిమిత్తం 55 సెంట్ల స్థలాన్ని మినహాయించింది. నాటి నుంచి కాలనీవాసులు ఆ స్థలాన్ని వివాహాలు, ఇతర అవసరాలకు వినియోగిస్తున్నారు. ఇటీవల కొంతమంది వ్యక్తులు స్థలాన్ని ఆక్రమించి, పునాదులు వేశారు. ఈమేరకు గ్రామస్తులు ఆందోళనకు దిగారు. సామాజిక అవసరాల కోసం కేటాయించిన స్థలాన్ని ఆక్రమిస్తే సహించేది లేదని హెచ్చరించారు. అనంతరం ఇన్‌చార్జి తహసీల్దార్ చేతన్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

'అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి'

భీమునిపట్నం (రూరల్), జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రేఖవానిపాలెం పంచాయతీలో అక్రమ భవన నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కూటమి నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం వారు ఇక్కడి విలేకరులతో మాట్లాడారు.తాము గతంలో చేసిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేసిన అధికారులు తప్పులు జరిగాయని నిర్ధారించారని, కాని ఏడాది కావస్తున్నా.. చర్యలు తీసుకోవడం లేదన్నారు. పంచాయతీలో అనుమతి లేకుండా భవన నిర్మాణాలు జరుగుతున్నా, బోర్లు తవ్వుతున్నా సర్పంచ్ గాని, కార్యదర్శి గాని పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అలాగే పంచాయతీ నుంచి ప్రైవేటు లేఅవుట్‌కు నీరందించే ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. సమావేశంలో మాజీ సర్పంచ్ వై. సత్యనారాయణ, టీడీపీ గ్రామ అధ్యక్షుడు ఆనంద్, మాజీ ఉప సర్పంచ్ మురళి, జనసేన నాయకులు కిరణ్, కుమార్, మహేశ్, అప్పలకృష్ణ, లక్ష్మణరావు పాల్గొన్నారు.

'భోజన' కార్మికుల సమ్మె నోటీసు



సమ్మె నోటీసు అందిస్తున్న మధ్యాహ్నం భోజన పథకం సిబ్బంది

ఆనందపురం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : దేశవ్యాప్తంగా ఈనెల 9న జరిగే సమ్మెను కార్మికులు విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర నాయకురాలు మంగశ్రీ పిలుపునిచ్చారు. సోమవారం భోజన పథకం కార్మికులు ఎంఈఓ కార్యాలయంలో సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తుందన్నారు.42 కార్మిక చట్టాల్లో 29 చట్టాలను రద్దు చేసి, కొత్తగా నాలుగు లేబర్ కోడ్స్ తీసుకురావడం అన్యాయమన్నారు. దీనిపై దేశవ్యాప్తంగా కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు సమ్మెలో పాల్గొనాలని కోరారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ నారాయణమ్మ, కార్యదర్శి రాము, పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న చాముండేశ్వరరావు

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 215 మంది ఎంపిక

భీమునిపట్నం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సోమవారం మెగా జాబ్‌మేళా నిర్వహించారు. ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ జరిగిన మేళాకు 12 కంపెనీల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించారు. 682 మంది నిరుద్యోగ యువత పాల్గొనగా, 215 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఛాముండేశ్వరరావు తెలిపారు. టీఏవో డిజిటల్ సొల్యూషన్స్‌కు 75 మంది, బీ డేటా టెక్నాలజీస్‌కు 34 మంది, ఏకోహోమా ఆఫ్‌వే టైర్స్‌కు 16 మంది, డెక్కన్ ఫైన్ కెమికల్స్‌కు 10 మంది, అపోలో ఫార్మశీకి 24 మంది, 2050 హెల్త్ కేర్‌కు 13 మంది ఎంపికయ్యారని ఆయన చెప్పారు. జాబ్ క్యాలెండర్ ప్రకారం మరిన్ని మేళాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్. మురళీకృష్ణ, డిస్ట్రిక్ట్ ప్లేస్‌మెంట్ అధికారి మళ్ళ రమేష్‌నాయుడు, స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ అన్నపూర్ణ, అను తదితరులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు 9 వినతులు

భీమునిపట్నం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి తొమ్మిది వినతులు అందాయి. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జడ్సీ అయ్యప్పనాయుడు వినతులు స్వీకరించారు. యూసీడీ విభాగానికి 1, ఇంజనీరింగ్ విభాగానికి 4, ప్రజారోగ్య విభాగానికి, పట్టణ ప్రణాళిక విభాగానికి రెండేసి చొప్పున అర్జీలు అందినట్టు అధికారులు తెలిపారు.



జడ్సీకి ఫిర్యాదు చేస్తున్న స్థానికులు

549 మంది డిజిటల్ అసిస్టెంట్లకు బదిలీ

... 5వ పేజీ తరువాయి

సచివాలయాల్లో పనిచేస్తున్న గ్రేడ్-3 ఏఎన్ఎంల బదిలీలకు సంబంధించి సోమవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆరోగ్య శాఖ కార్యాలయంలో విశాఖ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం రాత్రి వరకూ ఈ కార్యక్రమం చేపట్టారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 1,300 మంది ఉండగా, తొలిరోజు 207 మందిని బదిలీ చేశారు.మిగిలిన వారికి బుధవారం నుంచి కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. మంగళవారం పెన్షన్లు పంపిణీ కార్యక్రమం ఉండడంతో కౌన్సెలింగ్ నిర్వహించరు. ఏఎన్ఎంలను సొంత మండలాల్లో కాకుండా పక్క మండలాలకు బదిలీ చేస్తున్నారు. అయితే సొంత మండలాల్లో కొనసాగించాలంటూ కొందరు ప్రజా ప్రతినిధుల నుంచి సిఫారసు లేఖలు తెచ్చారు. అయితే, ఆ లేఖలను పరిగణనలోకి తీసుకోకుండానే బదిలీలు ప్రక్రియను చేపట్టారు. డీపీఎంవో డాక్టర్ ఉమావతి, ఏవో విజయ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ విద్యాసాగర్ బదిలీల ప్రక్రియ చేపట్టారు.

డాల్ఫిన్ కళేబరం పూడ్చివేత

భీమునిపట్నం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : భీమిలి తీరానికి కొట్టుకువచ్చిన డాల్ఫిన్ కళేబరాన్ని జీవీఎంసీ పబ్లిక్ హెల్త్ విభాగం సిబ్బంది సోమవారం ఉదయం తీరంలో పూడ్చిపెట్టారు. ఆదివారం సాయంత్రం డాల్ఫిన్ కళేబరం ఎర్రమట్టిదిబ్బల తీరానికి కొట్టుకువచ్చిన విషయం తెలిసిందే. ఈమేరకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాయుడు ఆధ్వర్యంలో సిబ్బంది ఇసుకలో కళేబరాన్ని ఇసుకలో పూడ్చిపెట్టారు.

నేత్రపర్వంగా అప్పన్న నిత్య కల్యాణం



సింహాచలం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్య కల్యాణం సోమవారం నేత్రపర్వంగా సాగింది. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివా రిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామి, ఉభయదేవేరులను శోభాయమానంగా అలం కరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. అనంతరం శాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు జరిపారు.

ఐదుగురి గుప్పిట్లో నైట్ ఫుడ్ కోర్టు

... 5వ పేజీ తరువాయి

నైట్‌ఫుడ్‌కోర్టును ప్రారంభించాయి. జీవీఎంసీ యూసీడీ ద్వారా ఎంపిక చేసిన 32 మంది ఫుడ్‌కోర్టులో స్టాళ్లు ఏర్పాటుచేసుకున్నారు. కరోనా సమయంలో ఫుడ్‌కోర్టును మూసివేశారు. ఆ తర్వాత జీవీఎంసీ ఫుడ్‌కోర్టుకు అనుమతించలేదు.ఈనేపథ్యంలో అక్కడ వ్యాపారాలు సాగించిన ఐదుగురు...అప్పటి వైసీపీ నేతలను ప్రసన్నం చేసుకుని 170 దుకాణాలను ఏర్పాటుచేశారు. పదేసి చొప్పున దుకాణాలను తమ చేతిలో ఉంచుకుని అద్దెకు ఇచ్చుకున్నారు. మిగిలిన వాటిని ఆసక్తి కలిగిన వ్యాపారులకు 36 చదరపు గజాలు స్థలం చొప్పున మార్కింగ్ చేసి రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలకు అమ్ముకున్నారు. ఫుడ్‌కోర్టు కారణంగా పారిశుధ్య సమస్య తలెత్తుతుండడం,అదేవిధంగా జీవీఎంసీకి ఒక్క రూపాయి ఆదాయం కూడా రాకపోవడంతో దానిని ఎత్తివేయాలంటూ టీడీపీ, జనసేన కార్పొరేటర్లు కౌన్సిల్ సమావేశంలో డిమాండ్ చేశారు. దీంతో ఏడాది కిందట కౌన్సిల్ సమావేశంలో ఫుడ్‌కోర్టును తొలగించాలని తీర్మానం చేశారు. అయినప్పటికీ జీవీఎంసీ అధికారులు ఫుడ్‌కోర్టును తొలగించే ప్రయత్నం చేయలేదు. దీనిపై జనసేన కార్పొరేటర్ మూర్తియాదవ్ ఇటీవల హైకోర్టులో పిల్ దాఖలు చేయడంతో జూన్ 16లోగా కౌంటర్ దాఖలు చేయాలని జీవీఎంసీ అధికారులను ఆదేశించింది.

ఇటీవల ఫుడ్‌కోర్టులో ఒక యువకుడు ఐస్‌క్రీమ్ దుకాణం ఏర్పాటు చేయాలనుకున్నాడు. అందుకోసం ఆ ఐదుగురిలో ఒకరిని సంప్రతించాడు. దుకాణాలు ఖాళీ లేవని చెబుతూ, 18 చదరపు అగురులు స్థలం కలిగినవి ఉన్నాయని, వారంతా రూ.12 వేలు అద్దె ఇస్తున్నందున, రూ.15 వేలు అద్దె ఇవ్వడానికి సిద్ధపడితే ఒకరిని ఖాళీ చేయించి ఆ స్థలం ఇస్తానని ప్రతిపాదించాడు. దీనికి యువకుడు సరేననడంతో రెండు నెలలు అద్దెను అడ్వాన్స్‌గా తీసుకున్నాడు. యువకుడు దుకాణం ఏర్పాటుకు స్టాల్‌ను తయారు చేయించుకుని ఫుడ్‌కోర్టు సమీపంలో ఉంచాడు. గుజరాత్ నుంచి రూ.3.5 లక్షలు వెచ్చించి యంత్రాలను కొనుగోలు చేశాడు. వచ్చే నెల నాలుగున దుకాణం ప్రారంభించాలనుకుంటున్నట్టు స్థలం అద్దెకు ఇచ్చిన వ్యక్తికి చెప్పాడు. అయితే ఆ స్థలాన్ని తాను ఇవ్వడం లేదని, అడ్వాన్స్‌ను వెనక్కి ఇచ్చేస్తున్నానంటూ ఫోన్‌పే ద్వారా యువకుడికి తిరిగి చెల్లించాడు. దీంతో కంగుతిన్న యువకుడు తాను రూ.3.5 లక్షలు పెట్టి యంత్రాలు కొనుగోలు చేయడంతోపాటు స్టాల్‌ను తయారుచేయించుకున్నానని, ఇప్పుడు కాదంటే తన పరిస్థితి ఏమిటని ప్రశ్నించాడు. తాను దుకాణం పెట్టి తీరతానని చెప్పడంతో 'నా పొలిటికల్ బ్యాంక్ గ్రౌండ్ తెలిస్తే తట్టుకుని బతకలేవు. ఎమ్మెల్యేలు నాకుఅండగా ఉన్నారని' బెదిరించాడు. ఇదే తరహాలో ఐదుగురిలో మరొకరు... అధిక అద్దె ఆశపడి...ఇప్పటికే ఉన్న దుకాణాన్ని తొలగించాడు. ఫుడ్‌కోర్టులో దళారీల ఆగడాలను అరికట్టడంతోపాటు తమకు దుకాణం పెట్టుకుని ఉపాధి పొందేలే స్థలం ఇప్పించాలని కోరేందుకు బాధితులు ఇద్దరూ సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వెళ్లారు. ఈవిషయం అడ్వాన్స్ వెనక్కి ఇచ్చిన వ్యక్తికి తెలియడంతో...ఒకరు బాధిత యువకుడికి ఫోన్ చేసి 'అనవసరంగా నన్ను రెచ్చగొడుతున్నావ్... తర్వాత ఏం జరిగినా నాకు సంబంధం ఉండదని' బెదిరించాడు. దీంతో వారిద్దరూ తమకు ఎక్కడైనా దుకాణం పెట్టుకునేందుకు స్థలం ఇప్పించి ఉపాధి కల్పించాలని కోరుతూ కమిషనర్‌కు వినతిపత్రం అందజేసి వెనుతిరిగారు. ఇంత జరుగుతున్నా ఉన్నతాధికారులు అనధికార ఫుడ్‌కోర్టు విషయంలో ఎందుకు జోక్యంచేసుకోవడం లేదనేది అర్థం కావడం లేదని కార్పొరేటర్లు, ఇతర అధికారులు అంటున్నారు.

రెండు నెలల్లో 5,000 రూఫ్ టాప్ సోలార్ ప్లాంట్లు

... 5వ పేజీ తరువాయి

తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ, డిస్కమ్ పరిధిలో 2024 నుంచి 2025 ఏప్రిల్ వరకూ పది వేల రూఫ్ టాప్ సోలార్ ప్లాంట్లు ఏర్పాటుచేయగా, ఆ తరువాత రెండు నెలల్లో మరో 5 వేలు...మొత్తం 15 వేలు పూర్తి చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో పది వేల సోలార్ ప్లాంట్లు పెట్టాలని లక్ష్యం ఇవ్వడంతో 'వర్చువల్ నెట్ మీటరింగ్'కు కూడా అనుమతిస్తామని చెప్పారు. సాధారణంగా ఈ పథకం కింద సొంత ఇంటి పైకప్పుపై సోలార్ ప్లాంటు ఏర్పాటు చేసుకోవాలని, అయితే అపార్టుమెంట్లలో ఉంటున్నవారు సొంతంగా వీటిని పెట్టుకోవాలని ఆసక్తి చూపుతున్నా మిగిలిన ఫ్లాట్ల వారి నుంచి అభ్యంతరాల వల్ల సాధ్యం కావడం లేదని తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇలాంటి వారికి అదే డివిజన్ పరిధిలో ఎక్కడైనా మరో సొంత ఇల్లు ఉంటే...అక్కడ రూఫ్‌టాప్ సోలార్ ప్లాంటు ఏర్పాటు చేసుకుంటే అక్కడ ఉత్పత్తి చేసిన విద్యుత్‌ను గ్రిడ్‌కు పంపించి, అంతే మొత్తం యూనిట్లను అపార్టుమెంట్ ఫ్లాటులో ఉపయోగించుకునే అవకాశం కల్పిస్తామని చెప్పారు. దీనినే 'వర్చువల్ నెట్ మీటరింగ్' అంటామన్నారు. రూఫ్ టాప్ సోలార్ ప్లాంటుకు ఒక్కసారి పెట్టుబడి పెడితే ఇరవై ఏళ్ల వరకు దానిని ఉపయోగించుకోవచ్చునని, దానివల్ల విద్యుత్ బిల్లు గణనీయంగా తగ్గుతుందన్నారు.

రాయితీగా రూ.115 కోట్లు

ఇప్పటివరకూ 15,120 సోలార్ ప్లాంట్ల ద్వారా 50,002 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన విద్యుత్‌ను ఉత్పత్తి చేసి గ్రిడ్‌కు అనుసంధానం చేయడం వల్ల ఆ వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం నుంచి రాయితీగా రూ.115 కోట్లు వచ్చిందని సీఎండీ పృథ్వీతేజ్ తెలిపారు. విశాఖపట్నంలో జిల్లాలో 2,056 మందికి, శ్రీకాకుళం జిల్లాలో 1,650 మందికి, పార్వతీపురం మన్యం జిల్లాలో 289 మందికి, విజయనగరం జిల్లాలో 1,549 మందికి, అనకాపల్లి జిల్లాలో 1,239 మందికి, అల్లూరి మన్యం జిల్లాలో తొమ్మిది మందికి ఈ రాయితీ వచ్చిందన్నారు. కిలోవాట్ సామర్థ్యం కలిగిన ప్లాంటు ఏర్పాటు చేసుకోవాలంటే కనీసం పైకప్పుపై 100 చ.అ. విస్తీర్ణం కలిగిన స్థలం ఉండాలన్నారు. ఒక కిలోవాట్‌కు రూ.30 వేలు, రెండు కిలోవాట్లకు రూ.60 వేలు, మూడు కిలోవాట్లకు రూ.78 వేలు రాయితీ వస్తుందన్నారు. మూడు కిలోవాట్లు ప్లాంట్లు ఏర్పాటు చేసుకుంటే నెలకు 360 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందని, ఇంటి అవసరాలకు వాడుకోగా మిగిలిన విద్యుత్ సంస్థకు విక్రయించడం వల్ల అదనపు ఆదాయం కూడా వస్తుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని కోరారు.

ఏయూ దూర విద్యలో ఆన్‌లైన్ కోర్సులకు స్వస్తి?

... 5వ పేజీ తరువాయి

ప్రొఫెసర్లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ విధానంపై పునరాలోచన చేయాలంటూ అప్పటి ఉన్నతాధికారులను పలువురు సీనియర్ ప్రొఫెసర్లు కోరారు. ఒకరిద్దరు ప్రిన్సిపాల్స్ ఆన్‌లైన్‌లో నిర్వహించే కోర్సులతో విద్యార్థులకు సబ్జెక్ట్ రాదని, అవకతవకలకు అవకాశం ఉందంటూ లేఖలు కూడా రాశారు. అయినప్పటికీ అప్పటి అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. అయితే, తాజాగా వర్సిటీ ఉన్నతాధికారులు ఈ కోర్సుల నిర్వహణకు సంబంధించి పునఃపరిశీలించాలని దూర విద్యా కేంద్రం డైరెక్టర్‌కు ఏయూ వైస్ చాన్సలర్ జీపీ రాజశేఖర్ సూచించినట్టు చెబుతున్నారు. మొదట మల్టిపుల్ చాయిస్ విధానంలో ఆన్‌లైన్‌లో పరీక్షల నిర్వహణ, ఆ తరువాత ఆన్‌లైన్‌లో కోర్సులకు స్వస్తి చెప్పనున్నట్టు తెలుస్తోంది. ఇదిలావుంటే ఈ కోర్సులను ఏయూ దూర విద్య, మరో రెండు ప్రైవేటు సంస్థలు సంయుక్తంగా నిర్వహించడం గమనార్హం. ప్రవేశాల నుంచి పరీక్షలు నిర్వహణ వరకు అన్నీ ఆ రెండు సంస్థలే చూసుకుంటాయి.

మార్పులపై ఫోకస్

దూర విద్యా కేంద్రం ద్వారా నిర్వహిస్తున్న కోర్సులకు సంబంధించి పరీక్షా కేంద్రాల పెంపు, నిర్వహణలో అవకతవకలు వంటి వాటిపైనా వర్సిటీ ఉన్నతాధికారులు దృష్టిసారించారు. దూరవిద్యను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాలని నూతనంగా నియమితులైన డైరెక్టర్‌కు వీసీ సూచించినట్టు తెలిసింది. ఏళ్ల తరబడి కొనసాగుతున్న ఉద్యోగుల జాబితాను సిద్ధం చేసి, ఆరోపణలకు కేంద్ర బిందువులుగా ఉన్న వారిని మార్చే ప్రక్రియ చేపట్టనున్నట్టు చెబుతున్నారు.

సారథులు మనోళ్లే..

... 5వ పేజీ తరువాయి

పార్టీ అధ్యక్షులు సోము వీర్రాజును తప్పించి కొత్తవారికి బాధ్యతలు అప్పగించాలని అధిష్ఠానం యోచించినప్పుడే మాధవ్ పేరు పరిశీలనకు వచ్చింది. అయితే సీనియర్ నాయకురాలు దగ్గుబాటి పురందేశ్వరికి పెద్దలు అవకాశం కల్పించారు. ఇప్పుడు కొత్త అధ్యక్షులను ఎన్నుకునే సమయం రావడంతో ఆ పదవి కోసం చాలా మంది పోటీ పడ్డారు. అయితే అధిష్ఠానం మాత్రం బీజేపీ మూలాలు కలిగిన వారికే పట్టం కట్టాలని భావించి మాధవ్‌ను ఎంపిక చేసింది.

పెద్దాస్పత్రికి సుస్తీ

... 5వ పేజీ తరువాయి

కాదు. ఈ నేపథ్యంలోనే సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లనున్నట్టు సూపరింటెండెంట్ డాక్టర్ వాణి వెల్లడించారు. ప్రస్తుతానికి ఈ సమస్య నుంచి బయటపడే మార్గాల కోసం అన్వేషిస్తున్నట్టు వెల్లడించారు. ఒక ప్రైవేటు సంస్థ నుంచి అద్దెకు పరికరాన్ని తెచ్చే ఆలోచనలో ఉన్నట్టు వెల్లడించారు. గతంలో అద్దెకు తెచ్చిన పరికరానికి నెలకు రూ.60 వేలు చెల్లించామని, ఇప్పుడు అద్దెకు తీసుకురావాలని భావిస్తున్న సంస్థ రూ.లక్షన్నర అడుగుతుండడంతో ఆలోచనలో పడినట్టు వెల్లడించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు.

టీసీల కోసం డబ్బులు డిమాండ్‌పై విచారణ

ఆరిలోవ,జూన్ 30 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణాపురం అంబేడ్కర్ గురుకులంలో విద్యార్థుల టీసీల కోసం డబ్బులు డిమాడ్ చేశారనే ఆరోపణపై సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి ఆదేశాల మేరకు ఇన్‌చార్జి సమన్వయకర్త ఎస్. రామకృష్ణ సోమవారం విచారణ జరిపారు. ఇలాంటి ఉదంతం మునుపెన్నడూ చూడలేదని ఆయన విచారం వ్యక్తం చేశారు. సాధారణంగా విద్యా సంవత్సరంలో ఫలితాలు వచ్చిన వెంటనే విద్యార్థులు పై తరగతులకు వెళ్లేందుకు టీసీలను సిద్ధం చేయాల్సిన బాధ్యత ప్రిన్సిపాల్, సిబ్బందిపై ఉంటుందన్నారు. టీసీల కోసం, పాఠశాలలో ప్రవేశాల కోసం వచ్చిన వారితో ఆయన మాట్లాడి వెంటనే టీసీలు ఇప్పించారు. ఈ ఘటనపై విచారణ నివేదికను కార్యదర్శికి పంపానన్నారు.

వాకర్స్‌కు వైద్య పరీక్షలు



వైద్య శిబిరంలో పాల్గొన్న వాకర్స్

ఎంవీపీ కాలనీ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజెన్స్‌కు సోమవారం ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు.ఎంవీపీ కాలనీ అల్వార్‌దాస్ గ్రౌండ్‌లో వీఎస్‌సి వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో ఎంజీఎం హెల్త్ కేర్ వైద్య సిబ్బంది ఉచితంగా బీపీ, షుగర్ పరీక్షలు, వాసన్ ఐ కేర్ ఆసుపత్రి సిబ్బంది కంటి పరీక్షలు నిర్వహించారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి. కిశోర్ కుమార్, సభ్యులు పాల్గొన్నారు.

వాల్వ్ లీకేజీతో తాగునీరు వృథా



వెంకోజీపాలెం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ పరిధిలోని 15వ వార్డు హెచ్‌బీ కాలనీ సన్‌స్కూల్ సమీపంలోని మంచినీటి నిల్వ ట్యాంకుల నుంచి సరఫరా అయ్యే పైపు లైనులకు ఉండే వాల్వ్‌లు మరమ్మతులకు గురవ్వడంతో మంచినీరు రోడ్డుపై వృథాగా పోతోంది. రెండు రోజులు నీటి సరఫరా సిబ్బంది సమ్మె చేయడంతో మంచినీటి కుళాయిలు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న పాత వెంకోజీపాలెం ప్రాంత ప్రజలు వృథాగాపోతున్న నీటిని చూసి ఆవేదన చెం దుతున్నారు. సిబ్బందిని ప్రశ్నించగా పాతకాలం వాల్వ్‌లు కావడంతో మరమ్మతుకు గురయ్యాయని చెబుతున్నారు. అధికారులు పరిశీలించి మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

సినిమా గైడ్

● **కన్నప్ప** : జగదాంబ, కిన్నెర, శ్రీకన్య, లీలామహల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ),

● **కుబేర** : మెలోడి, సంగం, శ్రీరామా, కామేశ్వరి, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)

● **ఎఫ్.1** : రమాదేవి, జగదాంబ,

● **మార్గన్** : శారద, శరత్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), రమాదేవి,

● **8 వసంతాలు** : శ్రీ వెంకటేశ్వర, కన్య హెవెన్ (గాజువాక).

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 23, టమాటా 22, వంకాయలు (తెలుపు) 26, వంకాయలు (నలుపు) 26, బెండకాయలు 42, పచ్చిమిర్చి 44, కాకరకాయలు 38, బీరకాయలు 36, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 40, క్యాబేజి 18, క్యారెట్ 40, దొండకాయలు 36, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 86, అల్లం (పాతది)50, బరబాటి 40, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 55, బద్దచిక్కుడు 50, దోసకాయలు 16, వె ల్లుల్లి (పెద్దవి) 90, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 100, కీరదోస 34, కాప్సికమ్ 80, పొట్లకాయ (పెద్దది) 40, చేమదుంపలు 36, చిలగడదుంపలు 34, కంద 54, దేముడు చిక్కుడు 56, గోరు చిక్కుడు 40, కూర పెండలం 30, బ్రకోలి 45, నూల్ కోల్ 34, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 4 , చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	585
విజయనగరం	589
శ్రీకాకుళం	589

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	80
లైవ్ ధర	100
విత్ స్కిన్	170
స్కిన్‌లెస్	180



ఎంవీపీ కాలనీ రెండు, మూడు సెక్టర్లలో ఫుట్‌పాత్‌పైనే వ్యాపారుల సామగ్రి



ఆరో సెక్టరులో ఫుట్‌పాత్‌పై వాహనాల పార్కింగ్

ఎంవీపీలో ఫుట్‌పాత్‌ల ఉనికి గల్లంతు!

ఆక్రమణల చెరలో ఉన్నా.. కళ్లు మూసుకున్న యంత్రాంగం

ఎంవీపీ కాలనీ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రణాళికాబద్ధంగా నిర్మించిన ఎంవీపీ కాలనీలో 'పక్కా ప్రణాళిక'తో ఫుట్‌పాత్‌లు ఆక్రమించేశారు. ప్రజలు ఈ విషయం గమనించినా అధికారులు కళ్లు మూసుకున్నారు. పాదచారులు ఎక్కడా ఫుట్‌పాత్‌పై నడిచే పరిస్థితి లేదు. వెంకోజీపాలెం నుంచి ఎంవీపీ కాలనీ సర్కిల్‌కు వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా ఫుట్‌పాత్‌లు పేరుకే ఉన్నాయి. అన్నిచోట్ల పూర్తిగా వ్యాపారులు ఆక్రమించేశారు. పద్దెనిమిదో వార్డు పరిధిలోని ఎంవీపీ కాలనీ రెండు, మూడు, ఆరు, ఏడు సెక్టర్ల మధ్య ఉన్న రహదారిని ఆనుకుని ఉన్న ఫుట్‌పాత్‌ల పరిస్థితి దారుణం. ఇక్కడ పరిస్థితి చూస్తే, జీవీఎంసీ పట్టణ ప్రణాళిక సిబ్బంది ఉన్నారా? అనే అనుమానం వస్తుంది. ఈ సిబ్బంది అక్రమ నిర్మాణాల వద్ద మామూళ్ల వసూళ్లలో బిజీగా ఉండడమే తప్ప ఇలాంటి సమస్యను పట్టించుకున్న దాఖలాలు లేవు. ఎన్నిసార్లు స్థానికులు ఫిర్యాదు చేసినా, జీవీఎంసీ పట్టించుకోకపోవడంతో కొద్ది నెలల క్రితం ట్రాఫిక్ పోలీసులు రంగంలోకి దిగి ఆక్రమణలు తొలగించారు. వారం రోజులు బాగానే నడిచింది. ఫుట్‌పాత్‌లంటే పాదచారులకే అన్న రీతిన అన్నిచోట్ల కనిపించింది. తర్వాత మళ్లీ మామూలే. ఉదయం ఎనిమిది నుంచే వ్యాపారులు తమ సామగ్రిని ఫుట్‌పాత్‌లపై పెడుతున్నారు. ఒక్కో చోట ద్విచక్రవాహనాలు, కార్లు కూడా ఫుట్‌పాత్‌లపై దర్శనమిస్తుంటాయి. ఇంత జరుగుతున్నా మహా అధికారులకు మాత్రం కనిపించదు. ఇదేం చోద్యమో!

బాధ్యతగా పనిచేస్తేనే మెరుగైన ఫలితాలు

జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ కేతన్‌గార్గ్

వెంకోజీపాలెం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీలను సకాలంలో సచివాలయ స్థాయిలోనే పరిష్కరించాలని, కార్యదర్శులు చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ ఆదేశించారు. సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులు, జోనల్ కమిషనర్లు, సచివాలయ కార్యదర్శులతో మాట్లాడారు. గత వారం జీవీఎంసీకు వచ్చిన ఫిర్యాదులపై జోనల్ కమిషనర్ల ద్వారా పరిష్కారాలపై ఆరా తీశారు. పట్టణ ప్రణాళిక విభాగం, రెవెన్యూ, నీటి సరఫరా, పబ్లిక్ హెల్త్, వీధి లైట్ల విభాగాలకు సంబంధించి అధికంగా ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఇకపై ప్రతి సోమవారం స్వీకరించిన ఫిర్యాదులను అదే రోజు వాటిపై పరిష్కారమార్గ చర్యలను సచివాలయ కార్యదర్శులు చేపట్టాలని కమిషనర్ ఆదేశించారు. ప్రతి సచివాలయానికి ప్రజల నుంచి ఒకటో, రెండో ఫిర్యాదులు వస్తాయని, వాటిని నిర్ణీత సమయంలో పరిష్కరిస్తే పీజీఆర్ఎస్‌కు ప్రజలు ఫిర్యాదులు సమర్పించరని, ఆ దిశగా జోనల్ కమిషనర్లు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని కమిషనర్ ఆదేశించారు. సచివాలయ వార్డు ఎమినిటీస్ కార్యదర్శులు ప్రజలకు అందించే నీటి సరఫరా కలుషితం కాకుండా, పైప్‌లైన్లు కాలువలో కలవకుండా పరిశీలించేందుకు సర్వే నిర్వహించాలని సూచించారు. ప్రజలకు సరఫరా చేస్తున్న నీటి నాణ్యత పరీక్షలు జరపాలని, నాణ్యతతో కూడిన తాగునీరు ఏమేరకు ప్రజలకు సరఫరా జరుగుతున్నదో తెలుసుకోవాలన్నారు. నగర సుందరీకరణ దృష్ట్యా సెంటర్ మీడియన్లు, ఓపెన్ స్పేసెస్, పార్కులు అందంగా తీర్చిదిద్దేలా నగర పచ్చదనాన్ని పెంపొందించాలని, అలాగే వీధిలైట్ల నిర్వహణలో నిత్యం ప్రత్యేక దృష్టి సారించి లోపాలు లేకుండా సమగ్ర సర్వే చేపట్టాలని కమిషనర్ ఆదేశించారు. వర్షాకాలం అయినందున నగరంలో దోమలు వృద్ధి చెందకుండా, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతిచోట పొగ కొట్టించాలని, వ్యర్థాలు నిల్వలేకుండా వార్డు శానిటేషన్ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలన్నారు. అధికంగా టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి ఫిర్యాదులు వస్తున్నాయని, అక్రమ, అనధికార కట్టడాలు, ఆక్రమణలు నియంత్రించేందుకు ముందస్తుగా ప్రతిరోజు వార్డులలో తనిఖీలు నిర్వహించాలన్నారు. అనధికార కట్టడాలకు వెంటనే నోటీసులు జారీ చేసి చర్యలు చేపట్టాలని నిర్దేశించారు. కొత్తగా నిర్మాణాలు చేపట్టిన వారికి పూర్తిగా గ్రీన్ మ్యాట్ కప్పి, అనుమతులు వచ్చాకే పనులు చేపట్టమని సూచించాలని, భవన నిర్మాణ వ్యర్థాలు రోడ్లపై, బహిరంగ ప్రదేశాల్లో వేయకుండా చూడాలని ప్లానింగ్ కార్యదర్శులకు కమిషనర్ సూచించారు. అడ్మిన్ కార్యదర్శులు జీవీఎంసీ ఆర్థిక పరిపుష్టి దిశగా వార్డులలో సర్వే నిర్వహించి ఆస్తిపన్ను రాబట్టాలని, సచివాలయాల్లో అన్ని విభాగాల కార్యదర్శులు ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్న విధివిధానాలను గమనిస్తూ చిత్తశుద్ధితో కార్యకలాపాలు నిర్వహించాలని కమిషనర్ సూచించారు. సచివాలయాలను నిత్యం పర్యవేక్షిస్తూ వార్డు కార్యదర్శుల పనితీరు మెరుగుపడాలన్నారు.

వినతులను సత్వరమే పరిష్కరించాలి

వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్



సమస్యలు వింటున్న వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్

సిరిపురం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : వీఎంఆర్‌డీఏ ప్రజాదర్బార్‌కు వచ్చే వినతుల్లో ఎక్కువగా భూ సంబంధితమైనవి ఉంటున్నాయని, వాటి పరిష్కారంలో నిశిత పరిశీలన అవసరమని వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్, కమిషనర్ విశ్వనాథన్ అన్నారు. సోమవారం వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన వినతులను సాధ్యమైనంత వరకు వెంటనే పరిష్కరించే దిశగా పనిచేయాలని సూచించారు. వినతుల పరిష్కారంలో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా ప్రజా దర్బార్‌కు మొత్తం 11 ఫిర్యాదులు రాగా ప్లానింగ్ 5, ఎస్టేట్ 3, సాంకేతిక విభాగం 2, ఇతర విభాగానికి ఒక్కటి చొప్పున అర్జీలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ రమేష్, ఎస్టేట్ అధికారి దయానిధి, చీఫ్ అకౌంటెంట్ ప్రసాద్ పాల్గొన్నారు.

గృహిణులకు స్పోకెన్ ఇంగ్లీష్‌లో శిక్షణ

విశాఖపట్నం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): గృహిణులకు స్పోకెన్ ఇంగ్లీష్‌లో రెండు నెలల ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు గృహిణి స్పోకెన్ ఇంగ్లీష్ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు దామోదర మనోహర్ ఒక ప్రకటనలో తెలిపారు. రామాటాకీస్ సమీపంలోని కెనరా బ్యాంకు ఎదురుగా శ్రీకృష్ణ ట్రావెల్స్ మేడపై ఉన్న సంస్థ కార్యాలయంలో జూలై మూడో తేదీ నుంచి సెప్టెంబరు ఐదో తేదీ వరకు శిక్షణ ఉంటుందన్నారు.ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు రోజూ తరగతులు జరుగుతాయన్నారు. ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని, ఆసక్తి కలిగిన గృహిణులు ఇనిస్టిట్యూట్‌కు వచ్చి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు వివరాలకు 80193 88999 నంబరులో సంప్రదించాలన్నారు.

డీసీటీఎంగా పద్మావతి బాధ్యతల స్వీకరణ

ద్వారకాబస్‌స్టేషన్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ విశాఖ రీజియన్ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ (డీసీటీఎం)గా కె.పద్మావతి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి డీసీటీఎం జి.సత్యనారాయణకు విజయనగరం జోన్ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ (ఆపరేషన్ అండ్ కమర్షియల్)గా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్టీసీ ప్రగతికి కృషిచేస్తానని, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తానన్నారు.

బీచ్ వాలీబాల్ పతక విజేతలకు ప్రోత్సాహకం

విశాఖపట్నం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాఖండ్‌లో జరిగిన జాతీయ క్రీడల్లో పతకాలు సాధించిన క్రీడాకారులకు ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) నగదు ప్రోత్సాహక బహుమతులను విడుదల చేసింది. ఈఏడాది ఫిబ్రవరిలో జరిగిన జాతీయ క్రీడల్లో రాష్ట్రానికి పతకాలు అందించిన 15 మంది క్రీడాకారులకు రూ.91.75 లక్షలు విడుదల చేసింది. దీంతో జాతీయ పురుషుల బీచ్ వాలీబాల్ టోర్నీలో ఆంధ్రప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించి స్వర్ణ పతకం సాధించిన నగర క్రీడాకారులు మణికంఠరాజు, దివ్యసాయిలకు రూ. 15 లక్షలు విడుదలయ్యాయి. ఆ నగదు ప్రోత్సాహక చెక్‌ను రాష్ట్ర వాలీబాల్ సంఘం అధ్యక్షుడు, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు సోమవారం తన కార్యాలయంలో అందజేసి అభినందించారు. గణబాబు మాట్లాడుతూ డెహ్రాడూన్‌లో జరిగిన టోర్నీలో అద్భుతంగా రాణించి వరుస సెట్లలో (25-23, 21-19) తమిళనాడును ఓడించి రాష్ట్రానికి స్వర్ణ పతకాన్ని అందించిన మణికంఠరాజు, దివ్యసాయిలకు చెరో రూ.7.50 లక్షల నగదు లభించడం గర్వకారణమని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వాలీబాల్ సంఘం కార్యదర్శి భగవాన్ దాస్, మోహన్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుల అరెస్టు



పోలీసులు అరెస్ట్ చేసిన నిందితులు

మద్దిలపాలెం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): రామ్‌నగర్ జేఎస్ఎం కాలనీ కొండపైన జూన్ 22న ఓ యువకుడిపై హత్యాయత్నానికి పాల్పడిన ఐదుగురిని సోమవారం త్రీటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ పైడయ్య తెలిపిన వివరాల ప్రకారం.. చెన్నా లోకేష్ (23) (భీమిలి), కర్రి భానుప్రసాద్ (23)(జోడుగుళ్లపాలేం), సోమదుల శివకుమార్ (22) (జేఎస్ఎం కాలనీ), కిల్లంపల్లి గోవిందరాజు(19) (ఓల్డ్ డెయిరీఫారం), రవీంద్రనగర్ చెందిన పదిహేడేళ్ల బాలుడు స్నేహితులు. జూన్ 22 రాత్రి శివాజీ పార్క్ రోడ్డులోని రాయల్ హోటల్లో జరుపుకుంటున్న కుందన్ పుట్టిన రోజు వేడుకలకు వీరు వెళ్లారు. లోకేష్‌కు అతని స్నేహితురాలు ఫోన్‌చేయడంతో అర్ధరాత్రి దాటాక ఒంటి గంట సమయంలో ఆమెను కలవడానికి లోకేష్, శివకుమార్‌లు వెళ్లారు. ఆమె తనను చేపలుప్పాడకు చెందిన రౌడీషీటర్ వాసుపల్లి రాము(20) వేధిస్తున్నట్టు వారికి చెప్పింది. తనను కూడా పుట్టిన రోజు వేడుకకు తీసుకెళ్లాలని కోరగా లోకేష్, శివకుమార్‌లు ఆమెను తీసుకుని రాయల్ హోటల్‌కు వచ్చారు. కాసేపటి తర్వాత ఆమె మళ్లీ రాము గురించి మాట్లాడుతూ అతను తనను బాగా వేధిస్తున్నాడని కన్నీరు పెట్టుకుంది. దీంతో నిందితులు ఐదుగురు రామును హత్య చేయాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా శివకుమార్ రాముకు ఫోన్ చేసి మద్యం ఉంది రామ్‌నగర్ జేఎస్ఎం కాలనీ వెనుక కొండ వద్దకు రావాలని చెప్పాడు. యువతిని హోటల్లో ఉండమని ఐదుగురూ ముందుగానే కొండ వద్దకు చేరుకున్నారు. అక్కడ వారు వేచిచూస్తుండగా రాము అతని స్నేహితుడు యశ్వంత్ బైక్‌పై వచ్చారు.లోకేష్ బీరు సీసా తీసుకుని రాము తలపై బలంగా కొట్టాడు. పక్కనే ఉన్న భానుప్రసాద్, శివకుమార్, గోవిందరాజు, బాలుడు కూడా కర్రలు, రాళ్లతో రాముపై దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన రాము పెద్దగా కేకలు వేయడంతో నిందితులు పరారయ్యారు. స్థానికుల సమాచారం మేరకు త్రీటౌన్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రుడ్ని ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ముగిసిన ఎస్ఐసీఏఎస్ఏ క్రీడా పోటీలు



పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

విశాఖపట్నం స్పోర్ట్స్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర విశ్వవిద్యాలయం గోల్డెన్ జూబ్లీ గ్రౌండ్‌లో జరిగిన ఎస్ఐసీఏఎస్ఏ క్రీడా పోటీలు ఘనంగా ముగిశాయి. అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, క్రికెట్, ఖోఖో, త్రోబాల్ క్రీడాంశాలలో జరిగిన పోటీల్లో విద్యార్థులు ఉత్సా హంగా పాల్గొని ప్రతిభను ప్రదర్శించారు. ఆదివారం జరిగిన క్రికెట్ టోర్నీలో సీఏ చాలెంజర్స్ చాంపియన్ ట్రోఫీని కైవసం చేసుకోగా సూపర్ కింగ్స్ రన్నరప్‌గా నిలిచింది. ఖోఖో క్రీడాంశంలో శృతి జట్టు, త్రోబాల్‌లో మాధురి టీం, ఫుట్‌బాల్‌లో షాడో మోనార్క్ విన్నర్స్ గా నిలిచాయి. అథ్లెటిక్స్ పురుషుల షాట్‌పుట్‌లో పుష్పక్, మహిళల విభాగంలో ప్రణీషాశ్రీ, పురుషుల 100 మీ.పరుగులో మహేంద్ర, మహిళల విభాగంలో వేద ప్రథమ స్థానాల్లో నిలిచారు. టగ్ ఆఫ్ వార్ పురుషుల విభాగంలో అమన్ టీం, మహిళల విభాగంలో విష్ణుప్రియ జట్టు చాంపియన్‌గా నిలిచాయి.

ప్రజా సేవతోనే ప్రభుత్వ ఉద్యోగులకు గుర్తింపు

సిరిపురం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : విధి నిర్వహణలో ప్రజలకు చేసిన సేవలే ఉద్యోగులకు ప్రత్యేక గుర్తింపును తీసుకువస్తాయని వీఎంఆర్‌డీఏ సంయుక్త కమిషనర్ కె. రమేష్ అన్నారు. వీఎంఆర్‌డీఏలో విధులు నిర్వహించి పదవీ విరమణ చేస్తున్న టి. సత్యనారాయణ, పి. శ్రీనివాసరావు, పి.తవిటయ్యచిన్నారావును కార్యాలయం సిబ్బంది సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ స్థాయిల్లో 40 ఏళ్లగా పని చేస్తూ అందరి మన్ననలను పొందారన్నారు. వారి సేవలను సహచర ఉద్యోగులు స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎస్టేట్ అధికారి దయానిధి, ఇంజనీర్ భవానీ శంకర్, డీఎఫ్ఓ సుజాతా శివానీ, ఇంజనీర్లు రాజు, సింగ్, రవిశంకర్, రాజశేఖర్, రమణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైసీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు

వైసీపీని బలోపేతం చేయాలి : కేకే రాజు

మద్దిలపాలెం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు సూచించారు. మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జిల్లా సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు పార్టీని వ్యవస్థీకృతంగా నిర్మించి సమష్టిగా ముందుకు సాగాలన్నారు. జూలై 5న వెంకోజీపాలెం సీఎంఆర్ ఫంక్షన్ హాల్లో నిర్వహించే 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ' కార్యక్రమం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు వాసుపల్లి గణేష్ కుమార్, తైనాల విజయకుమార్, మొల్లి అప్పారావు, రవిరెడ్డి, కోలా గురువులు, జహీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల మధ్య వ్యర్థాలతో ఇబ్బందులు



నివాసాల చుట్టూ ఉన్న వ్యర్థాలు

వెంకోజీపాలెం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : రాత్రింబవళ్లు నిర్మానుష్యంగా కనిపించే 15వ వార్డులో వ్యర్థాల నిల్వలు స్థానికులకు చికాకు తెప్పిస్తున్నాయి. ఇసుకతోట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల సమీపంలో నివాసాల మధ్య వ్యర్థాల నిల్వలతో ఆందోళన చెందుతున్నారు. వ్యర్థాలు సేకరించుకుని వచ్చేవారు ఇక్కడే గంజాయి సేవించడం, చెత్త నిల్వలను రోడ్డుపైనే ఉంచడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని నివాసులు వాపోతున్నారు. ఇక్కడకు వచ్చే దుండగులు వీధి లైట్లను పగులగొట్టి అసాంఘిక కార్యకలాపాలను కొనసాగిస్తున్నారని ఆరోపిస్తున్నారు. పగలంతా విధుల్లోకి వెళ్లి శ్రమించి వస్తున్న తమకు రాత్రి పూట వ్యర్థ వస్తువుల నిల్వలు, వారు శబ్దాలు చేస్తూ ఇబ్బంది కలిగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై లేఖ ద్వారా స్థానిక నివాసులు జీవీఎంసీ జోన్-3 జోనల్ కమిషనర్ శివప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు.వ్యర్థ వస్తువుల నిల్వలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. రాత్రి పూట బయటకు రావటానికి భయాందోళన చెందుతున్నామని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

రిటైర్డ్ హెచ్ఎంకు సత్కారం



పదవీ విరమణ పొందిన ఉద్యోగులను సన్మానిస్తున్న కమిషనర్ రమేశ్

ఆరిలోవ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దే ఘనత ఉపాధ్యాయులకు దక్కుతుందని తోటగరువు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసి సోమవారం ఉద్యోగ విరమణ చేసిన వి.విశ్వనాథం అన్నారు. ఆయనను సహోపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ వృత్తి తనకు ఎంతగానో సంతృప్తి ఇచ్చిందని అన్నారు.

6 నుంచి కనకదుర్గ అమ్మవారి జాతర



వెంకోజీపాలెం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : కనకదుర్గ అమ్మవారి జాతర వచ్చే నెల 6 నుంచి నిర్వహించనున్నట్టు సీతారామ సేవా మండలి అధ్యక్షుడు కోరిబిల్లి త్రినాథ్ శివ సత్యబాబు తెలిపారు. సోమవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. 6న చాటింపు, 7న తొల్లేళ్లు, 8న అమ్మవారి జాతర అనుపు ఉత్సవం జరపనున్నట్టు చెప్పారు. అనుపు ఉత్సవాన్ని పురస్కరించుకుని ఆ రోజు ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరుగుతాయని తెలిపారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర, జాకెట్, గాజులను సమర్పిస్తారని పేర్కొన్నారు. భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సాయంత్రం అమ్మవారి శతకం పట్టు నుంచి ఊరేగింపుగా తీసుకువస్తామని, ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు, పరస మహోత్సవం ఉంటుందన్నారు. 15న మారువారం పురస్కరించుకుని అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

ఉద్యోగ విరమణ చేసిన పోలీసులకు సీపీ సన్మానం



పదవీ విరమణ పొందిన పోలీసులతో సీపీ శంఖబ్రతబాగ్చి

విశాఖపట్నం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన పోలీసులను సీపీ శంఖబ్రతబాగ్చి సోమవారం సన్మానించారు. క్రైం ఏడీసీపీగా పనిచేస్తున్న ఎం.మోహనరావుతో పాటు ఇద్దరు ఎస్ఐలు, ముగ్గురు ఏఆర్ ఎస్ఐలు, ఏడుగురు ఏఎస్ఐలు, ఒక మహిళా ఏఎస్ఐ, ఒక హెచ్‌సీ, ఇద్దరు ఏఆర్ హెడ్‌కానిస్టేబుళ్లు, నలుగురు హోంగార్డులు ఉద్యోగ విరమణ చేయడంతో వారిని వారి కుటుంబ సభ్యుల సమక్షంలో సన్మానించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఉద్యోగ విరమణ తర్వాత ప్రణాళికబద్ధమైన జీవనం సాగించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో క్రైమ్ ఏడీసీపీ లతామాధురి, తదితరులు పాల్గొన్నారు.

కొండవాలు ప్రాంత విద్యార్థులకు కొండంత మేలు

» దశాబ్దాల కల నెరవేరిన వేళ.. » రాంజీ ఎస్టేట్ ప్రాథమిక పాఠశాల అప్‌గ్రేడేషన్ » ఈ ఏడాది నుంచే ఆరు, ఏడు తరగతుల్లో ప్రవేశాలు » ఇప్పటికే చేరిన 61మంది విద్యార్థులు


వర్గోన్నతి పొందిన రాంజీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల


ఆరో తరగతి విద్యార్థులకు బోధన ప్రారంభం

కంచరపాలెం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఐదో తరగతి పూర్తికాగానే ఆరో తరగతిలో ప్రవేశాల కోసం జాతీయ రహదారిని దాటి కంచరపాలెం మెట్టు వద్దకు వెళ్లిన తమ చిన్నారులు రోజూ ఇంటికి వచ్చేవరకు తల్లిదండ్రులు ఆందోళన చెందేవారు. ఈ నేపథ్యంలో పలువురు విద్యార్థులు ఐదో తరగతితోనే చదువుకు స్వస్తిచెప్పి డ్రాపౌట్స్‌గా మిగిలేవారు. పాఠశాలకు వెళ్తూ రోడ్డు ప్రమాదాలకు గురై విద్యార్థులు ప్రాణాలు కోల్పోయిన పరిస్థితుల నేపథ్యంలో జీవీఎంసీ 46, 47, 48 వార్డుల పరిధి కొండవాలు ప్రాంతాల ప్రజలు రాంజీ ఎస్టేట్ ప్రాథమిక పాఠశాలను అప్‌గ్రేడ్ చేయాలని దశాబ్దాలుగా డిమాండ్ చేసేవారు. ఇటీవల ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు ఈ సమస్యను జిల్లా కలెక్టరు దృష్టికి తీసుకెళ్లడంతో ఈ ఏడాది నుంచే అప్పర్ ప్రైమరీ పాఠశాలగా మార్చుతూ విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ నిర్ణయంపై స్థానికులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నెరవేరిన దీర్ఘకాలిక డిమాండ్

రాంజీ ఎస్టేట్ పాఠశాలను ఉన్నత పాఠశాలగా మార్చాలన్న దశాబ్దాల డిమాండ్ నెరవేరడంతో స్థానికులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమ పిల్లల చదువులు ఇక నిరాటంకంగా సాగుతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా పాఠశాలకు పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులను నియమించాలని కోరుతున్నారు. రెండు దశాబ్దాలుగా నెరవేరని డిమాండ్ ప్రస్తుతం కార్యరూపం దాల్చడంతో తల్లిదండ్రులు, విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదాల నుంచి విముక్తి...

గతంలో ఈ ప్రాంతాల విద్యార్థులు ఆరోతరగతిలో ప్రవేశం పొందాలంటే కంచరపాలెం మెట్టు వద్ద గల ఆర్పీపేట ఉన్నత పాఠశాలకు వెళ్లాల్సి వచ్చేది. ఈనేపథ్యంలో కంచరపాలెం జాతీయ రహదారిని దాటుకుని వెళ్తూ వాహన ప్రమాదాలకు గురై పలు సందర్భాల్లో కొందరు ప్రాణాలు కోల్పోయారు. ప్రస్తుతం రాంజీ ఎస్టేట్ పాఠశాలను యూపీ పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయడంతో ప్రమాదాల నుంచి విముక్తి లభించనుంది. రాంజీ ఎస్టేట్ పాఠశాల అనేక కొండవాలు గ్రామాలకు ఆధారం. దీన్ని ఉన్నత పాఠశాలగా మార్చితే కప్పరాడ, రాంజీ ఎస్టేట్, ఇందిరా నగర్, బాపూజీ నగర్ తదితర గ్రామాల విద్యార్థులకు ఉపయోగపడుతుంది. దూరప్రాంతాలకు వెళ్లాల్సిన ఇబ్బందులు తప్పుతాయని విద్యార్థులు చెబుతున్నారు.

ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజుకు ధన్యవాదాలు



రాంజీ ఎస్టేట్ పాఠశాలను స్థానికుల అవసరాల దృష్ట్యా అప్‌గ్రేడ్‌కు కృషిచేసిన ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజుకు కృతజ్ఞతలు. ఎంతో మంది ఎమ్మెల్యేలకు గతంలో వినతులు అందించినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. విష్ణుకుమార్ రాజు చొరవతో ఈ ప్రాంత విద్యార్థులకు యూపీ పాఠశాల అందుబాటులోకి వచ్చింది. ఈ నిర్ణయం విద్యార్థులు, తల్లిదండ్రులను ఆనందపరిచింది.

-జి.అరుణ్‌బాబు, స్థానిక నాయకుడు

రింగ్ పోల్స్ ఏర్పాటుకు వినతి

కంచరపాలెం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 48వ వార్డు పరిధి కొండవాలు గ్రామాల్లో అవసరమైనచోట రింగ్‌పోల్స్, బోర్‌వెల్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ గంకల కవిత గ్రేటర్ కమిషనర్ కేతన్ గార్గ్‌కు విజ్ఞప్తి చేశారు. సోమవారం పీజీఆర్ఎస్ ద్వారా ఆయనకు వినతిపత్రాన్ని అందజేశారు. కొండవాలు గ్రామాల్లో ప్రధాన కూడళ్ల వద్ద రింగ్‌పోల్స్ లేక ప్రమాదాలు, దొంగతనాలు జరుగుతున్నాయన్నారు. ఆమెతో గంకల అప్పారావు కూడా ఉన్నారు.


కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కవిత

'ఆర్టీఈ అడ్మిషన్ల లోటుపాట్లపై విద్యాశాఖ దృష్టి సారించాలి'

సీతమ్మధార, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని అమలు చేస్తున్న ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం (ఆర్టీఈ) అడ్మిషన్ల లోటుపాట్లపై ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరుతూ రాష్ట్ర సమగ్ర శిక్ష ఉన్నతాధికారులకు లేఖ రాసినట్లు సీతమ్మధార ప్రాంతానికి చెందిన చైల్డ్ రైట్స్ అవేర్నెస్ ఫోరం అధ్యక్షురాలు గొండు ధనలక్ష్మి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అనేక ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలలు, వివిధ యాజమాన్య పాఠశాలల్లో విద్యా హక్కు చట్టాన్ని అనుసరించి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా మొదటి రౌండ్‌లో అధిక శాతం పాఠశాలల యాజమాన్యాలు ప్రవేశాలు నిరాకరిస్తున్న విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వానికి నివేదించామన్నారు. ఆర్టీఈ చట్టాన్ని పరిరక్షిస్తూ, భవిష్యత్‌లో న్యాయపరమైన ఇబ్బందులు రాకుండా బాలల హక్కులను కాపాడాలని కోరుతున్నామని ధనలక్ష్మి పేర్కొన్నారు.

మానసిక ఇబ్బందుల నుంచి మామూలు మనిషిగా..


చికిత్సకు ముందు.. తరువాత ప్రదీప్

డాబాగార్డెన్స్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి మానసిక పరిస్థితి బాగా లేకపోవడంతో చాలా రోజులుగా విశాఖపట్నం పోర్టు ఏరియా, డాబాగార్డెన్స్, ఎల్ఐసీ బిల్డింగ్ తదితర ప్రాంతాల్లో తిరుగుతూ ఉండేవాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో బుచ్చిరాజుపాలెం షెల్టర్ మేనేజర్ ఎల్లేటి మమత స్పందించారు. ఆరు నెలల కిందట మానసిక చికిత్స ఇప్పించేందుకు ఆస్పత్రిలో జాయిన్ చేయించారు. ఇప్పుడు అతను కోలుకోవడంతో ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేయించి బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ నిరాశ్రయ వసతిగృహానికి తీసుకొచ్చి ఆశ్రయం కల్పించారు. ఇతడి పేరు ప్రదీప్ అని ఇంకా మిగిలిన వివరాలను సేకరించి త్వరలోనే అతని కుటుంబ సభ్యులకు అప్పగించే ప్రయత్నం చేస్తామని మమత తెలిపారు.

సోదరికి అమూల్య అప్పగింత

అక్కయ్యపాలెం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని నిరాశ్రయుల వసతిగృహంలో ఆశ్రయం పొందుతున్న పాడేరుకు చెందిన గోడితల అమూల్య (20)ను ఆమె సోదరి కొండ స్వరూపకు అప్పగించినట్లు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. జూన్ 28న నాల్గో పట్టణ పోలీస్ స్టేషన్ పోలీసులు రాత్రి సమయంలో గస్తీ తిరుగుతున్నప్పుడు అమూల్యను గుర్తించి నిరాశ్రయుల వసతి గృహానికి అప్పగించారన్నారు. పోలీస్ విచారణలో తాను ఒక అనాథ అని చెప్పిందని, కానీ ఇంటిలో చెప్పకుండా పారిపోయి వచ్చిందన్నారు. సోమవారం తన సోదరి కొండ స్వరూపను రప్పించి కౌన్సెలింగ్ ఇచ్చి ఏయూటీడీ కేర్‌టేకర్ నారాయణరావు సమక్షంలో అప్పగించినట్లు పేర్కొన్నారు.

పెన్షన్ సవరణ చట్టంపై నిరసన

» డీఆర్ఎం కార్యాలయాన్ని చుట్టుముట్టిన రైల్వే పెన్షనర్లు


డీఆర్ఎం కార్యాలయం బయట మానవహారంగా నిల్చున్న రైల్వే పెన్షనర్లు

విశాఖపట్నం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల హక్కును కాలరాస్తూ కేంద్ర ప్రభుత్వం బిల్లును సవరించడాన్ని నిరసిస్తూ రైల్వే పెన్షనర్లు సోమవారం ఉద్యమం చేపట్టారు. కేంద్ర బడ్జెట్‌లో పెన్షన్ సవరణ బిల్లును రూపొందించడమే కాకుండా రాష్ట్రపతి ఆమోద ముద్రతో చట్టంగా చేయడంపై పెన్షనర్లు ఆందోళన వ్యక్తం చేశారు. దీనిలో భాగంగా నేషనల్ కో-ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ పెన్షనర్స్ అసోసియేషన్ (న్యూఢిల్లీ) పిలుపు మేరకు వాల్తేరు డివిజన్ రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్, రైల్వే పెన్షనర్స్ ఫెడరేషన్, రిటైర్డ్ రైల్వే ఎంప్లాయిస్ అసోసియేషన్, రిటైర్డ్ కో-వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్తంగా సోమవారం డీఆర్ఎం కార్యాలయం వద్ద మానవహారం నిర్వహించారు. సుమారు 900 మంది పెన్షనర్లు మానవహారంగా ఏర్పడి డీఆర్ఎం కార్యాలయాన్ని చుట్టుముట్టారు. పెన్షనర్ల సంఘాల ప్రతినిధులు వేగి నాగేశ్వరరావు, కొండలరావు, ఎంఆర్.రెడ్డి, కె.వి.నర్సింగరావు, వేదుల నర్సింగరావులు మాట్లాడుతూ పెన్షనర్లకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తూ చట్టం చేయడం అమానుషమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగ విరమణ తర్వాత కేవలం పింఛన్‌పై ఆధారపడే వారికి కేంద్రం తీవ్ర అన్యాయం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సవరణ బిల్లును వెనక్కి తీసుకునేంతవరకు దేశవ్యాప్తంగా ఉన్న రైల్వే పెన్షనర్లు ఉద్యమిస్తారని హెచ్చరించారు. అనంతరం డీఆర్ఎం లలిత్ బొహ్రాను కలిసి వినతిపత్రం సమర్పించారు. తమ అసంతృప్తిని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్ల సంఘాల నాయకులు ఎస్.వి.శేషాద్రి, జి.వి.రమణరావు, బి.వి.రమణ, కె.వి.రావు, జగ్గారావు, సన్యాసిరావు, భాస్కరరావు, పెద్ద సంఖ్యలో రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఏపీపీజీ సెట్‌లో విద్యార్థుల ప్రతిభ


ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థినులతో బుల్లయ్య కళాశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు

సీతమ్మధార, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల యూజీ విభాగానికి చెందిన విద్యార్థులు ఆంధ్రప్రదేశ్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ కామన్ ఎంట్రన్స్ పరీక్ష (ఏపీపీజీ సెట్-2025)లో ఉత్తమ ర్యాంకులు సాధించారు. రసాయన శాస్త్ర విభాగంలో ఎంఎస్‌వీ యశస్విని, మానసిక శాస్త్ర విభాగంలో డి.మేఘనా లక్ష్మికి ప్రథమ ర్యాంకులు వచ్చాయి. పి.బెన్నీపాల్ 4వ ర్యాంకు, ముస్కాన్ 16వ ర్యాంకు సాధించారు. రాజనీతి శాస్త్రంలో కె.కుసుమ 16వ ర్యాంకు, అర్థశాస్త్రంలో అశ్వినికి 9వ ర్యాంకు వచ్చాయి. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల మేనేజ్‌మెంట్ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ జి.మధుకుమార్, ప్రిన్సిపాల్ చక్రవర్తి, వైస్ ప్రిన్సిపాల్ సురేఖ, అధ్యాపక సిబ్బంది అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఉపాధ్యాయినికి ఉద్యోగ విరమణ సన్మానం

అక్కయ్యపాలెం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాల సహాయకురాలు, సోషల్ స్టడీస్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఆకెళ్ల రమణశ్రీని సోమవారం ఘనంగా సన్మానించారు. ఆమె గత 41 ఏళ్లుగా పని చేసి పాఠశాల సహాయకురాలిగా పదోన్నతి పొంది ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయిని జయంతి రాధాకుమారి ఆధ్వర్యంలో ఎంఈవోలు రామారావు, బాలామణి, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ప్రతినిధులు, ఉపాధ్యాయులు రమణశ్రీని ఘనంగా సత్కరించారు.

'డాక్టర్ రావిప్రోలు జ్ఞాపకాలు మరువలేనివి'

సీతంపేట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ గాంధేయవాది డాక్టర్ రావిప్రోలు సుబ్రహ్మణ్యం జ్ఞాపకాలు మరువలేనివని వక్తలు శ్లాఘించారు. బుల్లయ్య కళాశాల్లోని గాంధీ సెంటర్ హాలులో సహృదయ సాహితి విశాఖపట్నం, గాంధీ సెంటర్ సంయుక్తంగా ప్రముఖ గాంధేయవాది రావిప్రోలు సుబ్రహ్మణ్యం సంస్మరణ సభను సోమవారం నిర్వహించారు. ఆయన చిత్రపటం వద్ద వక్తలు నివాళులర్పించారు. సుబ్రహ్మణ్యంతో తమ జ్ఞాపకాలను గుర్తు తెచ్చుకున్నారు. ఆయన వ్యక్తిత్వం, ప్రవర్తన, ఆశయాలు, సేవా దృక్పథాన్ని స్మరించుకున్నారు. ఆయన లేని లోటు తీర్చలేనిదని అభిప్రాయపడ్డారు. సుబ్రహ్మణ్యం ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ సభలో నాగార్జున యూనివర్సిటీ పూర్వ ఉపకులపతి ఆచార్య బాలమోహన్ దాస్, శేఖరమంత్రి ప్రభాకర్, ద్విభాష్యం రాజేశ్వరరావు, మేడా మస్తాన్‌రెడ్డి, నరవ ప్రకాశరావు, ఘంగికోట విశ్వనాథం, డాక్టర్ కె.వి.ఎస్.మూర్తి, జె.పి. శర్మ, సిహెచ్ చిన సూర్యనారాయణ పాల్గొన్నారు.


డాక్టర్ రావిప్రోలు సుబ్రహ్మణ్యం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గాంధీ సెంటర్ ప్రతినిధులు

మురళీనగర్‌లో వీధి శునకాలతో బెంబేలు!


మురళీనగర్ రోడ్లలో ఇదే తంతు

మురళీనగర్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): నగరంలో పేరొందిన నివాసిత ప్రాంతంగా ఉన్న మురళీనగర్, మాధవధార ప్రాంతాల్లో శునకాల బెడద రోజురోజుకీ ఎక్కువవుతోంది. రాత్రయితే పాదచారులు, వాహనదారులు గమ్య స్థానాల్ని చేరేందుకు ఇబ్బందులు పడుతున్నారు. కొండ చివర ప్రాంతాలుగా ఉండే మురళీనగర్ ఎన్‌జీజీఓస్ కాలనీ, మాధవధార ఉడాకాలనీ తదితర ప్రాంతాలు సహా 48ఏ బస్సులు తిరిగే ప్రధాన మార్గాల్లో వెంటపడుతున్న వీధి కుక్కలతో బాటసారులు ఇబ్బంది పడుతున్నారు. రోజూ తిరిగే ప్రాంతాల్లోనే శునకాలు దాడికి దిగుతున్నాయని వాపోతున్న స్థానికులు జీవీఎంసీ వెటర్నరీ విభాగం అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. రాత్రివేళ ఇళ్లల్లోకి చొరబడుతున్న కుక్కలు దుస్తులు, బయట ఉండే వస్తువులు, పాదరక్షలు వంటి వాటిని చిందరవందర చేస్తున్నాయని గగ్గోలుపెడుతున్నారు.

మెడికల్ హైపవర్ కమిటీ సభ్యునిగా రఘు


రఘును సత్కరిస్తున్న కూటమి నాయకులు

మురళీనగర్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ రాష్ట్ర వైద్య విభాగం చైర్మన్, ఉత్తర నియోజకవర్గ నాయకుడు బి.రఘును రాష్ట్ర మెడికల్ హైపవర్ కమిటీ సభ్యునిగా ప్రభుత్వం నియమించింది. ప్రైవేటు హాస్పిటల్స్ నిర్వాహకునిగా ఉంటూ రఘు రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్నారు. జనసేన పార్టీ కార్యక్రమాల్లో నిమగ్నమై ఉన్నారు. ఉత్తర నియోజకవర్గ కూటమి నాయకులు ఎం.వి.రమణ, ఎస్.వరప్రసాద్, నరసింహ, వెంకటరమణ తదితరులు సోమవారం ఆయనను ఆత్మీయంగా సత్కరించారు.

నేత్రపర్వంగా అప్పన్న కల్యాణం

సింహాచలం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్య కల్యాణం సోమవారం నేత్రపర్వంగా జరిగింది. సుప్రభాతసేవతో స్వామిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామి, ఉభయ దేవేరులను శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. అనంతరం శాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు జరిపారు.

రైతుబజార్‌లో దుకాణాల ఎత్తు పెంపు

కంచరపాలెం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): నిత్యం రద్దీగా ఉండే కంచరపాలెం రైతుబజార్‌లో రైతులకు సరిపడా దుకాణాలు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తేవి. గతంలో 116 దుకాణాలు ఉండగా వీటికి అదనంగా ఇటీవల కొత్త దుకాణాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం 130 దుకాణాలు రైతులకు అందుబాటులో ఉన్నాయి. దుకాణాల ఎత్తు పెంచడంతో రైతులు, కొనుగోలుదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఏ ఒక్క రైతు నేలపై తమ ఉత్పత్తులు ఉంచి వ్యాపారం చేయకూడదనే లక్ష్యంతో మార్కెటింగ్ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ఇప్పుడు సౌకర్యంగా ఉండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆరు నూతన ప్లాట్‌ఫారమ్స్ కూడా అందుబాటులోకి తీసుకువచ్చినట్టు ఎస్టేట్ అధికారి జగదీష్ పేర్కొన్నారు.


రైతులు, కొనుగోలుదారులకు ప్రస్తుతం సౌకర్యంగా ఉన్న కంచరపాలెం రైతుబజార్

549 మంది డిజిటల్ అసిస్టెంట్లకు బదిలీ

(5వ పేజీ తరువాయి)

సచివాలయాల్లో పనిచేస్తున్న గ్రేడ్-3 ఏఎన్ఎంల బదిలీలకు సంబంధించి సోమవారం కౌన్సె లింగ్ నిర్వహించారు. ఆరోగ్య శాఖ కార్యాలయంలో విశాఖ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం రాత్రి వరకూ ఈ కార్యక్రమం చేపట్టారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 1,300 మంది ఉండగా, తొలిరోజు 207 మందిని బదిలీ చేశారు. మిగిలిన వారికి బుధవారం నుంచి కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. మంగళవారం పెన్షన్లు పంపిణీ కార్యక్రమం ఉండడంతో కౌన్సెలింగ్ నిర్వహించరు. ఏఎన్ఎంలను సొంత మండలాల్లో కాకుండా పక్క మండలాలకు బదిలీ చేస్తున్నారు. అయితే సొంత మండలాల్లో కొనసాగించాలంటూ కొందరు ప్రజా ప్రతినిధుల నుంచి సిఫారసు లేఖలు తెచ్చారు. అయితే, ఆ లేఖలను పరిగణనలోకి తీసుకోకుండానే బదిలీలు ప్రక్రియను చేపట్టారు. డీపీఎంవో డాక్టర్ ఉమావతి, ఏవో విజయ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ విద్యాసాగర్‌లు బదిలీల ప్రక్రియ చేపట్టారు.

సారథులు మనోళ్లే

(5వ పేజీ తరువాయి)

పార్టీ అధ్యక్షులు సోము వీర్రాజును తప్పించి కొత్తవారికి బాధ్యతలు అప్పగించాలని అధిష్ఠానం యోచించినప్పుడే మాధవ్ పేరు పరిశీలనకు వచ్చింది. అయితే సీనియర్ నాయకురాలు దగ్గుబాటి పురందేశ్వరికి పెద్దలు అవకాశం కల్పించారు. ఇప్పుడు కొత్త అధ్యక్షులను ఎన్నుకునే సమయం రావడంతో ఆ పదవి కోసం చాలా మంది పోటీ పడ్డారు. అయితే అధిష్ఠానం మాత్రం బీజేపీ మూలాలు కలిగిన వారికే పట్టం కట్టాలని భావించి మాధవ్‌ను ఎంపిక చేసింది.

పెద్దాస్పత్రికి సుస్తీ

(5వ పేజీ తరువాయి)

కాదు. ఈ నేపథ్యంలోనే సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లనున్నట్టు సూపరింటెండెంట్ డాక్టర్ వాణి వెల్లడించారు. ప్రస్తుతానికి ఈ సమస్య నుంచి బయటపడే మార్గాల కోసం అన్వేషిస్తున్నట్టు వెల్లడించారు. ఒక ప్రైవేటు సంస్థ నుంచి అద్దెకు పరికరాన్ని తెచ్చే ఆలోచనలో ఉన్నట్టు వెల్లడించారు. గతంలో అద్దెకు తెచ్చిన పరికరానికి నెలకు రూ.60 వేలు చెల్లించామని, ఇప్పుడు అద్దెకు తీసుకురావాలని భావిస్తున్న సంస్థ రూ.లక్షన్నర అడుగుతుండడంతో ఆలోచనలో పడినట్టు వెల్లడించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు.

ఏయూ దూర విద్యలో ఆన్‌లైన్ కోర్సులకు స్వస్తి?

(5వ పేజీ తరువాయి)

ప్రొఫెసర్లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ విధానంపై పునరాలోచన చేయాలంటూ అప్పటి ఉన్నతాధికారులను పలువురు సీనియర్ ప్రొఫెసర్లు కోరారు. ఒకరిద్దరు ప్రిన్సిపాల్స్ ఆన్‌లైన్‌లో నిర్వహించే కోర్సులతో విద్యార్థులకు సబ్జెక్ట్ రాదని, అవకతవకలకు అవకాశం ఉందంటూ లేఖలు కూడా రాశారు. అయినప్పటికీ అప్పటి అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. అయితే, తాజాగా వర్సిటీ ఉన్నతాధికారులు ఈ కోర్సుల నిర్వహణకు సంబంధించి పునఃపరిశీలించాలని దూర విద్యా కేంద్రం డైరెక్టర్‌కు ఏయూ వైస్ చాన్సలర్ జీపీ రాజశేఖర్ సూచించినట్టు చెబుతున్నారు. మొదట మల్టిపుల్ చాయిస్ విధానంలో ఆన్‌లైన్‌లో పరీక్షల నిర్వహణ, ఆ తరువాత ఆన్‌లైన్‌లో కోర్సులకు స్వస్తి చెప్పనున్నట్టు తెలుస్తోంది. ఇదిలావుంటే ఈ కోర్సులను ఏయూ దూర విద్య, మరో రెండు ప్రైవేటు సంస్థలు సంయుక్తంగా నిర్వహించడం గమనార్హం. ప్రవేశాల నుంచి పరీక్షలు నిర్వహణ వరకు అన్నీ ఆ రెండు సంస్థలే చూసుకుంటాయి.

మార్పులపై ఫోకస్

దూర విద్యా కేంద్రం ద్వారా నిర్వహిస్తున్న కోర్సులకు సంబంధించి పరీక్షా కేంద్రాల పెంపు, నిర్వహణలో అవకతవకలు వంటి వాటిపైనా వర్సిటీ ఉన్నతాధికారులు దృష్టిసారించారు. దూరవిద్యను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాలని నూతనంగా నియమితులైన డైరెక్టర్‌కు వీసీ సూచించినట్టు తెలిసింది. ఏళ్ల తరబడి కొనసాగుతున్న ఉద్యోగుల జాబితాను సిద్ధం చేసి, ఆరోపణలకు కేంద్ర బిందువులుగా ఉన్న వారిని మార్చే ప్రక్రియ చేపట్టనున్నట్టు చెబుతున్నారు.

రెండు నెలల్లో 5,000 రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్లు

(5వ పేజీ తరువాయి)

తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ, డిస్కమ్ పరిధిలో 2024 నుంచి 2025 ఏప్రిల్ వరకూ పది వేల రూఫ్ టాప్ సోలార్ ప్లాంట్లు ఏర్పాటుచేయగా, ఆ తరువాత రెండు నెలల్లో మరో 5 వేలు...మొత్తం 15 వేలు పూర్తి చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో పది వేల సోలార్ ప్లాంట్లు పెట్టాలని లక్ష్యం ఇవ్వడంతో 'వర్చువల్ నెట్ మీటరింగ్'కు కూడా అనుమతిస్తామని చెప్పారు. సాధారణంగా ఈ పథకం కింద సొంత ఇంటి పైకప్పుపై సోలార్ ప్లాంటు ఏర్పాటు చేసుకోవాలని, అయితే అపార్టుమెంట్లలో ఉంటున్నవారు సొంతంగా వీటిని పెట్టుకోవాలని ఆసక్తి చూపుతున్నా మిగిలిన ఫ్లాట్ల వారి నుంచి అభ్యంతరాల వల్ల సాధ్యం కావడం లేదని తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇలాంటి వారికి అదే డివిజన్ పరిధిలో ఎక్కడైనా మరో సొంత ఇల్లు ఉంటే...అక్కడ రూఫ్‌టాప్ సోలార్ ప్లాంటు ఏర్పాటు చేసుకుంటే అక్కడ ఉత్పత్తి చేసిన విద్యుత్‌ను గ్రిడ్‌కు పంపించి, అంతే మొత్తం యూనిట్లను అపార్టుమెంట్ ఫ్లాటులో ఉపయోగించుకునే అవకాశం కల్పిస్తామని చెప్పారు. దీనినే 'వర్చువల్ నెట్ మీటరింగ్' అంటామన్నారు. రూఫ్ టాప్ సోలార్ ప్లాంటుకు ఒక్కసారి పెట్టుబడి పెడితే ఇరవై ఏళ్ల వరకు దానిని ఉపయోగించుకోవచ్చునని, దానివల్ల విద్యుత్ బిల్లు గణనీయంగా తగ్గుతుందన్నారు.

రాయితీగా రూ.115 కోట్లు

ఇప్పటివరకూ 15,120 సోలార్ ప్లాంట్ల ద్వారా 50,002 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన విద్యుత్‌ను ఉత్పత్తి చేసి గ్రిడ్‌కు అనుసంధానం చేయడం వల్ల ఆ వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం నుంచి రాయితీగా రూ.115 కోట్లు వచ్చిందని సీఎండీ పృథ్వీతేజ్ తెలిపారు. విశాఖపట్నంలో జిల్లాలో 2,056 మందికి, శ్రీకాకుళం జిల్లాలో 1,650 మందికి, పార్వతీపురం మన్యం జిల్లాలో 289 మందికి, విజయనగరం జిల్లాలో 1,549 మందికి, అనకాపల్లి జిల్లాలో 1,239 మందికి, అల్లూరి మన్యం జిల్లాలో తొమ్మిది మందికి ఈ రాయితీ వచ్చిందన్నారు. కిలోవాట్ సామర్థ్యం కలిగిన ప్లాంటు ఏర్పాటు చేసుకోవాలంటే కనీసం పైకప్పుపై 100 చ.అ. విస్తీర్ణం కలిగిన స్థలం ఉండాలన్నారు. ఒక కిలోవాట్‌కు రూ.30 వేలు, రెండు కిలోవాట్లకు రూ.60 వేలు, మూడు కిలోవాట్లకు రూ.78 వేలు రాయితీ వస్తుందన్నారు. మూడు కిలోవాట్లు ప్లాంట్లు ఏర్పాటు చేసుకుంటే నెలకు 360 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందని, ఇంటి అవసరాలకు వాడుకోగా మిగిలిన విద్యుత్ సంస్థకు విక్రయించడం వల్ల అదనపు ఆదాయం కూడా వస్తుందన్నారు. ఈ అవకాశాన్ని సోలార్ విద్యుత్ కావాలనే వారు ఉపయోగించుకోవాలని కోరారు.

ఐదుగురి గుప్పిట్లో నైట్ ఫుడ్‌కోర్టు

(5వ పేజీ తరువాయి)

నైట్‌ఫుడ్‌కోర్ట్‌ను ప్రారంభించాయి. జీవీఎంసీ యూసీడీ ద్వారా ఎంపిక చేసిన 32 మంది ఫుడ్‌కోర్ట్‌లో స్టాళ్ల ఏర్పాటుచేసుకున్నారు. కరోనా సమయంలో ఫుడ్‌కోర్ట్‌ను మూసివేశారు. ఆ తర్వాత జీవీఎంసీ ఫుడ్‌కోర్ట్‌కు అనుమతించలేదు. ఈ నేపథ్యంలో అక్కడ వ్యాపారాలు సాగించిన ఐదుగురు...అప్పటి వైసీపీ నేతలను ప్రసన్నం చేసుకుని 170 దుకాణాలను ఏర్పాటు చేశారు. పదేసి చొప్పున దుకాణాలను తమ చేతిలో ఉంచుకుని అద్దెకు ఇచ్చుకున్నారు. మిగిలిన వాటిని ఆసక్తి కలిగిన వ్యాపారులకు 36 చదరపు గజాలు స్థలం చొప్పున మార్కింగ్ చేసి రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలకు అమ్ముకున్నారు. ఫుడ్‌కోర్టు కారణంగా పారిశుధ్య సమస్య తలెత్తుతుండడం, అదేవిధంగా జీవీఎంసీకి ఒక్క రూపాయి ఆదాయం కూడా రాకపోవడంతో దానిని ఎత్తివేయాలంటూ టీడీపీ, జనసేన కార్పొరేటర్లు కౌన్సిల్ సమావేశంలో డిమాండ్ చేశారు. దీంతో ఏడాది కిందట కౌన్సిల్ సమావేశంలో ఫుడ్‌కోర్టును తొలగించాలని తీర్మానం చేశారు.

అయినప్పటికీ జీవీఎంసీ అధికారులు ఫుడ్‌కోర్టును తొలగించే ప్రయత్నం చేయలేదు. దీనిపై జనసేన కార్పొరేటర్ మూర్తియాదవ్ ఇటీవల హైకోర్టులో పిల్ దాఖలు చేయడంతో జూన్ 16లోగా కౌంటర్ దాఖలు చేయాలని జీవీఎంసీ అధికారులను ఆదేశించింది. ఇటీవల ఫుడ్‌కోర్టులో ఒక యువకుడు ఐస్‌క్రీమ్ దుకాణం ఏర్పాటు చేయాలనుకున్నాడు. అందుకోసం ఆ ఐదుగురిలో ఒకరిని సంప్రతించాడు. దుకాణాలు ఖాళీ లేవని చెబుతూ, 18 చదరపు అగురులు స్థలం కలిగినవి ఉన్నాయని, వారంతా రూ.12 వేలు అద్దె ఇస్తున్నందున, రూ.15 వేలు అద్దె ఇవ్వడానికి సిద్ధపడితే ఒకరిని ఖాళీ చేయించి ఆ స్థలం ఇస్తానని ప్రతిపాదించాడు. దీనికి యువకుడు సరేననడంతో రెండు నెలలు అద్దెను అడ్వాన్స్‌గా తీసుకున్నాడు. యువకుడు దుకాణం ఏర్పాటుకు స్టాల్‌ను తయారుచేయించుకుని ఫుడ్‌కోర్టు సమీపంలో ఉంచాడు. గుజరాత్ నుంచి రూ.3.5 లక్షలు వెచ్చించి యంత్రాలను కొనుగోలు చేశాడు. వచ్చే నెల నాలుగున దుకాణం ప్రారంభించాలనుకుంటున్నట్టు స్థలం అద్దెకు ఇచ్చిన వ్యక్తికి చెప్పాడు. అయితే ఆ స్థలాన్ని తాను ఇవ్వడం లేదని, అడ్వాన్స్‌ను వెనక్కి ఇచ్చేస్తున్నానంటూ ఫోన్‌పే ద్వారా యువకుడికి తిరిగి చెల్లించాడు. దీంతో కంగుతిన్న యువకుడు తాను రూ.3.5 లక్షలు పెట్టి యంత్రాలు కొనుగోలు చేయడంతోపాటు స్టాల్‌ను తయారుచేయించుకున్నానని, ఇప్పుడు కాదంటే తన పరిస్థితి ఏమిటని ప్రశ్నించాడు. తాను దుకాణం పెట్టి తీరతానని చెప్పడంతో 'నా పొలిటికల్ బ్యాక్‌గ్రౌండ్ తెలిస్తే తట్టుకుని బతకలేవు. ఎమ్మెల్యేలు నాకు అండగా ఉన్నారని' బెదిరించాడు. ఇదే తరహాలో ఐదుగురిలో మరొకరు...అధిక అద్దె ఆశపడి...ఇప్పటికే ఉన్న దుకాణాన్ని తొలగించాడు. ఫుడ్‌కోర్ట్‌లో దళారీల ఆగడాలను అరికట్టడంతోపాటు తమకు దుకాణం పెట్టుకుని ఉపాధి పొందేలే స్థలం ఇప్పించాలని కోరేందుకు బాధితులు ఇద్దరూ సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వెళ్లారు. ఈ విషయం అడ్వాన్స్ వెనక్కి ఇచ్చిన వ్యక్తికి తెలియడంతో... ఒకరు బాధిత యువకుడికి ఫోన్ చేసి 'అనవసరంగా నన్ను రెచ్చగొడుతున్నావ్...తర్వాత ఏం జరిగినా నాకు సంబంధం ఉండదని' బెదిరించాడు. దీంతో వారిద్దరూ తమకు ఎక్కడైనా దుకాణం పెట్టుకునేందుకు స్థలం ఇప్పించి ఉపాధి కల్పించాలని కోరుతూ కమిషనర్‌కు వినతిపత్రం అందజేసి వెనుతిరిగారు. ఇంత జరుగుతున్నా ఉన్నతాధికారులు అనధికార ఫుడ్‌కోర్టు విషయంలో ఎందుకు జోక్యంచేసుకోవడం లేదనేది అర్థం కావడం లేదని కార్పొరేటర్లు, ఇతర అధికారులు అంటున్నారు.

టీసీల కోసం డబ్బులు డిమాండ్‌పై విచారణ

ఆరిలోవ,జూన్ 30 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణాపురం అంబేడ్కర్ గురుకులంలో విద్యార్థుల టీసీల కోసం డబ్బులు డిమాడ్ చేశారనే ఆరోపణపై సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి ఆదేశాల మేరకు ఇన్‌చార్జి సమన్వయకర్త ఎన్. రామకృష్ణ సోమవారం విచారణ జరిపారు. ఇలాంటి ఉదంతం మునుపెన్నడూ చూడలేదని ఆయన విచారం వ్యక్తం చేశారు. సాధారణంగా విద్యా సంవత్సరంలో ఫలితాలు వచ్చిన వెంటనే విద్యార్థులు పై తరగతులకు వెళ్లేందుకు టీసీలను సిద్ధం చేయాల్సిన బాధ్యత ప్రిన్సిపాల్, సిబ్బందిపై ఉంటుందన్నారు. టీసీల కోసం, పాఠశాలలో ప్రవేశాల కోసం వచ్చిన వారితో ఆయన మాట్లాడి వెంటనే టీసీలు ఇప్పించారు. ఈ ఘటనపై విచారణ నివేదికను కార్యదర్శికి పంపానన్నారు.

వాకర్స్‌కు వైద్య పరీక్షలు


వైద్య శిబిరంలో పాల్గొన్న వాకర్స్

ఎంవీపీ కాలనీ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజెన్స్‌కు సోమవారం ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు.ఎంవీపీ కాలనీ అళ్వార్‌దాస్ గ్రౌండ్‌లో వీఎస్‌సి వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరంలో ఎంజీఎం హెల్త్ కేర్ వైద్య సిబ్బంది ఉచితంగా బీపీ, షుగర్ పరీక్షలు, వాసన్ ఐ కేర్ ఆసుపత్రి సిబ్బంది కంటి పరీక్షలు నిర్వహించారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పి. కిశోర్ కుమార్, సభ్యులు పాల్గొన్నారు.

వాల్వ్ లీకేజీతో తాగునీరు వృథా



వెంకోజీపాలెం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ పరిధిలోని 15వ వార్డు హెచ్‌బీ కాలనీ సన్‌స్కూల్ సమీపంలోని మంచినీటి నిల్వ ట్యాంకుల నుంచి సరఫరా అయ్యే పైపు లైనులకు ఉండే వాల్వ్‌లు మరమ్మతులకు గురవ్వడంతో మంచినీరు రోడ్డుపై వృథాగా పోతోంది. రెండు రోజులు నీటి సరఫరా సిబ్బంది సమ్మె చేయడంతో మంచినీటి కుళాయిలు రాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న పాత వెంకోజీపాలెం ప్రాంత ప్రజలు వృథాగాపోతున్న నీటిని చూసి ఆవేదన చెం దుతున్నారు. సిబ్బందిని ప్రశ్నించగా పాతకాలం వాల్వ్‌లు కావడంతో మరమ్మతుకు గురయ్యాయని చెబుతున్నారు. అధికారులు పరిశీలించి మరమ్మతులు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

సినిమా గైడ్

- **కన్నప్ప** : జగదాంబ, కిన్నెర, శ్రీకన్య, లీలామహల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి), లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ),
- **కుబేర** : మెలోడి, సంగం, శ్రీరామా, కామేశ్వరి, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)
- **ఎఫ్.1** : రమాదేవి, జగదాంబ,
- **మార్గన్ :** శారద, శరత్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), రమాదేవి,
- **8 వసంతాలు** : శ్రీ వెంకటేశ్వర, కన్య హెవెన్ (గాజువాక).

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 23, టమాటా 22, వంకాయలు (తెలుపు) 26, వంకాయలు (నలుపు) 26, బెండకాయలు 42, పచ్చిమిర్చి 44, కాకరకాయలు 38, బీరకాయలు 36, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 40, క్యాబేజి 18, క్యారెట్ 40, దొండకాయలు 36, బంగాళ దుంపలు 18, అరటికాయ (పె)10, మునక్కాడలు (కిలో) 86, అల్లం (పాతది)50, బరబాటి 40, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 55, బద్దచిక్కుడు 50, దోసకాయలు 16, వె ల్లుల్లి (పెద్దవి) 90, కొబ్బరికాయ (పెద్దది) 24, బీన్స్ (పెన్సిల్) 100, కీరదోస 34, కాప్సికమ్ 80, పొట్లకాయ (పెద్దది) 40, చేమదుంపలు 36, చిలగడదుంపలు 34, కంద 54, దేముడు చిక్కుడు 56, గోరు చిక్కుడు 40, కూర పెండలం 30, బ్రకోలి 45, నూల్ కోల్ 34, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 4 , చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)	(వంద - రూ.లలో)
విశాఖపట్నం	585
విజయనగరం	589
శ్రీకాకుళం	589

చికెన్ ధరలు	బ్యాగ్
రైతు ధర	80
లైవ్ ధర	100
విత్ స్కిన్	170
స్కిన్‌లెస్	180


ఎంవీపీ కాలనీ రెండు, మూడు సెక్టర్లలో ఫుట్‌పాత్‌పైనే వ్యాపారుల సామగ్రి


ఆరో సెక్టరులో ఫుట్‌పాత్‌పై వాహనాల పార్కింగ్

ఎంవీపీలో ఫుట్‌పాత్‌ల ఉనికి గల్లంతు!

ఆక్రమణల చెరలో ఉన్నా.. కళ్లు మూసుకున్న యంత్రాంగం

ఎంవీపీ కాలనీ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రణాళికాబద్ధంగా నిర్మించిన ఎంవీపీ కాలనీలో 'పక్కా ప్రణాళిక'తో ఫుట్‌పాత్‌లు ఆక్రమించేశారు. ప్రజలు ఈ విషయం గమనించినా అధికారులు కళ్లు మూసుకున్నారు. పాదచారులు ఎక్కడా ఫుట్‌పాత్‌పై నడిచే పరిస్థితి లేదు. వెంకోజీపాలెం నుంచి ఎంవీపీ కాలనీ సర్కిల్‌కు వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా ఫుట్‌పాత్‌లు పేరుకే ఉన్నాయి. అన్నిచోట్ల పూర్తిగా వ్యాపారులు ఆక్రమించేశారు. పద్దెనిమిదో వార్డు పరిధిలోని ఎంవీపీ కాలనీ రెండు, మూడు, ఆరు, ఏడు సెక్టర్ల మధ్య ఉన్న రహదారిని ఆనుకుని ఉన్న ఫుట్‌పాత్‌ల పరిస్థితి దారుణం. ఇక్కడ పరిస్థితి చూస్తే, జీవీఎంసీ పట్టణ ప్రణాళిక సిబ్బంది ఉన్నారా? అనే అనుమానం వస్తుంది. ఈ సిబ్బంది అక్రమ నిర్మాణాల వద్ద మామూళ్ల వసూళ్లలో బిజీగా ఉండడమే తప్ప ఇలాంటి సమస్యను పట్టించుకున్న దాఖలాలు లేవు. ఎన్నిసార్లు స్థానికులు ఫిర్యాదు చేసినా, జీవీఎంసీ పట్టించుకోకపోవడంతో కొద్ది నెలల క్రితం ట్రాఫిక్ పోలీసులు రంగంలోకి దిగి ఆక్రమణలు తొలగించారు. వారం రోజులు బాగానే నడిచింది. ఫుట్‌పాత్‌లంటే పాదచారులకే అన్న రీతిన అన్నిచోట్ల కనిపించింది. తర్వాత మళ్లీ మామూలే. ఉదయం ఎనిమిది నుంచే వ్యాపారులు తమ సామగ్రిని ఫుట్‌పాత్‌లపై పెడుతున్నారు. ఒక్కో చోట ద్విచక్రవాహనాలు, కార్లు కూడా ఫుట్‌పాత్‌లపై దర్శనమిస్తుంటాయి. ఇంత జరుగుతున్నా మహా అధికారులకు మాత్రం కనిపించదు. ఇదేం చోద్యమో!

బాధ్యతగా పనిచేస్తేనే మెరుగైన ఫలితాలు

జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ కేతన్‌గార్గ్

వెంకోజీపాలెం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే అర్జీలను సకాలంలో సచివాలయ స్థాయిలోనే పరిష్కరించాలని, కార్యదర్శులు చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ ఆదేశించారు. సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులు, జోనల్ కమిషనర్లు, సచివాలయ కార్యదర్శులతో మాట్లాడారు. గత వారం జీవీఎంసీకు వచ్చిన ఫిర్యాదులపై జోనల్ కమిషనర్ల ద్వారా పరిష్కారాలపై ఆరా తీశారు. పట్టణ ప్రణాళిక విభాగం, రెవెన్యూ, నీటి సరఫరా, పబ్లిక్ హెల్త్, వీధి లైట్ల విభాగాలకు సంబంధించి అధికంగా ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఇకపై ప్రతి సోమవారం స్వీకరించిన ఫిర్యాదులను అదే రోజు వాటిపై పరిష్కారమార్గ చర్యలను సచివాలయ కార్యదర్శులు చేపట్టాలని కమిషనర్ ఆదేశించారు. ప్రతి సచివాలయానికి ప్రజల నుంచి ఒకటో, రెండో ఫిర్యాదులు వస్తాయని, వాటిని నిర్ణీత సమయంలో పరిష్కరిస్తే పీజీఆర్ఎస్‌కు ప్రజలు ఫిర్యాదులు సమర్పించరని, ఆ దిశగా జోనల్ కమిషనర్లు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని కమిషనర్ ఆదేశించారు. సచివాలయ వార్డు ఎమినిటీస్ కార్యదర్శులు ప్రజలకు అందించే నీటి సరఫరా కలుషితం కాకుండా, పైప్‌లైన్లు కాలువలో కలవకుండా పరిశీలించేందుకు సర్వే నిర్వహించాలని సూచించారు. ప్రజలకు సరఫరా చేస్తున్న నీటి నాణ్యత పరీక్షలు జరపాలని, నాణ్యతతో కూడిన తాగునీరు ఏమేరకు ప్రజలకు సరఫరా జరుగుతున్నదో తెలుసుకోవాలన్నారు. నగర సుందరీకరణ దృష్ట్యా సెంటర్ మీడియన్లు, ఓపెన్ స్పేసెస్, పార్కులు అందంగా తీర్చిదిద్దేలా నగర పచ్చదనాన్ని పెంపొందించాలని, అలాగే వీధిలైట్ల నిర్వహణలో నిత్యం ప్రత్యేక దృష్టి సారించి లోపాలు లేకుండా సమగ్ర సర్వే చేపట్టాలని కమిషనర్ ఆదేశించారు. వర్షాకాలం అయినందున నగరంలో దోమలు వృద్ధి చెందకుండా, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతిచోట పొగ కొట్టించాలని, వ్యర్థాలు నిల్వలేకుండా వార్డు శానిటేషన్ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలన్నారు. అధికంగా టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి ఫిర్యాదులు వస్తున్నాయని, అక్రమ, అనధికార కట్టడాలు, ఆక్రమణలు నియంత్రించేందుకు ముందస్తుగా ప్రతిరోజు వార్డులలో తనిఖీలు నిర్వహించాలన్నారు. అనధికార కట్టడాలకు వెంటనే నోటీసులు జారీ చేసి చర్యలు చేపట్టాలని నిర్దేశించారు. కొత్తగా నిర్మాణాలు చేపట్టిన వారికి పూర్తిగా గ్రీన్ మ్యాట్ కప్పి, అనుమతులు వచ్చాకే పనులు చేపట్టమని సూచించాలని, భవన నిర్మాణ వ్యర్థాలు రోడ్లపై, బహిరంగ ప్రదేశాల్లో వేయకుండా చూడాలని ప్లానింగ్ కార్యదర్శులకు కమిషనర్ సూచించారు. అడ్మిన్ కార్యదర్శులు జీవీఎంసీ ఆర్థిక పరిపుష్టి దిశగా వార్డులలో సర్వే నిర్వహించి ఆస్తిపన్ను రాబట్టాలని, సచివాలయాల్లో అన్ని విభాగాల కార్యదర్శులు ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్న విధివిధానాలను గమనిస్తూ చిత్తశుద్ధితో కార్యకలాపాలు నిర్వహించాలని కమిషనర్ సూచించారు. సచివాలయాలను నిత్యం పర్యవేక్షిస్తూ వార్డు కార్యదర్శుల పనితీరు మెరుగుపడాలన్నారు.

వినతులను సత్వరమే పరిష్కరించాలి

వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్


సమస్యలు వింటున్న వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్

సిరిపురం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : వీఎంఆర్‌డీఏ ప్రజాదర్బార్‌కు వచ్చే వినతుల్లో ఎక్కువగా భూ సంబంధితమైనవి ఉంటున్నాయని, వాటి పరిష్కారంలో నిశిత పరిశీలన అవసరమని వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్, కమిషనర్ విశ్వనాథన్ అన్నారు. సోమవారం వారు వీఎంఆర్‌డీఏ కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన వినతులను సాధ్యమైనంత వరకు వెంటనే పరిష్కరించే దిశగా పనిచేయాలని సూచించారు. వినతుల పరిష్కారంలో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాగా ప్రజా దర్బార్‌కు మొత్తం 11 ఫిర్యాదులు రాగా ప్లానింగ్ 5, ఎస్టేట్ 3, సాంకేతిక విభాగం 2, ఇతర విభాగానికి ఒక్కటి చొప్పున అర్జీలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ రమేష్, ఎస్టేట్ అధికారి దయానిధి, చీఫ్ అకౌంటెంట్ ప్రసాద్ పాల్గొన్నారు.

గృహిణులకు స్పోకెన్ ఇంగ్లీష్‌లో శిక్షణ

విశాఖపట్నం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): గృహిణులకు స్పోకెన్ ఇంగ్లీష్‌లో రెండు నెలల ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు గృహిణి స్పోకెన్ ఇంగ్లీష్ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు దామోదర మనోహర్ ఒక ప్రకటనలో తెలిపారు. రామాటాకీస్ సమీపంలోని కెనరా బ్యాంకు ఎదురుగా శ్రీకృష్ణ ట్రావెల్స్ మేడపై ఉన్న సంస్థ కార్యాలయంలో జూలై మూడో తేదీ నుంచి సెప్టెంబరు ఐదో తేదీ వరకు శిక్షణ ఉంటుందన్నారు.ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు రోజూ తరగతులు జరుగుతాయన్నారు. ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదని, ఆసక్తి కలిగిన గృహిణులు ఇనిస్టిట్యూట్‌కు వచ్చి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు వివరాలకు 80193 88999 నంబరులో సంప్రదించాలన్నారు.

డీసీటీఎంగా పద్మావతి బాధ్యతల స్వీకరణ

ద్వారకాబస్‌స్టేషన్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ విశాఖ రీజియన్ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ (డీసీటీఎం)గా కె.పద్మావతి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి డీసీటీఎం జి.సత్యనారాయణకు విజయనగరం జోన్ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ (ఆపరేషన్ అండ్ కమర్షియల్)గా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్టీసీ ప్రగతికి కృషిచేస్తానని, సిబ్బంది సమన్వయంతో పనిచేస్తానన్నారు.

బీచ్ వాలీబాల్ పతక విజేతలకు ప్రోత్సాహకం

విశాఖపట్నం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాఖండ్‌లో జరిగిన జాతీయ క్రీడల్లో పతకాలు సాధించిన క్రీడాకారులకు ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) నగదు ప్రోత్సాహక బహుమతులను విడుదల చేసింది. ఈఏడాది ఫిబ్రవరిలో జరిగిన జాతీయ క్రీడల్లో రాష్ట్రానికి పతకాలు అందించిన 15 మంది క్రీడాకారులకు రూ.91.75 లక్షలు విడుదల చేసింది. దీంతో జాతీయ పురుషుల బీచ్ వాలీబాల్ టోర్నీలో ఆంధ్రప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించి స్వర్ణ పతకం సాధించిన నగర క్రీడాకారులు మణికంఠరాజు, దివ్యసాయిలకు రూ. 15 లక్షలు విడుదలయ్యాయి. ఆ నగదు ప్రోత్సాహక చెక్‌ను రాష్ట్ర వాలీబాల్ సంఘం అధ్యక్షుడు, పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు సోమవారం తన కార్యాలయంలో అందజేసి అభినందించారు. గణబాబు మాట్లాడుతూ డెహ్రాడూన్‌లో జరిగిన టోర్నీలో అద్భుతంగా రాణించి వరుస సెట్లలో (25-23, 21-19) తమిళనాడును ఓడించి రాష్ట్రానికి స్వర్ణ పతకాన్ని అందించిన మణికంఠరాజు, దివ్యసాయిలకు చెరో రూ.7.50 లక్షల నగదు లభించడం గర్వకారణమని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వాలీబాల్ సంఘం కార్యదర్శి భగవాన్‌దాస్, మోహన్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుల అరెస్టు


పోలీసులు అరెస్ట్ చేసిన నిందితులు

మద్దిలపాలెం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): రామ్‌నగర్ జేఎస్ఎం కాలనీ కొండపైన జూన్ 22న ఓ యువకుడిపై హత్యాయత్నానికి పాల్పడిన ఐదుగురిని సోమవారం త్రీటౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ పైడయ్య తెలిపిన వివరాల ప్రకారం.. చెన్నా లోకేష్ (23) (భీమిలి), కర్రి భానుప్రసాద్ (23)(జోడుగుళ్లపాలెం), సోమదుల శివకుమార్ (22) (జేఎస్ఎం కాలనీ), కిల్లంపల్లి గోవిందరాజు(19) (ఓల్డ్ డెయిరీఫారం), రవీంద్రనగర్ చెందిన పదిహేడేళ్ల బాలుడు స్నేహితులు. జూన్ 22 రాత్రి శివాజీ పార్క్ రోడ్డులోని రాయల్ హోటల్లో జరుపుకుంటున్న కుందన్ పుట్టిన రోజు వేడుకలకు వీరు వెళ్లారు. లోకేష్‌కు అతని స్నేహితురాలు ఫోన్‌చేయడంతో అర్ధరాత్రి దాటాక ఒంటి గంట సమయంలో ఆమెను కలవడానికి లోకేష్, శివకుమార్‌లు వెళ్లారు. ఆమె తనను చేపలుప్పాడకు చెందిన రౌడీషీటర్ వాసుపల్లి రాము(20) వేధిస్తున్నట్టు వారికి చెప్పింది. తనను కూడా పుట్టిన రోజు వేడుకకు తీసుకెళ్లాలని కోరగా లోకేష్, శివకుమార్‌లు ఆమెను తీసుకుని రాయల్ హోటల్‌కు వచ్చారు. కాసేపటి తర్వాత ఆమె మళ్లీ రాము గురించి మాట్లాడుతూ అతను తనను బాగా వేధిస్తున్నాడని కన్నీరు పెట్టుకుంది. దీంతో నిందితులు ఐదుగురు రామును హత్య చేయాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా శివకుమార్ రాముకు ఫోన్ చేసి మద్యం ఉంది రామ్‌నగర్ జేఎస్ఎం కాలనీ వెనుక కొండ వద్దకు రావాలని చెప్పాడు. యువతిని హోటల్లో ఉండమని ఐదుగురూ ముందుగానే కొండ వద్దకు చేరుకున్నారు. అక్కడ వారు వేచిచూస్తుండగా రాము అతని స్నేహితుడు యశ్వంత్ బైక్‌పై వచ్చారు.లోకేష్ బీరు సీసా తీసుకుని రాము తలపై బలంగా కొట్టాడు. పక్కనే ఉన్న భానుప్రసాద్, శివకుమార్, గోవిందరాజు, బాలుడు కూడా కర్రలు, రాళ్లతో రాముపై దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన రాము పెద్దగా కేకలు వేయడంతో నిందితులు పరారయ్యారు. స్థానికుల సమాచారం మేరకు త్రీటౌన్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రుడ్ని ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ముగిసిన ఎస్ఐసీఏఎస్ఏ క్రీడా పోటీలు


పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

విశాఖపట్నం స్పోర్ట్సు, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్ర విశ్వవిద్యాలయం గోల్డెన్ జూబ్లీ గ్రౌండ్‌లో జరిగిన ఎస్ఐసీఏఎస్ఏ క్రీడా పోటీలు ఘనంగా ముగిశాయి. అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, క్రికెట్, ఖోఖో, త్రోబాల్ క్రీడాంశాలలో జరిగిన పోటీల్లో విద్యార్థులు ఉత్సా హంగా పాల్గొని ప్రతిభను ప్రదర్శించారు. ఆదివారం జరిగిన క్రికెట్ టోర్నీలో సీఏ చాలెంజర్స్ చాంపియన్ ట్రోఫీని కైవసం చేసుకోగా సూపర్ కింగ్స్ రన్నరప్‌గా నిలిచింది. ఖోఖో క్రీడాంశంలో శృతి జట్టు, త్రోబాల్‌లో మాధురి టీం, ఫుట్‌బాల్‌లో షాడో మోనార్చ్ విన్నర్స్ గా నిలిచాయి. అథ్లెటిక్స్ పురుషుల షాట్‌పుట్‌లో పుష్పక్, మహిళల విభాగంలో ప్రణీషాశ్రీ, పురుషుల 100 మీ.పరుగులో మహేంద్ర, మహిళల విభాగంలో వేద ప్రథమ స్థానాల్లో నిలిచారు. టగ్ ఆఫ్ వార్ పురుషుల విభాగంలో అమన్ టీం, మహిళల విభాగంలో విష్ణుప్రియ జట్టు చాంపియన్‌గా నిలిచాయి.

ప్రజా సేవతోనే ప్రభుత్వ ఉద్యోగులకు గుర్తింపు

సిరిపురం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : విధి నిర్వహణలో ప్రజలకు చేసిన సేవలే ఉద్యోగులకు ప్రత్యేక గుర్తింపును తీసుకువస్తాయని వీఎంఆర్‌డీఏ సంయుక్త కమిషనర్ కె. రమేష్ అన్నారు. వీఎంఆర్‌డీఏలో విధులు నిర్వహించి పదవీ విరమణ చేస్తున్న టి. సత్యనారాయణ, పి. శ్రీనివాసరావు, పి.తవిటయ్యచిన్నారావును కార్యాలయం సిబ్బంది సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ స్థాయిల్లో 40 ఏళ్లగా పని చేస్తూ అందరి మన్ననలను పొందారన్నారు. వారి సేవలను సహచర ఉద్యోగులు స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎస్టేట్ అధికారి దయానిధి, ఇంజనీర్ భవానీ శంకర్, డీఎఫ్ఓ సుజాతా శివానీ, ఇంజనీర్లు రాజు, సింగ్, రవిశంకర్, రాజశేఖర్, రమణ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న వైసీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు

వైసీపీని బలోపేతం చేయాలి : కేకే రాజు

మద్దిలపాలెం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.కె.రాజు సూచించారు. మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జిల్లా సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు పార్టీని వ్యవస్థీకృతంగా నిర్మించి సమష్టిగా ముందుకు సాగాలన్నారు. జూలై 5న వెంకోజీపాలెం సీఎంఆర్ ఫంక్షన్ హాల్లో నిర్వహించే 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ' కార్యక్రమం విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు వాసుపల్లి గణేష్ కుమార్, తైనాల విజయకుమార్, మొల్లి అప్పారావు, రవిరెడ్డి, కోలా గురువులు, జహీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల మధ్య వ్యర్థాలతో ఇబ్బందులు


నివాసాల చుట్టూ ఉన్న వ్యర్థాలు

వెంకోజీపాలెం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : రాత్రింబవళ్లు నిర్మానుష్యంగా కనిపించే 15వ వార్డులో వ్యర్థాల నిల్వలు స్థానికులకు చికాకు తెప్పిస్తున్నాయి. ఇసుకతోట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల సమీపంలో నివాసాల మధ్య వ్యర్థాల నిల్వలతో ఆందోళన చెందుతున్నారు. వ్యర్థాలు సేకరించుకుని వచ్చేవారు ఇక్కడే గంజాయి సేవించడం, చెత్త నిల్వలను రోడ్డుపైనే ఉంచడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని నివాసులు వాపోతున్నారు. ఇక్కడకు వచ్చే దుండగులు వీధి లైట్లను పగులగొట్టి అసాంఘిక కార్యకలాపాలను కొనసాగిస్తున్నారని ఆరోపిస్తున్నారు. పగలంతా విధుల్లోకి వెళ్లి శ్రమించి వస్తున్న తమకు రాత్రి పూట వ్యర్థ వస్తువుల నిల్వలు, వారు శబ్దాలు చేస్తూ ఇబ్బంది కలిగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై లేఖ ద్వారా స్థానిక నివాసులు జీవీఎంసీ జోన్-3 జోనల్ కమిషనర్ శివప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు.వ్యర్థ వస్తువుల నిల్వలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. రాత్రి పూట బయటకు రావటానికి భయాందోళన చెందుతున్నామని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

రిటైర్డ్ హెచ్‌ఎంకు సత్కారం


పదవీ విరమణ పొందిన ఉద్యోగులను సన్మానిస్తున్న కమిషనర్ రమేశ్

ఆరిలోవ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దే ఘనత ఉపాధ్యాయులకు దక్కుతుందని తోటగరువు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేసి సోమవారం ఉద్యోగ విరమణ చేసిన వి.విశ్వనాథం అన్నారు. ఆయనను సహోపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ వృత్తి తనకు ఎంతగానో సంతృప్తి ఇచ్చిందని అన్నారు.

6 నుంచి కనకదుర్గ అమ్మవారి జాతర



వెంకోజీపాలెం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : కనకదుర్గ అమ్మవారి జాతర వచ్చే నెల 6 నుంచి నిర్వహించనున్నట్టు సీతారామ సేవా మండలి అధ్యక్షుడు కోరిబిల్లి త్రినాథ్ శివ సత్యబాబు తెలిపారు. సోమవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. 6న చాటింపు, 7న తొల్లేళ్లు, 8న అమ్మవారి జాతర అనుపు ఉత్సవం జరపనున్నట్టు చెప్పారు. అనుపు ఉత్సవాన్ని పురస్కరించుకుని ఆ రోజు ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరుగుతాయని తెలిపారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పసుపు, కుంకుమ, చీర, జాకెట్, గాజులను సమర్పిస్తారని పేర్కొన్నారు. భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సాయంత్రం అమ్మవారి శతకం పట్టు నుంచి ఊరేగింపుగా తీసుకువస్తామని, ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు, పరస మహోత్సవం ఉంటుందన్నారు. 15న మారువారం పురస్కరించుకుని అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

ఉద్యోగ విరమణ చేసిన పోలీసులకు సీపీ సన్మానం


పదవీ విరమణ పొందిన పోలీసులతో సీపీ శంఖబ్రతబాగ్చి

విశాఖపట్నం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన పోలీసులను సీపీ శంఖబ్రతబాగ్చి సోమవారం సన్మానించారు. క్రైం ఏడీసీపీగా పనిచేస్తున్న ఎం.మోహనరావుతో పాటు ఇద్దరు ఎస్ఐలు, ముగ్గురు ఏఆర్ ఎస్ఐలు, ఏడుగురు ఏఎస్ఐలు, ఒక మహిళా ఏఎస్ఐ, ఒక హెచ్‌సీ, ఇద్దరు ఏఆర్ హెడ్‌కానిస్టేబుళ్లు, నలుగురు హోంగార్డులు ఉద్యోగ విరమణ చేయడంతో వారిని వారి కుటుంబ సభ్యుల సమక్షంలో సన్మానించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఉద్యోగ విరమణ తర్వాత ప్రణాళికబద్ధమైన జీవనం సాగించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో క్రైమ్ ఏడీసీపీ లతామాధురి, తదితరులు పాల్గొన్నారు.

కొండవాలు ప్రాంత విద్యార్థులకు కొండంత మేలు

▸ దశాబ్దాల కల నెరవేరిన వేళ.. ▸ రాంజీ ఎస్టేట్ ప్రాథమిక పాఠశాల అప్‌గ్రేడేషన్ ▸ ఈ ఏడాది నుంచే ఆరు, ఏడు తరగతుల్లో ప్రవేశాలు ▸ ఇప్పటికే చేరిన 61మంది విద్యార్థులు



వర్గోన్నతి పొందిన రాంజీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల



ఆరో తరగతి విద్యార్థులకు బోధన ప్రారంభం

కంచరపాలెం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఐదో తరగతి పూర్తికాగానే ఆరో తరగతిలో ప్రవేశాల కోసం జాతీయ రహదారిని దాటి కంచరపాలెం మెట్టు వద్దకు వెళ్లిన తమ చిన్నారులు రోజూ ఇంటికి వచ్చేవరకు తల్లిదండ్రులు ఆందోళన చెందేవారు. ఈ నేపథ్యంలో పలువురు విద్యార్థులు ఐదో తరగతితోనే చదువుకు స్వస్తిచెప్పి డ్రాపౌట్స్‌గా మిగిలేవారు. పాఠశాలకు వెళ్తూ రోడ్డు ప్రమాదాలకు గురై విద్యార్థులు ప్రాణాలు కోల్పోయిన పరిస్థితుల నేపథ్యంలో జీవీఎంసీ 46, 47, 48 వార్డుల పరిధి కొండవాలు ప్రాంతాల ప్రజలు రాంజీ ఎస్టేట్ ప్రాథమిక పాఠశాలను అప్‌గ్రేడ్ చేయాలని దశాబ్దాలుగా డిమాండ్ చేసేవారు. ఇటీవల ఉత్తర ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు ఈ సమస్యను జిల్లా కలెక్టరు దృష్టికి తీసుకెళ్లడంతో ఈ ఏడాది నుంచే అప్పర్ ప్రైమరీ పాఠశాలగా మార్చుతూ విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ నిర్ణయంపై స్థానికులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నెరవేరిన దీర్ఘకాలిక డిమాండ్

రాంజీ ఎస్టేట్ పాఠశాలను ఉన్నత పాఠశాలగా మార్చాలన్న దశాబ్దాల డిమాండ్ నెరవేరడంతో స్థానికులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమ పిల్లల చదువులు ఇక నిరాటంకంగా సాగుతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా పాఠశాలకు పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులను నియమించాలని కోరుతున్నారు. రెండు దశాబ్దాలుగా నెరవేరని డిమాండ్ ప్రస్తుతం కార్యరూపం దాల్చడంతో తల్లిదండ్రులు, విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదాల నుంచి విముక్తి...

గతంలో ఈ ప్రాంతాల విద్యార్థులు ఆరోతరగతిలో ప్రవేశం పొందాలంటే కంచరపాలెం మెట్టు వద్ద గల అర్బీపేట ఉన్నత పాఠశాలకు వెళ్లాల్సి వచ్చేది. ఈనేపథ్యంలో కంచరపాలెం జాతీయ రహదారిని దాటుకుని వెళ్తూ వాహన ప్రమాదాలకు గురై పలు సందర్భాల్లో కొందరు ప్రాణాలు కోల్పోయారు. ప్రస్తుతం రాంజీ ఎస్టేట్ పాఠశాలను యూపీ పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయడంతో ప్రమాదాల నుంచి విముక్తి లభించనుంది. రాంజీ ఎస్టేట్ పాఠశాల అనేక కొండవాలు గ్రామాలకు ఆధారం. దీన్ని ఉన్నత పాఠశాలగా మార్చితే కప్పరాడ, రాంజీ ఎస్టేట్, ఇందిరా నగర్, బాపూజీ నగర్ తదితర గ్రామాల విద్యార్థులకు ఉపయోగపడుతుంది. దూరప్రాంతాలకు వెళ్లాల్సిన ఇబ్బందులు తప్పుతాయని విద్యార్థులు చెబుతున్నారు.

ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజుకు ధన్యవాదాలు



రాంజీ ఎస్టేట్ పాఠశాలను స్థానికుల అవసరాల దృష్ట్యా అప్‌గ్రేడ్‌కు కృషిచేసిన ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజుకు కృతజ్ఞతలు. ఎంతో మంది ఎమ్మెల్యేలకు గతంలో వినతులు అందించినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. విష్ణుకుమార్ రాజు చొరవతో ఈ ప్రాంత విద్యార్థులకు యూపీ పాఠశాల అందుబాటులోకి వచ్చింది. ఈ నిర్ణయం విద్యార్థులు, తల్లిదండ్రులను ఆనందపరిచింది.

-జి.అరుణ్‌బాబు, స్థానిక నాయకుడు

549 మంది డిజిటల్ అసిస్టెంట్లకు బదిలీ

(5వ పేజీ తరువాయి)

సచివాలయాల్లో పనిచేస్తున్న గ్రేడ్-3 ఏఎన్ఎంల బదిలీలకు సంబంధించి సోమవారం కౌన్సె లింగ్ నిర్వహించారు. ఆరోగ్య శాఖ కార్యాలయంలో విశాఖ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం రాత్రి వరకూ ఈ కార్యక్రమం చేపట్టారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 1,300 మంది ఉండగా, తొలిరోజు 207 మందిని బదిలీ చేశారు. మిగిలిన వారికి బుధవారం నుంచి కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. మంగళవారం పెన్షన్లు పంపిణీ కార్యక్రమం ఉండడంతో కౌన్సెలింగ్ నిర్వహించరు. ఏఎన్ఎంలను సొంత మండలాల్లో కాకుండా పక్క మండలాలకు బదిలీ చేస్తున్నారు. అయితే సొంత మండలాల్లో కొనసాగించాలంటూ కొందరు ప్రజా ప్రతినిధుల నుంచి సిఫారసు లేఖలు తెచ్చారు. అయితే, ఆ లేఖలను పరిగణనలోకి తీసుకోకుండానే బదిలీలు ప్రక్రియను చేపట్టారు. డీపీఎంవో డాక్టర్ ఉమావతి, ఏవో విజయ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ విద్యాసాగర్‌లు బదిలీల ప్రక్రియ చేపట్టారు.

సారథులు మనోళ్లే

(5వ పేజీ తరువాయి)

పార్టీ అధ్యక్షులు సోము వీర్రాజును తప్పించి కొత్తవారికి బాధ్యతలు అప్పగించాలని అధిష్ఠానం యోచించినప్పుడే మాధవ్ పేరు పరిశీలనకు వచ్చింది. అయితే సీనియర్ నాయకురాలు దగ్గుబాటి పురందేశ్వరికి పెద్దలు అవకాశం కల్పించారు. ఇప్పుడు కొత్త అధ్యక్షులను ఎన్నుకునే సమయం రావడంతో ఆ పదవి కోసం చాలా మంది పోటీ పడ్డారు. అయితే అధిష్ఠానం మాత్రం బీజేపీ మూలాలు కలిగిన వారికే పట్టం కట్టాలని భావించి మాధవ్‌ను ఎంపిక చేసింది.

పెద్దాస్పత్రికి సుస్తీ

(5వ పేజీ తరువాయి)

కాదు. ఈ నేపథ్యంలోనే సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లనున్నట్టు సూపరింటెండెంట్ డాక్టర్ వాణి వెల్లడించారు. ప్రస్తుతానికి ఈ సమస్య నుంచి బయటపడే మార్గాల కోసం అన్వేషిస్తున్నట్టు వెల్లడించారు. ఒక ప్రైవేటు సంస్థ నుంచి అద్దెకు పరికరాన్ని తెచ్చే ఆలోచనలో ఉన్నట్టు వెల్లడించారు. గతంలో అద్దెకు తెచ్చిన పరికరానికి నెలకు రూ.60 వేలు చెల్లించామని, ఇప్పుడు అద్దెకు తీసుకురావాలని భావిస్తున్న సంస్థ రూ.లక్షన్నర అడుగుతుండడంతో ఆలోచనలో పడినట్టు వెల్లడించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు.

రింగ్ పోల్స్ ఏర్పాటుకు వినతి

కంచరపాలెం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 48వ వార్డు పరిధి కొండవాలు గ్రామాల్లో అవసరమైనచోట రింగ్‌పోల్స్, బోర్‌వెల్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ గంకల కవిత గ్రేటర్ కమిషనర్ కేతన్ గార్గ్‌కు విజ్ఞప్తి చేశారు. సోమవారం పీజీఆర్ఎస్ ద్వారా ఆయనకు వినతిపత్రాన్ని అందజేశారు. కొండవాలు గ్రామాల్లో ప్రధాన కూడళ్ల వద్ద రింగ్‌పోల్స్ లేక ప్రమాదాలు, దొంగతనాలు జరుగుతున్నాయన్నారు. ఆమెతో గంకల అప్పారావు కూడా ఉన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కవిత

పెన్షన్ సవరణ చట్టంపై నిరసన

▸ డీఆర్ఎం కార్యాలయాన్ని చుట్టుముట్టిన రైల్వే పెన్షనర్లు



డీఆర్ఎం కార్యాలయం బయట మానవహారంగా నిల్చున్న రైల్వే పెన్షనర్లు

విశాఖపట్నం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల హక్కును కాలరాస్తూ కేంద్ర ప్రభుత్వం బిల్లును సవరించడాన్ని నిరసిస్తూ రైల్వే పెన్షనర్లు సోమవారం ఉద్యమం చేపట్టారు. కేంద్ర బడ్జెట్‌లో పెన్షన్ సవరణ బిల్లును రూపొందించడమే కాకుండా రాష్ట్రపతి ఆమోద ముద్రతో చట్టంగా చేయడంపై పెన్షనర్లు ఆందోళన వ్యక్తం చేశారు. దీనిలో భాగంగా నేషనల్ కో-ఆర్డినేషన్ కమిటీ ఆఫ్ పెన్షనర్స్ అసోసియేషన్ (న్యూఢిల్లీ) పిలుపు మేరకు వాల్తేరు డివిజన్ రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్, రైల్వే పెన్షనర్స్ ఫెడరేషన్, రిటైర్డ్ రైల్వే ఎంప్లాయిస్ అసోసియేషన్, రిటైర్డ్ కో-వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్తంగా సోమవారం డీఆర్ఎం కార్యాలయం వద్ద మానవహారం నిర్వహించారు. సుమారు 900 మంది పెన్షనర్లు మానవహారంగా ఏర్పడి డీఆర్ఎం కార్యాలయాన్ని చుట్టుముట్టారు. పెన్షనర్ల సంఘాల ప్రతినిధులు వేగి నాగేశ్వరరావు, కొండలరావు, ఎంఆర్.రెడ్డి, కె.వి.నర్సింగరావు, వేదుల నర్సింగరావులు మాట్లాడుతూ పెన్షనర్లకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తూ చట్టం చేయడం అమానుషమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగ విరమణ తర్వాత కేవలం పింఛన్‌పై ఆధారపడే వారికి కేంద్రం తీవ్ర అన్యాయం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సవరణ బిల్లును వెనక్కి తీసుకునేంతవరకు దేశవ్యాప్తంగా ఉన్న రైల్వే పెన్షనర్లు ఉద్యమిస్తారని హెచ్చరించారు. అనంతరం డీఆర్ఎం లలిత్ బొహ్రాను కలిసి వినతిపత్రం సమర్పించారు. తమ అసంతృప్తిని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్ల సంఘాల నాయకులు ఎన్.వి.శేషాద్రి, జి.వి.రమణరావు, బి.వి.రమణ, కె.వి.రావు, జగ్గారావు, సన్యాసిరావు, భాస్కరరావు, పెద్ద సంఖ్యలో రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఏయూ దూర విద్యలో ఆన్‌లైన్ కోర్సులకు స్వస్తి?

(5వ పేజీ తరువాయి)

ప్రొఫెసర్లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ విధానంపై పునరాలోచన చేయాలంటూ అప్పటి ఉన్నతాధికారులను పలువురు సీనియర్ ప్రొఫెసర్లు కోరారు. ఒకరిద్దరు ప్రిన్సిపాల్స్ ఆన్‌లైన్‌లో నిర్వహించే కోర్సులతో విద్యార్థులకు సబ్జెక్ట్ రాదని, అవకతవకలకు అవకాశం ఉందంటూ లేఖలు కూడా రాశారు. అయినప్పటికీ అప్పటి అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. అయితే, తాజాగా వర్సిటీ ఉన్నతాధికారులు ఈ కోర్సుల నిర్వహణకు సంబంధించి పునఃపరిశీలించాలని దూర విద్యా కేంద్రం డైరెక్టర్‌కు ఏయూ వైస్ చాన్సలర్ జీపీ రాజశేఖర్ సూచించినట్టు చెబుతున్నారు. మొదట మల్టిపుల్ చాయిస్ విధానంలో ఆన్‌లైన్‌లో పరీక్షల నిర్వహణ, ఆ తరువాత ఆన్‌లైన్‌లో కోర్సులకు స్వస్తి చెప్పనున్నట్టు తెలుస్తోంది. ఇదిలావుంటే ఈ కోర్సులను ఏయూ దూర విద్య, మరో రెండు ప్రైవేటు సంస్థలు సంయుక్తంగా నిర్వహించడం గమనార్హం. ప్రవేశాల నుంచి పరీక్షలు నిర్వహణ వరకు అన్నీ ఆ రెండు సంస్థలే చూసుకుంటాయి.

మార్పులపై ఫోకస్

దూర విద్యా కేంద్రం ద్వారా నిర్వహిస్తున్న కోర్సులకు సంబంధించి పరీక్షా కేంద్రాల పెంపు, నిర్వహణలో అవకతవకలు వంటి వాటిపైనా వర్సిటీ ఉన్నతాధికారులు దృష్టిసారించారు. దూరవిద్యను పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేయాలని నూతనంగా నియమితులైన డైరెక్టర్‌కు వీసీ సూచించినట్టు తెలిసింది. ఏళ్ల తరబడి కొనసాగుతున్న ఉద్యోగుల జాబితాను సిద్ధం చేసి, ఆరోపణలకు కేంద్ర బిందువులుగా ఉన్న వారిని మార్చే ప్రక్రియ చేపట్టనున్నట్టు చెబుతున్నారు.

'ఆర్టీఈ అడ్మిషన్ల లోటుపాట్లపై విద్యాశాఖ దృష్టి సారించాలి'

సీతమ్మధార, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని అమలు చేస్తున్న ఉచిత నిర్బంధ విద్యా హక్కు చట్టం (ఆర్టీఈ) అడ్మిషన్ల లోటుపాట్లపై ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరుతూ రాష్ట్ర సమగ్ర శిక్ష ఉన్నతాధికారులకు లేఖ రాసినట్టు సీతమ్మధార ప్రాంతానికి చెందిన చైల్డ్ రైట్స్ అవేర్నెస్ ఫోరం అధ్యక్షురాలు గొండు ధనలక్ష్మి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అనేక ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలలు, వివిధ యాజమాన్య పాఠశాలల్లో విద్యా హక్కు చట్టాన్ని అనుసరించి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా మొదటి రౌండ్‌లో అధిక శాతం పాఠశాలల యాజమాన్యాలు ప్రవేశాలు నిరాకరిస్తున్న విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వానికి నివేదించామన్నారు. ఆర్టీఈ చట్టాన్ని పరిరక్షిస్తూ, భవిష్యత్‌లో న్యాయపరమైన ఇబ్బందులు రాకుండా బాలల హక్కులను కాపాడాలని కోరుతున్నామని ధనలక్ష్మి పేర్కొన్నారు.

ఏపీపీజీ సెట్‌లో విద్యార్థుల ప్రతిభ



ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థినులతో బుల్లయ్య కళాశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు

సీతమ్మధార, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల యూజీ విభాగానికి చెందిన విద్యార్థులు ఆంధ్రప్రదేశ్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ కామన్ ఎంట్రన్స్ పరీక్ష (ఏపీపీజీ సెట్-2025)లో ఉత్తమ ర్యాంకులు సాధించారు. రసాయన శాస్త్ర విభాగంలో ఎంఎస్‌వీ యశస్విని, మానసిక శాస్త్ర విభాగంలో డి.మేఘనా లక్ష్మికి ప్రథమ ర్యాంకులు వచ్చాయి. పి.బెన్నీపాల్ 4వ ర్యాంకు, ముస్కాన్ 16వ ర్యాంకు సాధించారు. రాజనీతి శాస్త్రంలో కె.కుసుమ 16వ ర్యాంకు, అర్థశాస్త్రంలో అశ్వినికి 9వ ర్యాంకు వచ్చాయి. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల మేనేజ్‌మెంట్ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ జి.మధుకుమార్, ప్రిన్సిపాల్ చక్రవర్తి, వైస్ ప్రిన్సిపాల్ సురేఖ, అధ్యాపక సిబ్బంది అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఉపాధ్యాయినికి ఉద్యోగ విరమణ సన్మానం

అక్కయ్యపాలెం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఎన్‌జీజీఓస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాల సహాయకురాలు, సోషల్ స్టడీస్ జిల్లా ఉత్త ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఆకెళ్ల రమణశ్రీని సోమవారం ఘనంగా సన్మానించారు. ఆమె గత 41 ఏళ్లుగా పనిచేసి పాఠశాల సహాయకురాలిగా పదోన్నతి పొంది ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయిని జయంతి రాధాకుమారి ఆధ్వర్యంలో ఎంఈవోలు రామారావు, బాలామణి, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ ప్రతినిధులు, ఉపాధ్యాయులు రమణశ్రీని ఘనంగా సత్కరించారు.

రెండు నెలల్లో 5,000 రూఫ్ టాప్ సోలార్ ప్లాంట్లు

(5వ పేజీ తరువాయి)

తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ, డిస్కమ్ పరిధిలో 2024 నుంచి 2025 ఏప్రిల్ వరకూ పది వేల రూఫ్ టాప్ సోలార్ ప్లాంట్లు ఏర్పాటుచేయగా, ఆ తరువాత రెండు నెలల్లో మరో 5 వేలు...మొత్తం 15 వేలు పూర్తి చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో పది వేల సోలార్ ప్లాంట్లు పెట్టాలని లక్ష్యం ఇవ్వడంతో 'వర్చువల్ నెట్ మీటరింగ్'కు కూడా అనుమతిస్తామని చెప్పారు. సాధారణంగా ఈ పథకం కింద సొంత ఇంటి పైకప్పుపై సోలార్ ప్లాంటు ఏర్పాటు చేసుకోవాలని, అయితే అపార్టుమెంట్లలో ఉంటున్నవారు సొంతంగా వీటిని పెట్టుకోవాలని ఆసక్తి చూపుతున్నా మిగిలిన ఫ్లాట్ల వారి నుంచి అభ్యంతరాల వల్ల సాధ్యం కావడం లేదని తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇలాంటి వారికి అదే డివిజన్ పరిధిలో ఎక్కడైనా మరో సొంత ఇల్లు ఉంటే...అక్కడ రూఫ్‌టాప్ సోలార్ ప్లాంటు ఏర్పాటు చేసుకుంటే అక్కడ ఉత్పత్తి చేసిన విద్యుత్‌ను గ్రిడ్‌కు పంపించి, అంతే మొత్తం యూనిట్లను అపార్టుమెంట్ ఫ్లాటులో ఉపయోగించుకునే అవకాశం కల్పిస్తామని చెప్పారు. దీనినే 'వర్చువల్ నెట్ మీటరింగ్' అంటామన్నారు. రూఫ్ టాప్ సోలార్ ప్లాంటుకు ఒక్కసారి పెట్టుబడి పెడితే ఇరవై ఏళ్ల వరకు దానిని ఉపయోగించుకోవచ్చునని, దానివల్ల విద్యుత్ బిల్లు గణనీయంగా తగ్గుతుందన్నారు.

రాయితీగా రూ.115 కోట్లు

ఇప్పటివరకూ 15,120 సోలార్ ప్లాంట్ల ద్వారా 50,002 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన విద్యుత్‌ను ఉత్పత్తి చేసి గ్రిడ్‌కు అనుసంధానం చేయడం వల్ల ఆ వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం నుంచి రాయితీగా రూ.115 కోట్లు వచ్చిందని సీఎండీ పృథ్వీతేజ్ తెలిపారు. విశాఖపట్నంలో జిల్లాలో 2,056 మందికి, శ్రీకాకుళం జిల్లాలో 1,650 మందికి, పార్వతీపురం మన్యం జిల్లాలో 289 మందికి, విజయనగరం జిల్లాలో 1,549 మందికి, అనకాపల్లి జిల్లాలో 1,239 మందికి, అల్లూరి మన్యం జిల్లాలో తొమ్మిది మందికి ఈ రాయితీ వచ్చిందన్నారు. కిలోవాట్ సామర్థ్యం కలిగిన ప్లాంటు ఏర్పాటు చేసుకోవాలంటే కనీసం పైకప్పుపై 100 చ.అ. విస్తీర్ణం కలిగిన స్థలం ఉండాలన్నారు. ఒక కిలోవాట్‌కు రూ.30 వేలు, రెండు కిలోవాట్లకు రూ.60 వేలు, మూడు కిలోవాట్లకు రూ.78 వేలు రాయితీ వస్తుందన్నారు. మూడు కిలోవాట్లు ప్లాంట్లు ఏర్పాటు చేసుకుంటే నెలకు 360 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందని, ఇంటి అవసరాలకు వాడుకోగా మిగిలిన విద్యుత్ సంస్థకు విక్రయించడం వల్ల అదనపు ఆదాయం కూడా వస్తుందన్నారు. ఈ అవకాశాన్ని సోలార్ విద్యుత్ కావాలనే వారు ఉపయోగించుకోవాలని కోరారు.

మానసిక ఇబ్బందుల నుంచి మామూలు మనిషిగా..



చికిత్సకు ముందు.. తరువాత ప్రదీప్

డాబాగార్డెన్స్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి మానసిక పరిస్థితి బాగా లేకపోవడంతో చాలా రోజులుగా విశాఖపట్నం పోర్టు ఏరియా, డాబాగార్డెన్స్, ఎల్ఐసీ బిల్డింగ్ తదితర ప్రాంతాల్లో తిరుగుతూ ఉండేవాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో బుచ్చిరాజుపాలెం షెల్టర్ మేనేజర్ ఎల్లేటి మమత స్పందించారు. ఆరు నెలల కిందట మానసిక చికిత్స ఇప్పించేందుకు ఆస్పత్రిలో జాయిన్ చేయించారు. ఇప్పుడు అతను కోలుకోవడంతో ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేయించి బుచ్చిరాజుపాలెం జీవీఎంసీ నిరాశ్రయ వసతిగృహానికి తీసుకొచ్చి ఆశ్రయం కల్పించారు. ఇతడి పేరు ప్రదీప్ అని ఇంకా మిగిలిన వివరాలను సేకరించి త్వరలోనే అతని కుటుంబ సభ్యులకు అప్పగించే ప్రయత్నం చేస్తామని మమత తెలిపారు.

'డాక్టర్ రావిప్రోలు జ్ఞాపకాలు మరువలేనివి'



డాక్టర్ రావిప్రోలు సుబ్రహ్మణ్యం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గాంధీ సెంటర్ ప్రతినిధులు

సీతంపేట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ గాంధేయవాది డాక్టర్ రావిప్రోలు సుబ్రహ్మణ్యం జ్ఞాపకాలు మరువలేనివని వక్తలు శ్లాఘించారు. బుల్లయ్య కళాశాల్లోని గాంధీ సెంటర్ హాలులో సహృదయ సాహితి విశాఖపట్నం, గాంధీ సెంటర్ సంయుక్తంగా ప్రముఖ గాంధేయవాది రావిప్రోలు సుబ్రహ్మణ్యం సంస్మరణ సభను సోమవారం నిర్వహించారు. ఆయన చిత్రపటం వద్ద వక్తలు నివాళులర్పించారు. సుబ్రహ్మణ్యంతో తమ జ్ఞాపకాలను గుర్తు తెచ్చుకున్నారు. ఆయన వ్యక్తిత్వం, ప్రవర్తన, ఆశయాలు, సేవా దృక్పథాన్ని స్మరించుకున్నారు. ఆయన లేని లోటు తీర్చలేనిదని అభిప్రాయపడ్డారు. సుబ్రహ్మణ్యం ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ సభలో నాగార్జున యూనివర్సిటీ పూర్వ ఉపకులపతి ఆచార్య బాల మోహన్ దాస్, శేఖరమంత్రి ప్రభాకర్, ద్విభాష్యం రాజేశ్వరరావు, మేడా మస్తాన్‌రెడ్డి, నరవ ప్రకాశరావు, ఘంగికోట విశ్వనాథం, డాక్టర్ కె.వి.ఎస్.మూర్తి, జె.పి. శర్మ, సిహెచ్ చిన సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఐదుగురి గుప్పిట్లో నైట్ ఫుడ్‌కోర్టు

(5వ పేజీ తరువాయి)

నైట్‌ఫుడ్‌కోర్టును ప్రారంభించాయి. జీవీఎంసీ యూసీడీ ద్వారా ఎంపిక చేసిన 32 మంది ఫుడ్‌కోర్టులో స్టాళ్లు ఏర్పాటుచేసుకున్నారు. కరోనా సమయంలో ఫుడ్‌కోర్టును మూసివేశారు. ఆ తర్వాత జీవీఎంసీ ఫుడ్‌కోర్టుకు అనుమతించలేదు. ఈ నేపథ్యంలో అక్కడ వ్యాపారాలు సాగించిన ఐదుగురు...అప్పటి వైసీపీ నేతలను ప్రసన్నం చేసుకుని 170 దుకాణాలను ఏర్పాటు చేశారు. పదేసి చొప్పున దుకాణాలను తమ చేతిలో ఉంచుకుని అద్దెకు ఇచ్చుకున్నారు. మిగిలిన వాటిని ఆసక్తి కలిగిన వ్యాపారులకు 36 చదరపు గజాలు స్థలం చొప్పున మార్కింగ్ చేసి రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలకు అమ్ముకున్నారు. ఫుడ్‌కోర్టు కారణంగా పారిశుధ్య సమస్య తలెత్తుతుండడం, అదేవిధంగా జీవీఎంసీకి ఒక్క రూపాయి ఆదాయం కూడా రాకపోవడంతో దానిని ఎత్తివేయాలంటూ టీడీపీ, జనసేన కార్పొరేటర్లు కౌన్సిల్ సమావేశంలో డిమాండ్ చేశారు. దీంతో ఏడాది కిందట కౌన్సిల్ సమావేశంలో ఫుడ్‌కోర్టును తొలగించాలని తీర్మానం చేశారు.

అయినప్పటికీ జీవీఎంసీ అధికారులు ఫుడ్‌కోర్టును తొలగించే ప్రయత్నం చేయలేదు. దీనిపై జనసేన కార్పొరేటర్ మూర్తియాదవ్ ఇటీవల హైకోర్టులో పిల్ దాఖలు చేయడంతో జూన్ 16లోగా కౌంటర్ దాఖలు చేయాలని జీవీఎంసీ అధికారులను ఆదేశించింది. ఇటీవల ఫుడ్‌కోర్టులో ఒక యువకుడు ఐస్‌క్రీమ్ దుకాణం ఏర్పాటు చేయాలనుకున్నాడు. అందుకోసం ఆ ఐదుగురిలో ఒకరిని సంప్రతించాడు. దుకాణాలు ఖాళీ లేవని చెబుతూ, 18 చదరపు అగురులు స్థలం కలిగినవి ఉన్నాయని, వారంతా రూ.12 వేలు అద్దె ఇస్తున్నందున, రూ.15 వేలు అద్దె ఇవ్వడానికి సిద్ధపడితే ఒకరిని ఖాళీ చేయించి ఆ స్థలం ఇస్తానని ప్రతిపాదించాడు. దీనికి యువకుడు సరేననడంతో రెండు నెలలు అద్దెను అడ్వాన్స్‌గా తీసుకున్నాడు. యువకుడు దుకాణం ఏర్పాటుకు స్టాల్‌ను తయారుచేయించుకుని ఫుడ్‌కోర్టు సమీపంలో ఉంచాడు. గుజరాత్ నుంచి రూ.3.5 లక్షలు వెచ్చించి యంత్రాలను కొనుగోలు చేశాడు. వచ్చే నెల నాలుగున దుకాణం ప్రారంభించాలనుకుంటున్నట్టు స్థలం అద్దెకు ఇచ్చిన వ్యక్తికి చెప్పాడు. అయితే ఆ స్థలాన్ని తాను ఇవ్వడం లేదని, అడ్వాన్స్‌ను వెనక్కి ఇచ్చేస్తున్నానంటూ ఫోన్‌పే ద్వారా యువకుడికి తిరిగి చెల్లించాడు. దీంతో కంగుతిన్న యువకుడు తాను రూ.3.5 లక్షలు పెట్టి యంత్రాలు కొనుగోలు చేయడంతోపాటు స్టాల్‌ను తయారుచేయించుకున్నానని, ఇప్పుడు కాదంటే తన పరిస్థితి ఏమిటని ప్రశ్నించాడు. తాను దుకాణం పెట్టి తీరతానని చెప్పడంతో 'నా పొలిటికల్ బ్యాక్‌గ్రౌండ్ తెలిస్తే తట్టుకుని బతకలేవు. ఎమ్మెల్యేలు నాకు అండగా ఉన్నారని' బెదిరించాడు. ఇదే తరహాలో ఐదుగురిలో మరొకరు...అధిక అద్దె ఆశపడి...ఇప్పటికే ఉన్న దుకాణాన్ని తొలగించాడు. ఫుడ్‌కోర్టులో దళారీల ఆగడాలను అరికట్టడంతోపాటు తమకు దుకాణం పెట్టుకుని ఉపాధి పొందేలే స్థలం ఇప్పించాలని కోరేందుకు బాధితులు ఇద్దరూ సోమవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వెళ్లారు. ఈ విషయం అడ్వాన్స్ వెనక్కి ఇచ్చిన వ్యక్తికి తెలియడంతో... ఒకరు బాధిత యువకుడికి ఫోన్ చేసి 'అనవసరంగా నన్ను రెచ్చగొడుతున్నావ్...తర్వాత ఏం జరిగినా నాకు సంబంధం ఉండదని' బెదిరించాడు. దీంతో వారిద్దరూ తమకు ఎక్కడైనా దుకాణం పెట్టుకునేందుకు స్థలం ఇప్పించి ఉపాధి కల్పించాలని కోరుతూ కమిషనర్‌కు వినతిపత్రం అందజేసి వెనుతిరిగారు. ఇంత జరుగుతున్నా ఉన్నతాధికారులు అనధికార ఫుడ్‌కోర్టు విషయంలో ఎందుకు జోక్యంచేసుకోవడం లేదనేది అర్థం కావడం లేదని కార్పొరేటర్లు, ఇతర అధికారులు అంటున్నారు.

మురళీనగర్‌లో వీధి శునకాలతో బెంబేలు!



మురళీనగర్ రోడ్లలో ఇదే తంతు

మురళీనగర్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): నగరంలో పేరొందిన నివాసిత ప్రాంతంగా ఉన్న మురళీనగర్, మాధవధార ప్రాంతాల్లో శునకాల బెడద రోజురోజుకీ ఎక్కువవుతోంది. రాత్రయితే పాదచారులు, వాహనదారులు గమ్య స్థానాల్ని చేరేందుకు ఇబ్బందులు పడుతున్నారు. కొండ చివర ప్రాంతాలుగా ఉండే మురళీనగర్ ఎన్‌జీజీఓస్ కాలనీ, మాధవధార ఉడాకాలనీ తదితర ప్రాంతాలు సహా 48ఏ బస్సులు తిరిగే ప్రధాన మార్గాల్లో వెంటపడుతున్న వీధి కుక్కలతో బాటసారులు ఇబ్బంది పడుతున్నారు. రోజూ తిరిగే ప్రాంతాల్లోనే శునకాలు దాడికి దిగుతున్నాయని వాపోతున్న స్థానికులు జీవీఎంసీ వెటర్నరీ విభాగం అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. రాత్రివేళ ఇళ్లల్లోకి చొరబడుతున్న కుక్కలు దుస్తులు, బయట ఉండే వస్తువులు, పాదరక్షలు వంటి వాటిని చిందరవందర చేస్తున్నాయని గగ్గోలుపెడుతున్నారు.

మెడికల్ హైపవర్ కమిటీ సభ్యునిగా రఘు



రఘును సత్కరిస్తున్న కూటమి నాయకులు

మురళీనగర్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ రాష్ట్ర వైద్య విభాగం చైర్మన్, ఉత్తర నియోజకవర్గ నాయకుడు బి.రఘును రాష్ట్ర మెడికల్ హైపవర్ కమిటీ సభ్యునిగా ప్రభుత్వం నియమించింది. ప్రైవేటు హాస్పిటల్స్ నిర్వాహకునిగా ఉంటూ రఘు రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్నారు. జనసేన పార్టీ కార్యక్రమాల్లో నిమగ్నమై ఉన్నారు. ఉత్తర నియోజకవర్గ కూటమి నాయకులు ఎం.వి.రమణ, ఎస్.వరప్రసాద్, నరసింహ, వెంకటరమణ తదితరులు సోమవారం ఆయనను ఆత్మీయంగా సత్కరించారు.

రైతుబజార్‌లో దుకాణాల ఎత్తు పెంపు



రైతులు, కొనుగోలుదారులకు ప్రస్తుతం సౌకర్యంగా ఉన్న కంచరపాలెం రైతుబజార్

కంచరపాలెం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): నిత్యం రద్దీగా ఉండే కంచరపాలెం రైతుబజార్‌లో రైతులకు సరిపడా దుకాణాలు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తేవి. గతంలో 116 దుకాణాలు ఉండగా వీటికి అదనంగా ఇటీవల కొత్త దుకాణాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం 130 దుకాణాలు రైతులకు అందుబాటులో ఉన్నాయి. దుకాణాల ఎత్తు పెంచడంతో రైతులు, కొనుగోలుదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఏ ఒక్క రైతు నేలపై తమ ఉత్పత్తులు ఉంచి వ్యాపారం చేయకూడదనే లక్ష్యంతో మార్కెటింగ్ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ఇప్పుడు సౌకర్యంగా ఉండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆరు నూతన ప్లాట్‌ఫారమ్స్ కూడా అందుబాటులోకి తీసుకువచ్చినట్టు ఎస్టేట్ అధికారి జగదీష్ పేర్కొన్నారు.

సోదరికి అమూల్య అప్పగింత

అక్కయ్యపాలెం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని నిరాశ్రయుల వసతిగృహంలో ఆశ్రయం పొందుతున్న పాడేరుకు చెందిన గోడితల అమూల్య (20)ను ఆమె సోదరి కొండ స్వరూపకు అప్పగించినట్టు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. జూన్ 28న నాల్గో పట్టణ పోలీస్ స్టేషన్ పోలీసులు రాత్రి సమయంలో గస్తీ తిరుగుతున్నప్పుడు అమూల్యను గుర్తించి నిరాశ్రయుల వసతి గృహానికి అప్పగించారన్నారు. పోలీస్ విచారణలో తాను ఒక అనాథ అని చెప్పిందని, కానీ ఇంటిలో చెప్పకుండా పారిపోయి వచ్చిందన్నారు. సోమవారం తన సోదరి కొండ స్వరూపను రప్పించి కౌన్సెలింగ్ ఇచ్చి ఏయూటీడీ కేర్‌టేకర్ నారాయణరావు సమక్షంలో అప్పగించినట్టు పేర్కొన్నారు.

నేత్రపర్వంగా అప్పన్న కల్యాణం

సింహాచలం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): వరాహలక్ష్మీనృసింహస్వామి ఆర్జిత నిత్య కల్యాణం సోమవారం నేత్రపర్వంగా జరిగింది. సుప్రభాతసేవతో స్వామిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామి, ఉభయ దేవేరులను శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. అనంతరం శాస్త్ర విధానంలో కల్యాణ క్రతువు జరిపారు.

70వ వార్డులో తాగునీటి కష్టాలు

» శ్రీనివాసనగర్‌లో పైప్‌లైన్ నుంచి రోజంతా వృథాగా పోతున్న నీరు

» శివారు ప్రాంతాలకు తప్పని ఇక్కట్లు

ఆటోనగర్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 70వ వార్డు శ్రీనివాసనగర్‌లో పైపు నుంచి రేయంబవళ్లు పెద్ద ధారగా నీరు వృథాగా పోతూ కాలువల్లో కలుస్తోంది. దీంతో ఎల్‌వీ నగర్, టీవీఎస్ కాలనీ, ఎర్రగెడ్డ కాలనీ వాసులకు తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. కొళాయిల నుంచి నీటిధార సన్నగా వస్తోందని, దీంతో అవసరాలకు తగిన నీరు లభ్యం కావడం లేదని వాపోతున్నారు. తరచూ తాగునీటి పైపులు లీకవుతుండడంతో సమస్య తలెత్తుతోందన్నారు. జీవీఎంసీ తాగునీటి పంపిణీ సిబ్బంది పర్యవేక్షణ సక్రమంగా లేకపోవడంతో సరఫరాలో అవాంతరాలు ఏర్పడుతున్నాయని కాలనీ వాసులు ఆరోపిస్తున్నారు. కొళాయిల నుంచి నీటి ధార తక్కువగా ఉండడంతో బిందెడు నీళ్ల



శ్రీనివాసనగర్‌లో పైపు నుంచి లీకవుతున్న నీరు

కోసం కాళ్లు పీకేవరకు గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోందంటున్నారు. జీవీఎంసీ కొళాయి నీటిపైనే ఆధారపడుతున్న ఈ ప్రాంత వాసులు, కూలి పనులకు కూడా వెళ్లకుండా కొళాయిల వద్ద పడిగాపులు పడాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిసితి సుమారు ఏడాదిగా వేధిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. తాగునీటి సిబ్బందికి సమస్యను వివ



ఎల్‌వీనగర్‌లో సన్నని ధారగా వస్తున్న కొళాయి నీరు

రించినా తాత్కాలికంగా పనులు చేసి చేతులు దులుపుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పైప్‌లైన్లను పూర్తిస్థాయిలో పరిశీలించి లీకులను అరికట్టి, శివారు ప్రాంతానికి మెరుగైన సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులను కోరుతున్నారు. పంపిణీలో ఎదురవుతున్న అడ్డంకులను తొలగించేలా చూడాలని కోరుతున్నారు.

'ఉక్కు కాంట్రాక్టు కార్మికుల తొలగింపు చట్ట విరుద్ధం'

కూర్మన్నపాలెం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఉక్కు కాంట్రాక్టు కార్మికుల తొలగింపులు చట్ట విరుద్ధమని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుడు కేఎం శ్రీనివాస్ అన్నారు. కూర్మన్నపాలెంలో రిలే నిరాహార దీక్షలు సోమవారంతో 1600వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉక్కు నిర్వాసితులకు మిగిలిన భూమి ఇవ్వాలన్నారు. కాంట్రాక్టు కార్మికుల తొలగింపు ప్రక్రియ తక్షణమే నిలిపివేయాలని, నిర్వాసితులకు శాశ్వత ఉపాధి కల్పించాలని, ప్లాంటును సెయిల్‌లో విలీనం చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు, కార్మికులకు పూర్తిస్థాయి వేతనాలు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు పాల్గొన్నారు.



రిలే నిరాహార దీక్షల శిబిరంలో కార్మికులు

ఏపీ పీజీఈసెట్ ర్యాంకర్‌కు ఎమ్మెల్యే అభినందన



సునీల్‌ను అభినందిస్తున్న పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

పెందుర్తి, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఏపీ పీజీఈసెట్‌లో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ (సీఎస్ఈ) విభాగంలో రాష్ట్రస్థాయి ప్రథమ ర్యాంకు సాధించిన ఎస్ఆర్‌పురం గ్రామానికి చెందిన బాలిబాని సునీల్‌ని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు అభినందించారు. క్యాంపు కార్యాలయంలో సోమవారం తన సునీల్‌కు రూ.10వేల ప్రోత్సాహక నగదు అందజేశారు. ఈ సందర్భంగా సునీల్‌ను శాలువా కప్పి అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో సునీల్ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దూది విజయలక్ష్మి, జనసేన శ్రేణులు పాల్గొన్నారు.

ప్రభుత్వం చేసిన మంచిని ప్రజలకు వివరించండి

» నేతలు, కార్యకర్తలకు పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు సూచన



పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు

గోపాలపట్నం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు తెలియజేసే 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు పిలుపునిచ్చారు. గోపాలపట్నంలోని టీడీపీ పశ్చిమ నియోజకవర్గ కేంద్ర కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిందన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు తెలియజేయాలని పిలుపునిచ్చారు. అప్పుల ఊబిలో కూరుకుపోయిన రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాజకీయ అనుభవంతో అభివృద్ధి పథంలో నడుపుతున్నారని అన్నారు. వైసీపీ హయాంలో జరిగిన అరాచకాలను భరించలేక ప్రజలు కూటమిని అత్యధిక మెజారిటీతో గెలిపించారన్నారు. ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని కూటమి ఒమ్ముచేయదని, సుపరిపాలనపై ప్రజలకు వివరించాలని కోరారు.ప్రతిపక్షం చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు రంగనాయులు, పలువురు కార్పొరేటర్లు, నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన పారాయణ సమితి వార్షికోత్సవాలు

అగనంపూడి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): అగనంపూడి, పరిసర గ్రామాల్లో ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు చేస్తున్న బొర్రమాంబ పారాయణ సేవా సమితి ద్వితీయ వార్షికోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా పరిసర గ్రామాల్లో పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. సంస్థ ఆర్గనైజర్ చిత్రా రామారావు మాట్లాడుతూ ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలే లక్ష్యంగా పారాయణ సమితి పనిచేస్తోందని మూడు రోజులు జరిగిన కార్యక్రమాలు విజయవంతం చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పారాయణ సమితి సభ్యులు పాల్గొన్నారు

ప్రమాదాలకు నిలయంగా మారుతున్న మలుపులు

» కనిపించని హెచ్చరిక బోర్డులు

» స్పీడ్‌బ్రేకర్లు వేయాలంటున్న స్థానికులు

ఆటోనగర్,జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఈ చిత్రంలో



ఐలా వద్ద ప్రమాదకర మలుపు

కనిపిస్తున్న మలుపులో ప్రయణిస్తే ఏపీఐఐసీ ఐలా కార్యాలయాన్ని త్వరితంగా చేరుకోవచ్చు. నేరుగా ప్రయాణిస్తే తుంగ్లాం, ఆటోనగర్ ఎఫ్‌బ్లాక్, ఫకీర్ తక్యా, యాదవ జగ్గరాజుపేట, దువ్వాడ రైల్వే స్టేషన్ తదితర ప్రాంతాలకు దగ్గర దారి. ఆదమరచి ప్రయాణిస్తే నేరుగా అనంత లోకాలకు చేరుకోవచ్చు. అదృష్టాన్ని బట్టి ప్రమాద తీవ్రతలో మార్పులుంటాయి గానీ నిత్యం ఇటువైపుగా ప్రయాణించే ఏపీఐఐసీ, ఐలా అధికారులకు, ఇతర సిబ్బంది ఆలోచనలో మాత్రం మార్పు రావడం లేదు. రోడ్డు ప్రమాదాలు వెలుగులోకి రాకపోవడంతో ప్రమాదకర మలుపులో ఉన్న తికమకను ఐలా అధికారులు గుర్తించలేకపోతున్నారు. ఈ కూడలిలో వాహనదారులు సక్రమంగా వస్తున్నప్పటికీ, ఎదురుగా వచ్చే వాహనం ఎటుపోతుందనే అయోమయంలో సతమతమవుతూ ప్రమాదాలబారిన పడుతున్నారు. ఈ



మలుపు వద్ద కనిపించని హెచ్చరిక బోర్డులు

కూడలిలో మార్పులు తీసుకుని వచ్చి ఏపీఐఐసీ, ఐలా నుంచి జాతీయ రహదారిని చేరుకునే మార్గంలో హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

నిబద్ధతతో పనిచేస్తేనే గుర్తింపు

పెదగంట్యాడ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): నిబద్ధతతో విధులు నిర్వహించే వారు ఆదర్శంగా నిలుస్తారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. స్టీల్‌ప్లాంట్‌లో పని చేసి సోమవారం ఉద్యోగ విరమణ చేసిన విశాఖపార్లమెంట్ టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి పెద్దాడ సోమునాయుడు, దంపతులను పల్లా శ్రీనివాసరావు సత్కరించారు. పెదగంట్యాడ మండల టీడీపీ నేతల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఉక్కు ఉద్యోగిగా పనిచేస్తూనే కార్మిక నేతగా, టీడీపీకి సేవలందించారన్నారు. 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి అధ్యక్షత వహించారు. పులి వెంకటరమణారెడ్డి, ప్రసాదుల శ్రీనివాస్, ములకలపల్లి పెంటయ్య, శ్రీముసురు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



సోమునాయుడును సత్కరిస్తున్న ఎమ్మెల్యే పల్లా

డంపింగ్ యార్డు తరలించాలని వినతి

గాజువాక, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 76వ వార్డులో డంపింగ్ యార్డు తరలించాలని, గంగవరం పోర్టు కాలుష్యం నివారించాలని కోరుతూ 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జేఏసీ ప్రతినిధులు సోమవారం జీవీఎంసీ కమిషనర్, మేయర్, డిప్యూటీ మేయర్‌కు వినతిపత్రం అందజేశారు. డంపింగ్ యార్డ్‌తో 16 ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అనారోగ్య సమస్యలకు గురవుతున్నారని, తరలించాలంటూ ఐదేళ్లుగా పోరాటాలు చేస్తున్నామని వివరించారు. గంగవరం పోర్టుకు వచ్చే భారీ లారీలతో విపరీతమైన కాలుష్యం వెలువడుతోందని తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో రంభా నారాయణమూర్తి, రాంబాబు, సత్యనారాయణ, గోవిందరావు, అశోక్, నారాయణరావు, రమణ ఉన్నారు.



జీవీఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నేతలు

తహశీల్దార్ కార్యాలయం ఎదుట బర్మా కాందిశీకుల ఆందోళన

ఎన్.ఎ.డి.జంక్షన్ జూన్ 30 (ఆంధ్రజ్యోతి): తమకు కేటాయించిన స్థలాన్ని కొందరు ఆక్రమించి గోడ నిర్మించారని బర్మా కాందిశీకులు సోమవారం గోపాలపట్నం తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. బర్మా నుంచి వచ్చిన కాందిశీకుల పునరావాసం కోసం సర్వే నంబరు 13/ఎలో 9.5 ఎకరాలు ప్రభుత్వం కేటాయిస్తే, దానిని కొందరు ఆక్రమించి గోడ నిర్మించారని వాపోయారు. దీనిపై ఫిర్యాదులు ఇచ్చినా న్యాయం జరగలేదని పేర్కొన్నారు. 2024లో సర్వే చేసిన రిపోర్టులను ఇవ్వాలని తహశీల్దార్, ఇతర అధికారుల చుట్టూ తిరిగినా న్యాయం జరగలేదని కాందిశీకుల అసోసియేషన్ అధ్యక్షుడు నారాయణరావు ఆరోపించారు. రాష్ట్రంలో ప్రభుత్వాలు మారుతున్నాయి తప్ప సమస్యను పరిష్కరించే నాథుడే కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సర్వే రిపోర్టునకు సంబంధించి తహశీల్దార్ రమేశ్‌ను వివరణ కోరగా ఆర్‌టీఐ ద్వారా మాత్రమే ఇవ్వగలమన్నారు. సమస్యలను ఉన్నతాధికారుకు నివేదించి చర్యలు చేపడతామని వివరించారు.



ఆందోళన చేస్తున్న బర్మా కాందిశీకులు

డీసీసీబీలో అంతర్జాతీయ సహకార వేడుకలు

ఎన్.ఎ.డి.జంక్షన్ జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఐక్య రాజ్య సమితి 2025ను అంతర్జాతీయ సహకార సంవత్సరంగా ప్రకటించిన సందర్భంగా జీవీఎంసీ 52వ వార్డు వుడాకాలనీలో సోమవారం డీసీసీబీ చైర్మన్ కోన తాతారావు వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆఫీస్ ఆవరణలోని వెర్టికల్ గార్డెన్‌లో ప్రతిరోజూ ఒక చెట్టు, ప్రతి చెట్టు ఒక శ్వాస అనే నినాదంతో పచ్చదనాన్ని పెంచాలని ఆయన సూచించారు. ఈ వేడుకలను పురస్కరించుకుని మెరుగైన ప్రపంచాన్ని నిర్మించడానికి సహకార సంఘాలు, సంస్థలు ఎంతో కీలకంగా పనిచేయాలన్నారు. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో సహకార సంస్థల ప్రాముఖ్యతను అందరికీ వివరించాలని సూచించారు. సంస్థలను బలోపేతం చేయడానికి మరిన్ని బలమైన చట్టాలను రూపొందించాల్సిన అవసరం ఉందని కోనా అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ సీఈఓ డీవీఎస్ వర్మ, జిల్లా సహకార అధికారి టి.ప్రవీణ, అనకాపల్లి సహకార జిల్లా అధికారి ప్రేమస్వరూపారాణి తదితరులు పాల్గొన్నారు.



వేడుకలను ప్రారంభిస్తున్న చైర్మన్ కోన తాతారావు



మాతృశ్రీనగర్‌లో పూజలందుకున్న వారాహిమాత

వారాహి మాతకు విశేష పూజలు

కూర్మన్నపాలెం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మాతృశ్రీనగర్ శివాలయంలో సోమవారం వారాహిమాతకు ధర్మకర్త దామా సుబ్బారావు, దమయంతి దంపతులు పంచామృతాభిషేకాలు చేశారు. ఉత్సవాల సందర్భంగా అమ్మవారిని విశేషంగా అలంకరించారు భక్తులు పూజల్లో పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు 12 వినతులు

గాజువాక, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): గాజువాక జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 12 వినతులు అందాయి. జోనల్ పరిధిలో రోడ్ల మరమ్మతులు చేపట్టాలని, వీధి లైట్లు వేయాలని, కుక్కల బెడద నివారించాలని ప్రజలు, ప్రజా సంఘాల ప్రతినిధులు వినతి పత్రాలు అందజేశారు. జోనల్ కమిషనర్ శేషాద్రి వినతులు స్వీకరించి పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

వేపగుంటలో తొమ్మిది...

వేపగుంట: స్థానిక జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 9 వినతులు అందాయి. కృష్ణరాయపురంలో చికెన్ సెంటర్‌తో ఇబ్బందులు, పురుషోత్తపురంలో సెల్ టవర్ సమస్య, ఆనందపురం రోడ్డులో స్పీడ్‌బ్రేకర్స్ ఏర్పాటు, సుజాతానగర్‌లో యూజీడీ సమస్య, చినముషిడివాడ స్రవంతి అపార్ట్‌మెంట్ వద్ద పార్కింగ్, సుజాతానగర్‌లో వీధి కుక్కల సమస్యలు తొలగించాలని కోరారు.జెడ్సీ కె.హైమావతి వినతులు స్వీకరించారు.

'సేవతోనే ఆత్మ సంతృప్తి'

అగనంపూడి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సేవా కార్యక్రమాలే లక్ష్యంగా మానవత సంస్థ పనిచేస్తోందని ఆసంస్థ జిల్లా అధ్యక్షుడు డి.కృష్ణంరాజు పేర్కొన్నారు. జీవీఎంసీ 85వ వార్డులో సాయినగర్ కాలనీలో సోమవారం సంఘ సభ్యులతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన చురుగ్గా పనిచేస్తున్న పలువురిని అభినందించారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

డ్రోన్లతో దోమలమందు పిచికారీ



డ్రోన్‌తో దోమల మందు చల్లుతున్న దృశ్యం

అక్కిరెడ్డిపాలెం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెద్ద చెరువులో దోమల నివారణకు అధికారులు చర్యలు చేపట్టారు. డ్రోన్ సహాయంతో దోమల నివారణ మందులు పిచికారీ చేశారు. దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని సంబంధిత అధికారులు పేర్కొన్నారు. చెరువు చుట్టూ చెత్త, చెదారం వేయరాదని స్థానికులకు సూచించారు.

సినిమా గైడ్

● **కన్నప్ప** : జగదాంబ, కిన్నెర, శ్రీకన్య, లీలామహల్, లక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), నరసింహ (గోపాలపట్నం), నటరాజ్ (పెందుర్తి). లిఖిత (శ్రీహరిపురం), అరుణ (పెదగంట్యాడ),

● **కుబేర** : మెలోడి, సంగం, శ్రీరామా, కామేశ్వరి, గోకుల్, ఊర్వశి (కంచరపాలెం), సుకన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం)

● **ఎఫ్.1** : రమాదేవి, జగదాంబ,

● **మార్గన్ :** శారద, శరత్, లక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), శ్రీకన్య (గాజువాక), రమాదేవి,

● **8 వసంతాలు** : శ్రీ వెంకటేశ్వర, కన్య హెవెన్ (గాజువాక).

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 23, టమాటా 22, వంకాయలు (తెలుపు) 26, వంకాయలు (నలుపు) 26, బెండకాయలు 42, పచ్చిమిర్చి 44, కాకరకాయలు 38, బీరకాయలు 36, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 40, క్యాబేజీ 18, క్యారెట్ 40, దొండకాయలు 36, బంగాళదుంపలు 18, అరటికాయ 10, మునక్కాడలు (కిలో) 86, అల్లం 50, బరబాటి 40, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 55, బద్దచిక్కుడు 50, దోసకాయలు 16, వెల్లుల్లి 90, కొబ్బరికాయ 24, బీన్స్ (పెన్సిల్) 100, కీరదోస 34, కాప్సికమ్ 80, పొట్లకాయ 40, చేమదుంపలు 36, చిలగడదుంపలు 34, కంద 54, దేముడు చిక్కుడు 56, గోరుచిక్కుడు 40, కూర పెండలం 30, బ్రకోలి 45 , నూల్‌కోల్ 34, పనసపొట్టు 160, కొండఉసిరి 100, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 4 , చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 20, బూడిద గుమ్మడికాయ 20, కర్రపెండలం 24, మామిడి అల్లం 56, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 80.

కోడిగుడ్లు (నెక్)
(వంద - రూ.లలో)

విశాఖపట్నం	585
విజయనగరం	589
శ్రీకాకుళం	589

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	75
లైవ్ ధర	95
విత్ స్కిన్	160
స్కిన్‌లెస్	170



బలభద్ర, సుభద్రతో వామనావతారంలో జగన్నాథుడు

వామనావతారంలో జగన్నాథుడి దర్శనం

అగనంపూడి, జూన్ 30, (ఆంధ్రజ్యోతి): రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా జగన్నాథ స్వామి సోమవారం వామనావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక ఇంద్రజ్యుమ్న మందిరంలో కొలువుదీరిన సుభద్ర, బలభద్ర సహిత జగన్నాథుడికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు పెద్దసంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. బొర్రమాంబ పారాయణ సేవా సమితి మహిళలు లలితా సహస్రనామ పారాయణ చేశారు. సీతారామాంజనేయ భజన మండలి సభ్యులు భజనలు చేశారు. నిర్వాహకులు ప్రసాదాలను పంపిణీ చేశారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు కరణం పైడిరాజు, గల్లా సాయికుమార్, నాగేశ్వరరావు, నాగమణి, కుమారి, వరదరాణి, ఈవో పద్మావతి, టీడీపీ నేత కరణం జగదీశ్, తదితరులు పాల్గొన్నారు.

డీటీకి తహశీల్దార్‌గా అదనపు బాధ్యతలు



పెందుర్తి, జూలై 30 (ఆంధ్రజ్యోతి):పెందుర్తి డిప్యూటీ తహశీల్దార్ (డీటీ) ఏడిద సంతోశ్‌కిరణ్ తహశీల్దార్‌గా అదనపు బాధ్యతలు సోమవారం స్వీకరించారు. ఇప్పటివరకు తహశీల్దార్‌గా పనిచేసిన ఆనంద్‌కుమార్ బదిలీ జరిగి మూడు వారాలవుతున్నా ఎవరినీ నియమించలేదు. ఈ నేపథ్యంలో డిప్యూటీ తహశీల్దార్‌గా పనిచేస్తున్న సంతోశ్‌కిరణ్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా సంతోశ్‌కిరణ్ మాట్లాడుతూ రెవెన్యూ సిటిజన్ చార్ట్ ప్రకారం పౌర సేవలకు ఇబ్బందులు లేకుండా పని చేస్తానన్నారు.

మలుపు తిరగలేక ఇరుక్కుపోయిన లారీ

గోపాలపట్నం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): సింహాచలం రైల్వే విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి ట్రాన్స్‌ఫార్మర్ తీసుకువెళ్తున్న ఓ భారీ లారీ లింకు రోడ్డులో నుంచి బీఆర్‌టీఎస్ రోడ్డులోకి మలుపు తిరిగలేక నిలిచిపోవడంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. దీంతో ఈ మార్గం నుంచి వాహనాలు రాకపోకలు సాగించకుండా ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకున్నారు. బీఆర్‌టీఎస్‌పై డివైడర్ తొలగిస్తేగాని లారీ ప్రధాన రహదారిలోకి రాదని, రాత్రివేళ డివైడర్‌ను తొలగించి లింకురోడ్డులో నిలిచిపోయిన లారీని తరలించనున్నామని పోలీసులు తెలిపారు.

27 డిఫెన్స్ మద్యం సీసాల పట్టివేత

గాజువాక, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): డిఫెన్స్ మద్యం సీసాలను తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఎక్సైజ్ పోలీసులు సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. గాజువాక ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ములగాడ, మల్కాపురం ప్రాంతాల్లో దాడులు నిర్వహించగా పూర్ణామార్కెట్ ప్రాంతానికి చెందిన చట్టిబోయిన మల్లికార్జున, అనకాపల్లికి చెందిన కర్రి గంగరాజు ద్విచక్ర వాహనంపై 27 డిఫెన్స్ మద్యం సీసాలను తరలిస్తున్నట్లు గుర్తించి వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. దాడుల్లో ఎస్ఐ ఇ.రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి ఎంపికైన విద్యార్థులకు ఆర్థిక సాయం

ఉక్కుటౌన్‌షిప్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన ఇస్లాంపేట ఉన్నత పాఠశాల విద్యార్థులకు అగనంపూడి ప్రాంతానికి చెందిన దాతలు ఆర్థిక సాయం చేశారు. పాఠశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు జి.ప్రమీల చేతుల మీదుగా దాతలు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హైస్కూల్ నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపికవడం సంతోషంగా ఉందని, వీరికి దాతలు సాయం చేయడం విశేషమన్నారు. కార్యక్రమంలో విందుల వెంకటరమణ, జి.పూర్ణానందశర్మ, కలిపాక అప్పారావు, బలిరెడ్డి సత్యనారాయణ, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'ఉక్కు' నిర్వాసితులకు ఉపాధి కల్పించాలి

ఉక్కుటౌన్‌షిప్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ కోసం సర్వం త్యాగం చేసిన నిర్వాసితులకు ఉపాధి కల్పించాలని కోరుతూ కలెక్టర్‌కు ఉక్కు నిర్వాసితుల ఐక్య సంఘాల ప్రతినిధులు సోమవారం వినతి పత్రాన్ని అందజేశారు. స్టీల్‌ప్లాంట్‌లో విధులు నిర్వహించిన వారిలో చాలా మంది నిర్వాసితులను ఉక్కు యాజమాన్యం ఇటీవల తొలగించిందని పేర్కొన్నారు. నిర్వాసితులకు న్యాయం చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉచిత మెగా వైద్య శిబిరానికి స్పందన

పెదగంట్యాడ, జూన్30 (ఆంధ్రజ్యోతి): సింహగిరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి భారీ స్పందన లభించింది. ట్రస్ట్ వ్యవస్థాపకులు, సింహగిరి హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ కేవీ రామన్ వర్ధంతి సందర్భంగా కొత్తగాజువాకలో నిర్వహించిన శిబిరంలో వైద్యులు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. అనంతరం పేదమహిళలకు వస్త్రాలు పంపిణీ చేశారు. ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ కె.జమునా రాణి, డైరెక్టర్ కేవీఎస్ కల్యాణ్ డాక్టర్ మౌనిక, డాక్టర్ సంగీత లక్ష్మి, బాలు, సిబ్బంది పాల్గొన్నారు.



రోగులకు మందులు అందిస్తున్న డా.కళ్యాణ్

బుచ్చిరాజుపాలెం పోలీసుల కార్డన్ సెర్చ్

ఎన్.ఎ.డి.జంక్షన్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 90వ వార్డులో బుచ్చిరాజుపాలెం, గవరవీధి, రెడ్డివీధి, గొల్లవీధి, గాంధీనగర్ కాలనీ పరిసరాల్లో సోమవారం ఎయిర్‌పోర్టు పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఇళ్లల్లో తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో పత్రాలు లేని 4 ద్విచక్ర వాహనాలను గుర్తించినట్టు ఎయిర్‌పోర్టు సీఐ.ఉమామహేశ్వరరావు తెలియజేశారు. అసాంఘికక కార్యక్రమాలకు చెక్ పెట్టేందుకు, నేరాల నియంత్రణకు కాలనీవాసులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ తనిఖీల్లో ఎస్ఐ ప్రసాద్, ఎయిర్‌పోర్టుకు చెందిన 15మంది సిబ్బంది పాల్గొన్నారు.

'కార్మికుల సంక్షేమానికి బీఎంఎస్ కృషి'

అక్కిరెడ్డిపాలెం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): కార్మిక సంక్షేమానికి బీఎంఎస్ విశేష కృషి చేస్తోందని బీఎంఎస్ అఖిల భారత సంఘటన్ కార్యదర్శి బి.సురేంద్రన్ అన్నారు. షీలానగర్‌లో సోమవారం జిల్లాలోని వివిధ పరిశ్రమల ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన సురేంద్రన్ మాట్లాడుతూ ఇటీవల స్విట్జర్లాండ్‌లో జరిగిన అంతర్జాతీయ కార్మిక సమావేశాల్లో భారత కార్మిక సమస్యలు, సంక్షేమంపై ప్రతినిధులు మాట్లాడరన్నారు.పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు బీఎంఎస్ అండగా నిలుస్తోందని అన్నారు. సమావేశంలో బీఎంఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎం.జగదీశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంవీఎస్.నాయుడు, లోవరెడ్డి పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలి

గాజువాక, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): గాజువాక కోర్టు ప్రాంగణంలో ఈనెల 5న నిర్వహించే జాతీయ లోక్ అధాలత్ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని 13వ అదనపు జిల్లా జడ్జి జి.షణ్ముఖరావు కోరారు. గాజువాక కోర్టు కాంప్లెక్స్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జడ్జిలు ఎస్.కవిత, వి.పల్లవి, వై.శ్రీలక్ష్మి, సౌత్ ఏసీపీ టి.త్రినాథ్, సీఐలు, బార్ అసోసియేషన్ అధ్యక్షురాలు బి.యశోధర వేదమణి, న్యాయవాదులు పాల్గొన్నారు.

గ్లోబల్ గ్రీనరీ కోసం ప్రేమ వృక్షాల యజ్ఞం

ఉక్కుటౌన్‌షిప్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు స్టీల్ ప్లాంట్ సత్యసాయి సేవా సమితి కృషి చేస్తోందని ప్రతినిధులు పేర్కొన్నారు. సత్యసాయి ప్రేమతరులో భాగంగా మొక్కలు నాటి, పరిరక్షించే చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో సమితి ప్రతినిధులు ఆర్‌వీ.నాయుడు, బాబు, జి.రామకృష్ణ, రాజు, పైడినాయుడు, వి.రామారావు పాల్గొన్నారు.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★



లుంగీ కట్టు.. మాస్ లుక్!

కిరణ్ అబ్బవరం, యుక్తి తరేజా జంటగా జైన్స్ నాని తెరకెక్కిస్తోన్న చిత్రం 'కె-ర్యాంప్'. హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్ బేనర్లపై రాజేశ్ దండా, శివ బొమ్మకు నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రం నుంచి ఫస్ట్ లుక్ పోస్టర్ రిలీజ్ చేశారు. కిరణ్ అబ్బవరం లుంగీ కట్టులో మాస్, క్లాస్ కలసిన మేకోవర్‌లో ఆకట్టుకుంటున్నారు. బ్యాక్‌గ్రౌండ్‌లో మందు బాటిల్స్‌తో డిజైన్ చేసిన లవ్ సింబల్ కనిపిస్తోంది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ తుది దశకు చేరుకుంది. ఈ దీపావళికి విడుదల చేసేందుకు చిత్రబృందం సిద్ధమవుతోంది.

ఓటీటీలోకి 'తల్లి మనసు'



కమల్ కామరాజు, సాత్విక్, రచిత మహాలక్ష్మీ ప్రధాన పాత్రల్లో ముత్యాల సుబ్బయ్య తెరకెక్కించిన చిత్రం 'తల్లి మనసు'. ముత్యాల అనంత కిశోర్ నిర్మించారు. ఇటీవలె చిత్రం విడుదలైంది. తాజాగా, ఈ సినిమా ఓటీటీ వేదిక అమెజాన్ ప్రైమ్‌లోకి అందుబాటులోకి వచ్చిందని మేకర్స్ తెలిపారు.



పూజతో ప్రారంభం

తమిళ నటుడు విజయ్ సేతుపతి కథానాయకుడిగా పూరి జగన్నాథ్ ఓ చిత్రాన్ని తెరకెక్కించనున్న సంగతి తెలిసిందే. సోమవారం ఈ చిత్రాన్ని పూజా కార్యక్రమాలతో ప్రారంభించారు మేకర్స్. విజయ్‌కుమార్, సంయుక్త, టబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఛార్మీ కౌర్ సమర్పణలో పూరి జగన్నాథ్, జేబీ నారాయణరావు కొండ్రోల్లా సంయుక్తంగా సినిమాను నిర్మిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ప్రేక్షకులకు విభిన్నమైన అనుభూతిని ఈ సినిమా ద్వారా అందిస్తామని మేకర్స్ పేర్కొన్నారు. ఈ నెల నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలు కానుంది.

సున్నితమైన హాస్యంతో...



హీరో రానా దగ్గుబాటి తన నిర్మాణ సంస్థ స్పిరిట్ మీడియా బ్యానర్‌పై రూపొందిస్తున్న చిత్రం 'కొత్తపల్లిలో ఒకప్పుడు'. నూతన దర్శకురాలు ప్రవీణ పరుచూరి తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా గురించి మేకర్స్ మాట్లాడుతూ "సున్నితమైన హాస్యంతో నిండిన చిత్రమిది. అందర్నీ ఆలోచింపజేస్తుంది. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుంది" అని తెలిపారు. ప్రస్తుతం ఈ చిత్రం నిర్మాణ దశలో ఉంది.

కథలో భిన్న కోణాలుంటాయి

- శ్రీరామ్ వేణు



"తమ్ముడు' సినిమాలో కుటుంబ భావోద్వేగాలు, భిన్న కోణాలు ఉంటాయి. ట్రైలర్‌లో కథ ఎలా ఉండబోతుందో చెప్పాం' అని అన్నారు దర్శకుడు శ్రీరామ్ వేణు. నితిన్ హీరోగా ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'తమ్ముడు'. దిల్ రాజు, శిరీష్ నిర్మించారు. ఈ శుక్రవారం థియేటర్లలో విడుదలవుతున్న సందర్భంగా శ్రీరామ్ వేణు మీడియాతో మాట్లాడుతూ 'ఈ చిత్రానికి సెన్సార్ వాళ్లు కొన్ని కట్స్ చెప్పారు. మేము ఆ కట్స్ వద్దనుకున్నాం. సినిమాలో హీరోతోపాటు ఐదుగురు మహిళా క్యారెక్టర్లు బలంగా ఉంటాయి. 'విక్రమ్'లో కమల్ హాసన్ పాత్ర కథలో ఎలా ట్రావెల్ అవుతుందో అలా ఈ చిత్రంలోనూ ఉంటుంది. ఆర్చరీని కథలో చేర్చాలని చాలా సార్లు అనుకున్నాం. 'తమ్ముడు'లో కుదిరింది. ఆర్చరీ ట్రైనర్‌తో నితిన్‌కు 15 రోజులు శిక్షణ ఇప్పించాం. కథలో ప్రధానంగా బ్రదర్ సిస్టర్ సెంటిమెంట్ ఉన్నా అనేక కోణాల్లో మూవీ సాగుతుంది. 'కాంతారా' చూశాక సప్తమి గౌడ మా మూవీలోని క్యారెక్టర్‌కు బాగుంటుందని అనిపించి తీసుకున్నాం. మ్యూజిక్ డైరెక్టర్ అజనీష్ లోకనాథ్ మంచి బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ఇచ్చారు.

ఓ దినపత్రికలో వచ్చిన ఆర్టికల్ స్ఫూర్తితో 'తమ్ముడు' కథను సిద్ధం చేసుకున్నా. కథ విని దిల్‌రాజు గారు బడ్జెట్ గురించి ఆలోచించకుండా నిర్మించారు. ఈ కథకు సరిపోయే హీరో కోసం వెతికాం. నితిన్ బాగుంటాడని తీసుకున్నాం. లయ పాత్ర కోసం ఒకప్పటి స్టార్ హీరోయిన్‌కి కథ చెప్పాం. ఆమెకు కథ, క్యారెక్టర్ నచ్చింది. కానీ ఆమె వ్యక్తిగత కారణాల వల్ల నటించలేదు. అయితే మరోసారి ఇలాంటి క్యారెక్టర్ వస్తే తప్పకుండా నటిస్తానని చెప్పారు. నా ప్రతి సినిమా ఒక కొత్త జానర్‌లో ఉంటుంది. నేనెప్పుడూ జానర్ రిపీట్ చేయలేదు. నా స్క్రిప్ట్‌లో ఫీమేల్ క్యారెక్టర్లకు ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. ఇప్పటి దాకా అలా చేస్తూ వచ్చాను. తరవాత సినిమాకు ఎలా ఉంటుందో ఇప్పుడే చెప్పలేను' అని అన్నారు.

అల్లరి నరేశ్ 'ఆల్కహాల్'



హాస్య చిత్రాలతో తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో చెరగని స్థానం సంపాదించుకున్న అల్లరి నరేశ్, వైవిధ్యభరితమైన చిత్రాలతోనూ తన దైన ముద్ర వేస్తున్నారు. అదే కోవలో మరో వైవిధ్యమైన చిత్రంతో అలరించడం కోసం సీతార ఎంటర్‌టైన్‌మెంట్స్‌తో చేతులు కలిపారు. 'ఫ్యామిలీ డ్రామా' ఫేమ్ మెహర్ తేజ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు 'ఆల్కహాల్' అనే టైటిల్ ఖరారు చేశారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ఫస్ట్‌లుక్ పోస్టర్ ఆకట్టుకుంటోంది. కాగా, అల్లరి నరేశ్ సరసన రుహాని శర్మ కథానాయికగా నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలో వెల్లడించనున్నట్లు చిత్రబృందం పేర్కొంది.

రైల్వేస్టేషన్‌లో గంజాయి పట్టివేత

విశాఖపట్నం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): రైల్లో గంజాయి రవాణా చేస్తున్న రాజస్థాన్‌కు చెందిన కుషిరామ్‌ను పట్టుకుని 11 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్టు రైల్వే పోలీసులు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 402 ఫిర్యాదులు


అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 402 వినతులు అందాయి. ఇందులో రెవెన్యూకు 159, జీవీఎంసీ 84, పోలీసు 21, ఇతర విభాగాల నుంచి 138 ఫిర్యాదులున్నాయి. కలెక్టర్ హరేంధిర ప్రసాద్, జేసీ మయూర్ అశోక్, డీఆర్వో భవానీశంకర్, అధికారులు వినతులు స్వీకరించారు. అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని కలెక్టర్ ఆదేశించారు.

ఉక్కు నిర్వాసితుల ఆందోళన

తొలగించిన ఉక్కు నిర్వాసితులు, కాంట్రాక్ట్ కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఆందోళన చేశారు. ఉక్కు నిర్వాసితుల సంఘం, లేబర్ కాంట్రాక్ట్ యూనియన్ అధ్యక్షుడు పితాని భాస్కర్ మాట్లాడుతూ నిర్వాసితులకు మిగిలిన భూమి ఇవ్వాలి లేదా కార్మికులకు వన్ టైమ్ సెటిల్‌మెంట్ అమలుచేయాలని డిమాండ్ చేశారు. ప్లాంట్ నష్టానికి అధికారులే కారణమని, ఏసీ గదులలో కూర్చుని కాంట్రాక్ట్ కార్మికులతో పనులు చేయించారని, వారిపై వెంటనే సీబీఐతో దర్యాప్తు చేయించాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల్లో చదువుతున్న తమ పిల్లలకు ఫీజు రాయితీ కల్పించాలని, కార్పొరేట్ ఆసుపత్రులలో ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించాలని జర్నలిస్టు సంఘాల నాయకులు కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్‌కు వినతి పత్రాలు అందజేశారు.

జీవీఎంసీకి 130 వినతులు

వెంకోజీపాలెం: జీవీఎంసీలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 130 వినతులు వచ్చాయని మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. కమిషనర్ కేతన్ గార్గ్‌తో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అందిన అర్జీలు పరిశీలించి మూడు రోజుల్లో సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో 41 శాతం వృద్ధులు, దివ్యాంగులకు రేషన్ బియ్యం పంపిణీ

విశాఖపట్నం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): వృద్ధులు, దివ్యాంగులకు పూర్తిశాతం రేషన్ బియ్యం పంపిణీ చేయలేదు. వారి నివాసాలపై స్పష్టత లేకపోవడమే కారణమని తెలిసింది. జూన్ 26నుంచి 30 వరకు కేవలం 41శాతమే పంపిణీ చేశారు. జిల్లాలో 33,666 మంది వృద్ధులు, దివ్యాంగులు ఉండ గా 13,856 మందికే బియ్యం అందాయి. నాలుగేళ్లగా ఎండీయూల ద్వారా బియ్యం పంపిణీతో డీలరు, కార్డుదారుడి మధ్య సంబంధం తెగిపోయింది. దీంతో మంగళవారం నుంచి సరకులు పంపిణీ చేసే క్రమంలో వివరాలు తెలుసుకుని ఇళ్లకు అందించాలని ప్రభుత్వం సూచించింది. జిల్లాలో 641 రేషన్‌డిపోల ద్వారా 5,24,989 బియ్యంకార్డులకు మంగళవారం నుంచి బియ్యం, పంచదార అందజేస్తారు. గతనెలలో 4,92,796 మంది (94శాతం)కి సరకులు ఇచ్చారు. ఎండీయూ వ్యవస్థ రద్దు నేపథ్యంలో జూన్‌లో సరుకుల పంపిణీలో లోపాలు వెలుగులోకి వచ్చాయి. డిపోలను మారుమూలలకు తరలించడంతో సమస్య ఎదురయింది. ఫిర్యాదుల మేరకు పౌరసరఫరాల శాఖ స్పందించి డీలర్లకు ఆదేశాలు జారీ చేసింది. అందుబాటులోనే డిపో ఉండాలని స్పష్టంచేసింది. కార్డుదారులకు ఇబ్బందిలేకుండా సరకుల పంపిణీకి ఏర్పాట్లు చేశామని డీఎస్వో వి.భాస్కర్ తెలిపారు.

లంచం కేసులో యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ అధికారికి జైలు

విశాఖపట్నం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి):బీమా క్లెయిమ్ చెల్లింపు కోసం రూ.పది వేలు లంచం తీసుకున్నందుకు యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ ప్రకాశం జిల్లా కందుకూరు బ్రాంచి డెవలప్‌మెంట్ ఆఫీసర్‌కు సీబీఐ కోర్టు నాలుగేళ్ల జైలు శిక్ష, రూ.2వేలు జరిమానా విధించింది. ఈ మేరకు సీబీఐ విశాఖ డీఐజీ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2022లో కోలా రామనరసింహం యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ కందుకూరు బ్రాంచి ఇన్‌చార్జి డెవలప్‌మెంట్ అధికారిగా పనిచేశారు. ఆ సమయంలో బీమా ఉన్న గేదె మృతిచెందడంతో క్లెయిమ్ కోసం యజమాని దరఖాస్తు చేసుకున్నారు. ఇందుకు రామనరసింహం రూ.పది వేలు డిమాండ్ చేయడంతో బాధితుడు సీబీఐ అధికారులకు ఫిర్యాదు చేశారు. వారు లంచం తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. రామనరసింహంపై నేరం రుజువుకావడంతో జైలు శిక్ష, జరిమానా విధిస్తూ సీబీఐ కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి సోమవారం తీర్పు వెలువరించారు.

జీవీఎంసీలో 77 మంది ఉద్యోగ విరమణ


ఫణిరాంను సన్మానిస్తున్న అదనపు కమిషనర్ రమణమూర్తి

విశాఖపట్నం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న 77 మంది సోమవారం ఉద్యోగ విరమణ చేశారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో వారిని అదనపు కమిషనర్ రమణమూర్తి, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరెడ్డి, అడ్మినిస్ట్రేషన్ అధికారి పద్మజ తదితరులు సన్మానించారు. ఉద్యోగ విరమణ చేసిన వారిలో 64 మంది శాశ్వత , 13 మంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులున్నారు. గ్రేడ్-1 కమిషనర్ ఎంవీడీ ఫణిరాం ఉద్యోగ విరమణ చేశారు.

పథకాలు వినియోగించుకోవాలి

విశాఖపట్నం, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మత్స్య పరిశ్రమ అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటిస్తున్న పథకాలను అందిపుచ్చుకోవాలని సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ విశాఖ హెడ్, సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ జో అన్నారు. పథకాల వినియోగంపై సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ టెక్నాలజీ కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం జరిగిన రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడుతూ కేజ్ కల్చర్‌కు ప్రాధాన్యమిస్తే మంచి ఫలితాలుంటాయన్నారు. ఇనిస్టిట్యూట్ హెడ్ డాక్టర్ యు.శ్రీధర్, డాక్టర్ మధుసూదనరావు, డాక్టర్ జీవీపీ ప్రసాద్,డాక్టర్ మీనా, ఫిషరీస్ జేడీ డాక్టర్ పి.లక్ష్మణరావు, మూగి శ్రీరామమూర్తి,సూరాడ రాజారావు, అర్జిల్లి దాసు, కదిరి పోలరాజు పాల్గొన్నారు.

భార్య ప్రవర్తనతో విసిగి బలవన్మరణం

- కారణాలు పేర్కొంటూ సీపీకి 23 పేజీల సూసైడ్ నోట్, సెల్ఫీ వీడియో
- చర్యలు తీసుకోని మహారాణిపేట పోలీసులు
- కేసు మాఫీకి యత్నిస్తున్నారని మృతుని బంధువుల ఆరోపణ


కోటేశ్వరరావు మృతదేహం

మహారాణిపేట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధం తగదని నచ్చచెప్పినా భార్య తీరు మారకపోవడంతో భర్త ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అంతకుముందు 23 పేజీల సూసైడ్ నోట్ రాసి, తన చావుకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని నగర పోలీసు కమిషనర్‌కు సెల్ఫీ వీడియో పంపాడు. ఈ ఘటనకు కారకులపై మహారాణిపేట పోలీసులు చర్యలు తీసుకోకుండా కేసును మాఫీ చేసేందుకు యత్నిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థానికులు, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. కేతవరపు కోటేశ్వరరావు, పద్మావతిలకు 13 ఏళ్ల కిందట వివాహమైంది. వారికి ఇద్దరు పిల్లలు. వెంకటేశ్వరనగర్‌లో ఉంటున్నారు. కోటేశ్వరరావు బీచ్‌లో చిరువ్యాపారి. భార్య పద్మావతికి శ్రీనుతో పరిచయమై వివాహేతర సంబంధంగా మారింది. అతడి స్నేహితులు రాజు, జోస్నాలతో కూడా తిరుగుతూ ఉండేది. ఈ క్రమంలోశ్రీనివాస్‌కు రూ.5.75 లక్షలు ఇచ్చింది. దీంతో కోటేశ్వరరావు భార్యను ప్రశ్నించినా ఫలితం కనిపించలేదు. దీంతో ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. సీపీని ఉద్దేశించి 23 పేజీల లేఖ రాశాడు. ఆత్మహత్యకు కారణాలు,కారకులను పేర్కొన్నాడు. సెల్ఫీ వీడియోతీసి, జూన్ 25న ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి కేసు నమోదు చేశారు. కానీ నిందితులపై చర్యలు తీసుకోలేదు. కేసు నుంచి వారిని తప్పించేందుకు ప్రయత్నిస్తున్నారని బాధిత కుటుంబం ఆరోపిస్తోంది.

భార్య మందలించిందని ఆత్మహత్య

ఎంవీపీ కాలనీ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): పనిచేయకపోతే ఇల్లు గడిచేదెలా అని భార్య మందలించడంతో మనస్తాపానికి గురైన భర్త ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ప్లంబింగ్ పనులు చేసే గూడుపు శ్రీకాంత్ (31) భార్య, ఇద్దరు పిల్లలతో మద్దిలపాలెం చైతన్యనగర్‌లో నివాసం ఉంటున్నాడు. కొద్దికాలంగా పనికి వెళ్లడం లేదు. దీనిపై దంపతుల మధ్య శనివారం రాత్రి వాగ్వాదం జరిగింది. అప్పుడే చీమల మందు తాగేశాడు. వెంటనే వాంతి అవడంతో ఏమీ కాలేదు. ఆదివారం భార్య దుస్తులు ఉతకడానికి వెళ్లడంతో ఇంట్లోని ఫ్యానుకు ఉరివేసుకున్నాడు. శ్రీకాంత్ తండ్రి గూడుపు నాగరాజు ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా ఎస్ఐ ధనుంజయనాయుడు దర్యాప్తు చేస్తున్నారు.